RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS



We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ 11 అక్టోబర్ 2026 ఆదివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:115

## 'ఎంత మంది పోలీసులనైనా మోహరించుకోండి'.. ప్రధాని మోదీకి రాహుల్ సవాల్!



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సవాల్ విసిరారు. ప్రభుత్వం ఎంతమంది పోలీసులనైనా మోహరించుకోవచ్చని, నేతలను, యువతను అరెస్టు చేసుకోవచ్చని, కానీ ప్రతిపక్షాల పోరాటం మాత్రం ఆగదని శనివారం స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా వీడియో సందేశాన్ని విడుదల చేశారు.గత దశాబ్ద కాలంగా తాను మోదీ, ఆరెస్సెస్‌లపై పోరాడుతున్నానని, వారి గురించి తనకు పూర్తిగా తెలుసని రాహుల్ అన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో సహా పలువురి పేర్లను ప్రస్తావిస్తూ.. వారి ప్రధాన లక్షణం పిరికితనమని ఆరోపించారు. వారి చుట్టూ ఉచ్చు బిగుస్తోందని, అందుకే వారు భయపడుతున్నారని వ్యాఖ్యానించారు.

"మోదీ గారూ.. మీకు నచ్చింది చేసుకోండి. 10 వేలు, 20 వేలు, 50 వేల మంది పోలీసులను పిలవండి. మా నేతలందరినీ, యువతను, మమ్మల్ని అరెస్ట్ చేయండి. కానీ మేం మిమ్మల్ని చుట్టుముడుతున్నాం. వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు" అని రాహుల్ గాంధీ తన వీడియోలో ఘాటుగా హెచ్చరించారు. తమ వద్ద అవసరమైన సమాచారం ఉందని, రాజ్యాంగాన్ని, ప్రజల గొంతుకను కాపాడటమే తమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. గడిచిన 10-15 ఏళ్లలో జరిగిన అన్యాయాలు పునరావృతం కాకుండా చూస్తామన్నారు. దేశ యువత ధైర్యాన్ని చూసి గర్వపడుతున్నానని, నిరసనలు కొనసాగించాలని వారికి పిలుపునిచ్చారు.ఎలక్టోరల్ రోల్స్ ప్రత్యేక సవరణలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టాలని నిర్ణయించాయి. అయితే, శాంతిభద్రతల కారణాలను చూపుతూ ఢిల్లీ పోలీసులు ఈ ప్రదర్శనకు అనుమతి నిరాకరించారు. నిరసన స్థలానికి చేరుకోవడానికి ప్రయత్నించిన పలువురిని అదుపులోకి తీసుకుని, భారీగా పోలీసులను మోహరించారు. ఈ నేపథ్యంలోనే రాహుల్ గాంధీ పై వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఎన్నికల అంశాలపై కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు సాగిస్తున్న పోరాటంలో భాగంగానే రాహుల్ ఈ ప్రకటన చేశారు.

### ఎల్‌నినో ప్రభావంపై సీఎం రేవంత్ రెడ్డి

## ఉన్నతస్థాయి సమీక్ష

**నీరు, విద్యుత్ సంక్షోభం రాకుండా సమగ్ర కార్యాచరణకు ఆదేశం**
**అక్టోబర్ 12న అనధికారిక కేబినెట్ భేటీ ఏర్పాటు**
**కరువు ప్యాకేజీ కింద కేంద్రం రూ.20,000 కోట్లు ఇవ్వాలని డిమాండ్**



ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఉందని, దీన్ని అధిగమించేందుకు వెంటనే ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది జూన్ రుతుపవనాలు ప్రవేశించే వరకు సాగు, తాగునీరు, వ్యవసాయం, విద్యుత్ రంగాల్లో ఎదురయ్యే సవాళ్లను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రణాళిక ఉండాలని స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన సీనియర్ అధికారులతో ఎల్‌నినో ప్రభావంపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఎల్‌నినో కారణంగా రాష్ట్రంలో తీవ్రమైన సంక్షోభం తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. నీటిని, విద్యుత్‌ను చాలా పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం మార్కెట్లో విద్యుత్ అందుబాటులో లేదని, అందువల్ల విద్యుత్‌పై ఆధారపడిన పనులను తాత్కాలికంగా వాయిదా వేసుకోవడం మంచిదని సూచించారు. నీటి వృథాను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని, ఒక్క నీటిబొట్టు కూడా వృథా కాకుండా చూడాలని స్పష్టం చేశారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు మీడియా, సినిమా, సోషల్ మీడియా ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు.

ఎల్‌నినో ప్రభావం, తీసుకోవాల్సిన చర్యలపై మరింత లోతుగా చర్చించేందుకు అక్టోబర్ 12న అనధికారిక మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. దీని తర్వాత రైతులతో కూడా సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. దీర్ఘకాలిక ప్రణాళిక ఖరారు కోసం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కూడా ప్రభుత్వం యోచిస్తోంది.

ఎల్‌నినో కారణంగా రాష్ట్రంలో సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని, దాదాపు 235 మండలాల్లో కరవు ఛాయలు అలముకున్నాయని అధికారులు నివేదికల్లో పేర్కొన్నారు. ఇప్పటికే ఈ అంశంపై కేబినెట్ సబ్-కమిటీ ఒక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. కరవు ప్రభావిత మండలాలను ఆదుకునేందుకు రూ.20,000 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలని కేంద్రాన్ని కోరుతూ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసిన విషయాన్ని అధికారులు గుర్తుచేశారు. అక్టోబర్ 12న జరిగే సమావేశంలో వ్యవసాయం, సాగు, తాగునీటి లభ్యత, విద్యుత్ డిమాండ్, తక్షణ ఉపశమన చర్యలపై రైతు సంఘాలు, నిపుణుల సలహాలు కూడా తీసుకోనున్నారు.

## 'ప్రభుత్వానికి భయం పట్టుకుంది'.. ప్రియాంకా గాంధీ ఫైర్



ఢిల్లీలో నిరసన తెలిపేందుకు వచ్చిన యువతను అదుపులోకి తీసుకోవడంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వ వైఫల్యాలు బయటపడతాయనే భయంతోనే నిరసనలను అడ్డుకుంటున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే చర్యలకు పాల్పడుతున్నవారు దేశద్రోహానికి పాల్పడుతున్నట్లేనని వ్యాఖ్యానించారు.

ఢిల్లీలో సీజేపీ చేపట్టిన ఎస్ఐఆర్ (ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ) వ్యతిరేక నిరసనపై పోలీసులు ఆంక్షలు విధించారు. ఈ నేపథ్యంలో యువతను అదుపులోకి తీసుకోవడంపై ప్రియాంకా గాంధీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో స్పందించారు. గతంలో 254 మంది ఎంపీలను ఇబ్బందులకు గురిచేసి, అక్రమంగా అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు ప్రతిపక్ష పార్టీలకు చెందిన నిరసనకారులపైనా అదే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

దేశ రాజధానిని దిగ్బంధించి, రైళ్లు, మెట్రో సేవలను అడ్డుకుని, ఇంటర్నెట్ సేవలను నిలిపివేసి, అడుగడుగునా తనిఖీలు చేపడుతున్నారని ప్రియాంక ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన నిరసన హక్కును వినియోగించుకుంటున్న యువతపై దాడులు చేసి అదుపులోకి తీసుకుంటున్నారని విమర్శించారు. ఎన్నికల సంఘం సహకారంతో ఎన్నికల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో ప్రజాస్వామ్యం లేదని, ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలో నియంతృత్వ పాలన సాగుతోందని ఆరోపించారు.

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ కూడా ఈ ఘటనలపై స్పందించారు. ఢిల్లీని కోటలా మార్చేశారని, శాంతియుతంగా నిరసన తెలిపే యువతను చూసి ప్రభుత్వం ఆందోళన చెందుతోందని అన్నారు. రాజ్యాంగంలోని 326వ అధికరణం కల్పించిన ఓటు హక్కును బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని జైరాం రమేశ్ డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని కోరారు. దాదాపు 14 కోట్ల మంది భారతీయుల ఓటు హక్కులు ఇప్పటికే తొలగించారని ఆరోపిస్తూ, ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలగాలంటే ఈ ప్రక్రియను రద్దు చేయాలని పేర్కొన్నారు.

## ఢిల్లీలో సీజేపీ నిరసనకారులను తరలిస్తున్న బస్సుపై రాళ్ల దాడి

**దేశ రాజధానిలో 1000 మందికి పైగా ఆందోళనకారుల అరెస్ట్**
**సీజేపీ వ్యవస్థాపకుడు,**
**యూట్యూబర్ ధ్రువ్ రాఠీ సహా పలువురి అదుపు**
**సీఈసీకి వ్యతిరేకంగా సీజేపీ తలపెట్టిన ఆందోళన**
**నిరసనకు అనుమతి లేదన్న పోలీసులు.. భారీగా బలగాల మోహరింపు**

చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తలపెట్టిన నిరసన కార్యక్రమం ఢిల్లీలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. నిరసనలో పాల్గొనేందుకు వస్తున్న ఆందోళనకారులను పోలీసులు ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో అరెస్ట్ చేసిన నిరసనకారులను తరలిస్తున్న బస్సుపై జన్‌దేవాలన్ ప్రాంతంలో కొందరు రాళ్ల దాడికి పాల్పడటం కలకలం రేపింది.

అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, అదుపులోకి తీసుకున్న కొందరు కార్యకర్తలను పోలీసులు బస్సులో తరలిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ సమయంలో కొందరు నిరసనకారులు పోలీసుల కస్టడీ నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించడమే కాకుండా, బస్సును ధ్వంసం చేసేందుకు కూడా యత్నించారు. అయితే, పోలీసులు వారిని వెంటనే నియంత్రించి, నిర్దేశిత ప్రాంతానికి తరలించారు. ఈ ఘటనతో జన్‌దేవాలన్ పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేసి, భారీగా ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.



సీజేపీ పిలుపు మేరకు జంతర్ మంతర్ వద్దకు చేరుకుంటున్న నిరసనకారులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో శనివారం దేశ రాజధాని వ్యాప్తంగా 1,000 మందికి పైగా ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

మరోవైపు, నిరసనకు ముందే సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ డిప్కే, అధికార ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రముఖ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్, యూట్యూబర్ ధ్రువ్ రాఠీని కూడా గురుగ్రామ్‌లోని ఆయన నివాసంలో అరెస్ట్ చేశారు. సుమారు 50 మంది పోలీసులు మఫ్టీలో వచ్చి ఉదయం 8 గంటలకు అతడిని అదుపులోకి తీసుకున్నట్లు సీజేపీ తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొంది.

గతంలో నిర్వహించిన నిరసనల సందర్భంగా చట్టపరమైన ఆదేశాలను, ఇచ్చిన హామీలను సీజేపీ నిర్వాహకులు పాటించనందున, ఈసారి నిరసనకు అనుమతి నిరాకరించినట్లు పోలీసులు శుక్రవారమే స్పష్టం చేశారు. ప్రస్తుతం ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో భారీ పోలీసు బందోబస్తు కొనసాగుతోంది.

## ఢిల్లీలో హై టెన్షన్.. మమతా, కేజ్రీవాల్ సహా పలువురు మాజీ సీఎంల అరెస్ట్

**ఢిల్లీలో నిరసనల ఉద్రిక్తత.. మమతా, కేజ్రీవాల్ అరెస్ట్**
**సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ విపక్షాల డిమాండ్**
**అనుమతి లేదంటూ నేతలను అదుపులోకి తీసుకున్న ఢిల్లీ పోలీసులు**
**కేరళ మాజీ సీఎం పినరయి విజయన్‌తో పాటు పలువురు ఎంపీల నిర్బంధం**

రాజధాని ఢిల్లీలో నేడు తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసనల్లో పాల్గొన్న పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారితో పాటు తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు, కేరళ మాజీ సీఎం పినరయి విజయన్ సహా పలువురు విపక్ష నేతలను కూడా నిర్బంధించి డిటెన్షన్ సెంటర్‌కు తరలించారు.



ఎన్నికల కమిషన్, ఎన్నికల ప్రక్రియలకు సంబంధించిన ఆరోపణలపై విపక్షాలు తలపెట్టిన ఆందోళనల్లో పాల్గొనేందుకు మమతా బెనర్జీ ఢిల్లీకి వచ్చారు. సెంట్రల్ ఢిల్లీలోని సౌత్ అవెన్యూ సమీపంలో పోలీసులు ఆమెను అడ్డుకోవడంతో, సమీపంలోని బస్టాండ్‌లో బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో పోలీసులు ఆమెను, టీఎంసీ ఎంపీలు డెరెక్ ఓబ్రెయిన్, డోలా సేన్‌లను అదుపులోకి తీసుకున్నారు.మరోవైపు ఇదే నిరసనలో పాల్గొనేందుకు తన నివాసం నుంచి బయటకు వస్తున్న అరవింద్ కేజ్రీవాల్‌ను పోలీసులు మార్గమధ్యంలోనే నిర్బంధించారు. కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్ వంటి ఇతర నేతలను కూడా అరెస్ట్ చేశారు.

జంతర్ మంతర్ వద్ద సీజేపీ ఈ నిరసనకు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు ఢిల్లీ వ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశారు. ఢిల్లీకి చేరుకున్న సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ డిప్కేను కూడా పోలీసులు నిర్బంధించారు. నగరంలో నిరసనలకు ఆంక్షలు అమలులో ఉన్నాయని, ఆందోళనకు ముందస్తు అనుమతి లేనందునే నేతలను అదుపులోకి తీసుకున్నట్టు ఢిల్లీ పోలీసులు తెలిపారు.

ఓటర్ల జాబితా సవరణలతో పాటు ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతపై విపక్షాలు కొంతకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలోనే ఎన్నికల కమిషన్ జవాబుదారీగా ఉండాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టాయి. ఈ అరెస్టుల నేపథ్యంలో భవిష్యత్తులో తమ ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని విపక్ష నేతలు సూచిస్తున్నారు.

# ప్రజాబలం

11 అక్టోంబర్ 2026 ఆదివారం


## విశ్వసనీయత పునాదులు తవ్వుతారా

ఒక మనిషి శరీరంలో ఏదైనా అవయవం గాయపడితే, ఆ అవయవానికి చికిత్స చేసి నయం చేయడానికి ప్రయత్నిస్తాం తప్ప? దాన్ని నరికి పారేయాలని ఎవరు అనుకోరు. ప్రజాస్వామ్య వ్యవస్థలైనా అంతే!"ప్రజాస్వామ్య వ్యవస్థల్లో లోపాలు, వివాదాలు రావడం సహజం. భారతదేశం లాంటి అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో అత్యంత కీలకమైన బాధ్యత నిర్వర్తించే ఎన్నికల సంఘం సైతం ఇందుకు మినహాయింపు ఏమీ కాదు. అయితే, ఏదైనా లోపం కనిపించినంత మాత్రాన , ఎన్నికల నిర్వహణలో అభిప్రాయ భేదాలు తలెత్తినంత మాత్రాన? శతాబ్దాలుగా ప్రజాస్వామ్యానికి రక్షణ కవచంగా నిలిచిన ఒక రాజ్యాంగ వ్యవస్థ విశ్వసనీయతనే పునాదులతో సహా తవ్వి తీయాలని చూడటం అత్యంత ప్రమాదకరం. ప్రస్తుతం ఎన్నికల సంఘం కమిషనర్ల నియామకం నుంచి మొదలుకొని, ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వరకు ప్రతి చిన్న అంశం రాజకీయ వివాదాలకు ఆజ్యంగా మారుతోంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ , ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీ నుండి భారత ప్రధాన న్యాయమూర్తిని తప్పిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన చట్టంపై నేడు తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిజానికి, సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పు సూచన మేరకు పార్లమెంట్ ద్వారా ఒక చట్టాన్ని తీసుకురావాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది. ఆ చట్టంలో సీజేఐ ప్రాతినిధ్యం ఉండేలా చూస్తే వ్యవస్థకు మరింత తటస్థత వచ్చేదన్న మాట వాస్తవమే. కేంద్రం అలా చేయకుండా పార్లమెంట్ అత్యధిక మెజారిటీతో ఈ చట్టాన్ని ఆమోదించింది.ఇది పార్లమెంట్ చేసిన రాజ్యాంగబద్ధమైన చట్టం. దీనిపై సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. విచారణ జరుగుతోంది కూడా. కానీ, చట్టంలోని నియమాలను బూచిగా చూపిస్తూ, కమిషనర్ల మధ్య ఉండే అంతర్గత అభిప్రాయ భేదాలను ఆధారంగా చేసుకుని, కమిషన్ మొత్తాన్నే ప్రధాన రాజకీయం వైపు నెట్టడం సమంజసమా?. ఇక్కడ అసలు విషయమేమిటంటే? ఎన్నికల సంఘం అనేది మ్యాచ్‌ను నిర్వహించి ఫలితాలు ప్రకటించే అంపైర్ లాంటిది మాత్రమే. గ్రౌండ్‌లో ఆడేది రాజకీయ పార్టీలు, తీర్పు ఇచ్చేది ప్రజలు. ఎన్నికల సంఘం అనుకుంటే ఫలితాలను మార్చేస్తుందని అనుకోవడం, పక్షపాతం చూపిస్తుందని చెప్పడం కేవలం అపోహ మాత్రమే. అది అసాధ్యమని విమర్శలు చేసే రాజకీయ పార్టీలకూ లోపల బాగా తెలుసు. కానీ, ప్రస్తుత విపక్షాలు ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై విమర్శలు గుప్పిస్తూ, ఆయన రాజీనామాను తమ ప్రధాన రాజకీయ ఎజెండాగా మార్చుకున్నాయి. సీఈసీతో రాజీనామా చేయించడం ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని మానసికంగా, రాజకీయంగా బలహీనపరిచామని చెప్పుకోవడానికి ఇదొక పొలిటికల్ టార్గెట్ గా మారింది.చరిత్ర తిరగేస్తే, ఎన్నికల సంఘంలో కమిషనర్ల మధ్య వివాదాలు లేదా విభేదాలు రావడం ఇదే మొదటిసారి కాదు. ఇంట్లో నలుగురు అన్నాదమ్ములు ఉంటే గొడవలు రావడం సహజం? అంతమాత్రాన ఇల్లు కూల్చుకోరు కదా!. 1990ల కాలంలో టి.ఎన్. శేషన్ సింగిల్ మెంబర్ కమిషన్‌ను మల్టీ-మెంబర్ కమిషన్‌గా మార్చినప్పుడు తలెత్తిన ఘర్షణలు, ఆ తర్వాత ఎం.ఎస్. గిల్, జి.వి.జి. కృష్ణమూర్తిల మధ్య నడిచిన సుదీర్ఘ ఆధిపత్య పోరాటం, లేదా 2009లో అప్పటి సీఈసీ ఎన్.గోపాలస్వామి తన తోటి కమిషనర్ నవీన్ చావ్లాపై వేటు వేయాలని రాష్ట్రపతికి సిఫార్సు చేసిన ఘటన? ఇవన్నీ ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలకు నిదర్శనాలు. గతంలో అశోక్ లవాసా కూడా తన విభేదాభిప్రాయాలను రికార్డు చేశారు. ఇవన్నీ వ్యవస్థలోని ప్రజాస్వామ్య స్ఫూర్తిని, అభిప్రాయ స్వేచ్ఛను చూపించే చెక్స్ అండ్ బ్యాలెన్సెస్ మాత్రమే. అంతర్గత విభేదాలు ఉన్నంత మాత్రాన వారు నిర్వహించిన ఎన్నికలను రద్దు చేయాలని కానీ, కమిషన్ ఉనికినే రద్దు చేయాలని కానీ ఆనాడు ఏ రాజకీయ పార్టీ డిమాండ్ చేయలేదు. కానీ, నేడు విపక్షాలు ఏకంగా ఎన్నికల చెల్లుబాటునే ప్రశ్నించే స్థాయికి వెళ్లాయి. ఇక్కడే అసలు ఓటమి రాజకీయం దాగి ఉందనేది స్పష్టమవుతోంది.ముఖ్యంగా కాంగ్రెస్ సహా కొన్ని ప్రధాన ప్రతిపక్ష పార్టీలు తమ వరుస ఓటములకు ప్రజల తీర్పు కారణం కాదు, ఎన్నికల సంఘం , ఈవీఎంల మేనేజ్‌మెంట్‌యే కారణం అని ప్రజల మెదడుల్లోకి ఎక్కించాలని చూస్తున్నాయి. ఇది తీవ్రమైన ముప్పు. ఎలక్షన్ కమిషన్‌లో ఎవరున్నా, సీఈసీగా ఏ అధికారి కూర్చున్నా? క్షేత్రస్థాయిలో ప్రజలు ఓటు వేయకపోతే ఏ పార్టీ కూడా గెలవలేదు. ప్రజల్లో మద్దతు కోల్పోయినప్పుడు, తమ విధానాల్లోని లోపాలను సరిదిద్దుకోవడానికి బదులుగా రాజ్యాంగ వ్యవస్థలపై బురద జల్లడం వల్ల ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల ప్రజలకు ఉండే నమ్మకం సడలిపోతుంది. దేశంలో ఒకప్పుడు ఈవీఎంల వ్యవస్థను ప్రవేశపెట్టడంలో కీలక పాత్ర పోషించిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు కాలం చెల్లిన వాదనలను ముందుకు తెస్తూ మళ్లీ బ్యాలెట్ పేపర్ల విధానమే కావాలని తీర్మానించడం విడ్డూరంగా ఉంది. అంతేకాకుండా, ఎన్నికల ప్రక్రియకు ముందు పారదర్శకత కోసం చేపట్టే ఓటర్ జాబితా సవరణలను వ్యతిరేకించడం ద్వారా ఆ పార్టీ నిజస్వరూపం బయటపడుతోంది. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే సంస్కరణలను స్వాగతించాల్సింది పోయి, వాటిని అడ్డుకోవాలని చూడటం ఆ పార్టీ రాజకీయ అపరిపక్వతకు నిదర్శనం. ఎన్నికల సంఘంలో లోపాలు ఉంటే, పారదర్శకత లోపిస్తే, నియామక ప్రక్రియలో అధికార పక్షం ఆధిపత్యం పెరిగితే? దానిపై ఖచ్చితంగా పోరాడాలి. న్యాయస్థానాల ద్వారా, పార్లమెంట్ చర్చల ద్వారా ఎన్నికల సంస్కరణల కోసం ఒత్తిడి తేవాలి. కానీ, తమ రాజకీయం కోసం, స్వల్పకాలిక ప్రయోజనాల కోసం, వరుస ఓటములను కప్పిపుచ్చుకోవడానికి వ్యవస్థల విశ్వసనీయతనే తెగనరకడం రాజకీయం అనిపించుకోదు. అది కేవలం చేతకానితనం మాత్రమే అవుతుంది. రాజకీయ పార్టీలు కూడా ప్రజల్లో నమ్మకాన్ని పెంచుకుని, వారి మెప్పు పొంది గెలవడానికి ప్రయత్నించాలి. తమ వైఫల్యాలను ఎన్నికల సంఘంపైకి తోసేసి చేతులు దులుపుకునే సంస్కృతికి ఇప్పటికైనా స్వస్తి పలకాలి. వ్యవస్థల లోపాలను సరిదిద్దే దిశగా సాగే పోరాటమే ప్రజాస్వామ్యాన్ని రక్షిస్తుంది తప్ప, వ్యవస్థలను నాశనం చేసే ధోరణి దేశానికే చేటు చేస్తుంది!. దురదృష్టవశాత్తూ కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష కూటమి పార్టీలు అదే చేస్తున్నాయి.

## బతుకమ్మ పండుగ తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీక

## - రాష్ట్ర ప్రజలకు గవర్నర్ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు

హైదరాబాద్ 10, అక్టోబర్ 2026,తెలంగాణకే ప్రత్యేకమైన బతుకమ్మ పండుగ రాష్ట్ర సాంస్కృతిక వారసత్వానికి, సంప్రదాయాలకు, ప్రకృతితో మనకున్న అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుందని రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. ఎంగిలిపూల బతుకమ్మతో పూల పండుగ ప్రారంభమవుతున్న సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ, ప్రత్యేకించి మహిళలకు గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. వివిధ రకాల పూలతో బతుకమ్మను అలంకరించి, సామూహికంగా వేడుకలు జరుపుకోవడం తెలంగాణ ప్రజల ఐక్యతకు, ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు నిదర్శనమని పేర్కొన్నారు. గౌరమ్మ ఆశీస్సులతో ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని, తెలంగాణ సాంస్కృతిక వైభవం ప్రపంచవ్యాప్తంగా విరాజిల్లాలని గవర్నర్ ఆకాంక్షించారు.

## రీసైకిల్డ్ వాటర్ వినియోగంపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష



హైదరాబాద్ రీసైకిల్డ్ వాటర్ వినియోగంపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ నగరంలో విపరీతగా రద్దీ ఉన్న ప్రాంతాల్లో పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ ఏర్పాటుకు అవసరమైన అంశాలపై అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎక్కువ మంది ప్రజలు రాకపోకలు సాగించే ప్రాంతాలతో పాటు వివిధ కర్మాగారాల్లో పని చేసే కార్మికులు, ఉద్యోగులు ప్రయాణించే ప్రాంతాలను మెట్రో, ఎంఎంటీఎస్, బస్ స్టేషన్లతో అనుసంధానించేలా పీఆర్టీ ఉండేలా డిజైన్ చేయాలని సూచించారు.ప్రపంచంలోని అత్యుత్తమ పీఆర్టీలపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని ఈ సందర్భంగా ఆదేశించారు. సాధ్యమైనంత త్వరగా పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందులో ముఖ్యమైన కాలనీల ఎంపిక, అత్యాధునిక సాంకేతికత, నిర్వహణకు పెద్దపీట వేయాలన్నారు. క్యూర్ పరిధిలో వివిధ ప్రాంతాల మధ్య అనుసంధానత పెరిగేలా, రహదారుల్లో సజావుగా రాకపోకలు సాగించేలా ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వే విధానంతో రాకపోకలు మరింత సజావుగా సాగేలా తీసుకోవాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి అధికారులకు ఆదేశించారు. కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వేకు వివిధ కాలనీలు, రహదారుల నుంచి వచ్చే రహదారులు కలిసే చోటుతో పాటు ఫ్రీ లెఫ్ట్, యూటర్న్‌ల విషయంలో తీసుకుంటున్న చర్యలను అధికారులు వివరించారు.యూటిలిటీస్ తరలింపును వేగవంతం చేసి పనులు త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీ చెక్‌పోస్టు వైపు ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.ముంబై వంటి నగరాల్లో ఏడాదిలోపే పనులు పూర్తవుతున్నాయని, అక్కడ వినియోగిస్తున్న సాంకేతికత, పనుల చేపట్టే విధానంపై అధ్యయనం చేయాలని సూచించారు. ప్రారంభించిన పనులు ఏడాదిలోపు పూర్తయ్యేలా చూడాలని చెప్పారు. హైదరాబాద్-ముంబై బుల్లెట్ ట్రైన్ మార్గానికి సమాంతరంగా రేడియల్ రోడ్డు నిర్మాణంపై అధ్యయనం చేయాలని చెప్పారు. శంకర్‌పల్లి-చేవెళ్ల మధ్య ఇప్పుడు ఉన్న రహదారుల విస్తరణతో పాటు నూతన రోడ్ల నిర్మాణానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు. రీసైకిల్డ్ వాటర్ వినియోగానికి సంబంధించిన పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. 500 ఎంఎల్‌డీ రీసైకిల్డ్ వాటర్ వినియోగానికి సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీ, చందన్‌వల్లి, ఆలూరులోని డేటా సెంటర్లు, ఇతర పరిశ్రమలు రీసైకిల్డ్ వాటర్ వినియోగించుకునేందుకు వీలుగా పనులు చేపట్టాలని ఆదేశించారు. హై-రైజ్ బిల్డింగుల నిర్మాణం, ల్యాండ్‌స్కేప్స్, పార్కుల్లో రీసైకిల్డ్ వాటర్ వాడేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి గారు ఆదేశించారు. ఈ సమావేశంలో సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ సలహాదారు ఎన్‌వీఎస్ రెడ్డి, అదనపు మేనేజింగ్ డైరెక్టర్ అజిత్ రెడ్డి, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ల కమిషనర్లు ఆర్.వి.కర్ణన్, సృజన,వినయ్ కృష్ణారెడ్డి, వాటర్ బోర్డు ఎండీ అశోక్ రెడ్డి తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఖమ్మంలో నిర్వహించిన నల్గొండ,ఖమ్మం,వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం

### ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క.



వనపర్తి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఉప ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించే ప్రక్రియను ఉద్యమంలా చేపట్టాలని, గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిల్లో సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు కలుగుతున్న ప్రయోజనాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అన్నారు. సన్నబియ్యం పంపిణీ, రైతు భరోసా, గృహజ్యోతి, ఉచిత విద్యుత్, చేయూత పింఛన్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాలతో ప్రజల జీవితాల్లో వస్తున్న మార్పులను ప్రతి ఇంటికీ వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు.కాంగ్రెస్ పార్టీతో సుదీర్ఘ అనుబంధం కలిగిన కుటుంబం నుంచి వచ్చిన రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి విజయాన్ని ప్రతి నాయకుడు, కార్యకర్త తమ బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఓటరు నమోదు నుంచి ఎన్నికల్లో ఓటు వేసే వరకు ప్రతి దశలోనూ అప్రమత్తంగా వ్యవహరిస్తూ కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని కోరారు.సంక్షేమ పథకాలే కాంగ్రెస్ విజయానికి బలమని పేర్కొంటూ, పార్టీ శ్రేణుల ఐక్యత, సమష్టి కృషితో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ మెజారిటీ సాధించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, మట్టా రాగమయి, కోరెం కనకయ్య తదితరులు పాల్గొన్నారు

## తమిళనాట ఆసక్తికరం... కాఫీ తాగుతూ కేఫ్‌లో రాహుల్ గాంధీ, సీఎం విజయ్ ముచ్చట్లు

**తమిళనాడు సీఎం విజయ్‌తో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ భేటీ**

**విజయ్ నివాసంలో గంటపాటు సమావేశమై రాజకీయాలపై చర్చ**

**ఓ కేఫ్‌లో కాఫీ తాగుతూ ప్రజలతో కలిసి సెల్ఫీలు దిగిన నేతలు**

**తమిళనాడులో కాంగ్రెస్-టీవీకే కూటమి నేపథ్యంలో భేటీకి ప్రాధాన్యం**



తమిళనాడు రాజకీయాల్లో శనివారం ఓ ఆసక్తికరమైన సన్నివేశం ఆవిష్కృతమైంది. క్యాపిచినో, టిరమిసు, కుకీస్.. వీటికి రాజకీయ చర్చలు తోడైతే ఆ వాతావరణం ఎలా ఉంటుందో చెన్నై నగరం ప్రత్యక్షంగా వీక్షించింది. లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ మధ్య జరిగిన ఈ భేటీ, ఇరు నేతల మధ్య బలపడుతున్న స్నేహ బంధానికి, రాజకీయ సమన్వయానికి అద్దం పట్టింది.

శనివారం ఉదయం చెన్నై శివార్లలోని నీలంకరైలో గల తన నివాసానికి విచ్చేసిన రాహుల్ గాంధీకి సీఎం విజయ్ సాదర స్వాగతం పలికారు. ఇరువురు నేతలు సుమారు గంటపాటు సమావేశమై సమకాలీన రాజకీయ పరిణామాలపై చర్చించారు. కేవలం అధికారిక చర్చలకే పరిమితం కాకుండా, వారి మధ్య నెలకొన్న స్నేహపూర్వక వాతావరణం అందరి దృష్టినీ ఆకర్షించింది.

తూర్పు తీర రహదారి వెంట ప్రశాంతంగా ఉండే నీలంకరై ప్రాంతంలో ప్రారంభమైన ఈ భేటీ, అనంతరం సమీపంలోని ఒక కేఫ్‌కు మారింది. అక్కడ ఇద్దరు నేతలు క్యాపిచినో, టిరమిసు, కుకీలు ఆస్వాదిస్తూ.. సాధారణ రాజకీయ సమావేశాలకు భిన్నమైన వాతావరణంలో గడిపారు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు, అభిమానులు పెద్ద సంఖ్యలో కేఫ్ వద్దకు చేరుకున్నారు. రాహుల్, విజయ్ వారితో సరదాగా ముచ్చటించి సెల్ఫీలు దిగారు. వీటికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.కేఫ్ నుంచి నిష్క్రమించిన అనంతరం రాహుల్ గాంధీ నగరంలోని ఓ హోటల్‌కు చేరుకున్నారు. యువత కోసం ఉద్దేశించిన 'ఛాత్రోన్ కీ గూంజ్' తాజా ఎడిషన్‌లో పాల్గొనేందుకు ఆయన చెన్నై పర్యటనకు వచ్చారు. ఈ కార్యక్రమానికి తమిళనాడు వ్యాప్తంగా లక్ష మందికి పైగా విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

# ఢిల్లీ నిరసనలపై కేంద్రం ఆంక్షలు.. సుప్రీంకోర్టు కీలక నిర్ణయం

**ఆదివారం ప్రత్యేకంగా సుప్రీంకోర్టు విచారణ**

**మెట్రో మూసివేతపై కోర్టు ధిక్కరణ పిటిషన్**

**ముగ్గురు ఉన్నతాధికారులపై చర్యలకు డిమాండ్**

**నిరసనకారుల నిర్బంధంపైనా మరో పిటిషన్**

**ప్రజా రవాణా పూర్తిగా నిలిపివేయొద్దన్న కోర్టు**



ఢిల్లీలో నిరసనల నేపథ్యంలో మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దుపై సుప్రీంకోర్టు కీలకంగా స్పందించింది. ఈ నెల 9న ఇచ్చిన ఆదేశాలను అధికారులు ఉల్లంఘించారంటూ దాఖలైన పిటిషన్‌పై ఆదివారం ప్రత్యేకంగా విచారణ చేపట్టనుంది. నిరసనల సమయంలో ప్రజా రవాణాను పూర్తిగా నిలిపివేయకూడదని కోర్టు స్పష్టం చేసినప్పటికీ.. ఆంక్షలు కొనసాగించారన్నది పిటిషనర్ ఆరోపణ.

జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనతో కూడిన ప్రత్యేక ధర్మాసనం ఈ కేసును విచారించనుంది. న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌తో పాటు, నిరసనల సమయంలో పలువురిని నిర్బంధించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన మరో పిటిషన్‌నూ ధర్మాసనం పరిశీలించనుంది.

**నిరసనకారుల నిర్బంధంపైనా విచారణ**

ఢిల్లీలో శనివారం జరిగిన నిరసనల సందర్భంగా ప్రతిపక్ష నేతలను ముందస్తుగా నిర్బంధించడాన్ని సవాలు చేస్తూ తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ, సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. నలుగురు మాజీ ముఖ్యమంత్రులు సహా ప్రతిపక్ష నేతలను నిర్బంధించడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు.

శాంతియుతంగా నిరసన తెలిపే ప్రాథమిక హక్కును అణచివేయడానికి ముందస్తు నిర్బంధాన్ని ఉపయోగించకూడదని ఆమె వాదించారు. నిరసనకారులను రోడ్లపై నుంచి, ప్రతిపక్ష నేతలను వారి ఇళ్ల నుంచి పోలీసులు తీసుకెళ్లడంపైనా ప్రశ్నించారు.

**ముగ్గురు ఉన్నతాధికారులపై చర్యలు కోరుతూ పిటిషన్**

కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్, ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్, ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్‌సీ) ఛైర్‌పర్సన్ డి.థారాపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని త్రిపాఠి కోరారు. సుప్రీంకోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా పట్టించుకోలేదని ఆరోపించారు.

మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దు కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే, ఈ ఆరోపణలపై కోర్టు ఇంకా ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదు.

**అక్టోబర్ 9న సుప్రీంకోర్టు ఏమంది?**

ఢిల్లీలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టనున్న నేపథ్యంలో 57 మెట్రో స్టేషన్లను మూసివేయాలని ఢిల్లీ పోలీసులు సూచించారు. న్యూఢిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్ రైల్వే స్టేషన్లకు వచ్చే మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లపైనా ఆంక్షలు విధించారు. ఆ తర్వాత డీఎంఆర్‌సీ మూసివేతల సంఖ్యను 45కి తగ్గించింది.

ఈ ఆంక్షలపై విచారణ సందర్భంగా ప్రజా రవాణాను పూర్తిగా నిలిపివేయడం సరికాదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. భద్రతా అవసరాలను దృష్టిలో పెట్టుకుని సేవలను నియంత్రించవచ్చని, కానీ పూర్తిగా నిషేధించకూడదని స్పష్టం చేసింది. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ముందుగానే ట్రాఫిక్ సూచనలు ఇవ్వాలని, శాంతియుత నిరసనలకు తగిన సౌకర్యాలున్న ప్రత్యామ్నాయ ప్రాంతాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించింది. ఆ ఆదేశాలు అమలయ్యాయా లేదా అన్నది ఆదివారం విచారణలో కీలకంగా మారనుంది.

# గత ఏడాదితో పోలిస్తే రిజిస్ట్రేషన్ల ఆదాయం 21 శాతానికి పైగా పెరిగిందన్న పొంగులేటి

**ఇదే రేవంత్ రెడ్డి సమర్థ పాలనకు నిదర్శనమని వ్యాఖ్య**

**పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోని భూ అక్రమాలను వెలికితీస్తున్నామని వెల్లడి**

తెలంగాణలో భూముల విషయంలో బీఆర్ఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు తిరస్కరించారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్థ పాలనపై విశ్వాసం ఉంచారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్లు గణనీయంగా పెరగడమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.



ఈ అంశంపై ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఆగస్టు మధ్య కాలంలో వ్యవసాయ, వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వ ఆదాయం భారీగా పెరిగిందని వివరించారు. గత ఏడాదితో పోలిస్తే స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం 21.86 శాతం వృద్ధి చెందిందని తెలిపారు. ఈ గణాంకాలే ప్రభుత్వ పనితీరుకు, సీఎం రేవంత్ రెడ్డి పాలనా సామర్థ్యానికి నిదర్శనమని స్పష్టం చేశారు.

రాజకీయ లబ్ధి కోసం భూములపై బీఆర్ఎస్ చేసిన అసత్య ప్రచారాలను, ఆరోపణలను ప్రజలు నమ్మలేదని పొంగులేటి అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన భూ అక్రమాలను తమ ప్రభుత్వం వెలికితీస్తోందని తెలిపారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపుతూ, ప్రజలకు వివాదరహిత భూములను అందించేందుకు కృషి చేస్తున్నామని ఆయన వివరించారు.

# ఢిల్లీని పాకిస్థాన్‌కు అప్పగించారా?: కేంద్రంపై నారాయణ తీవ్ర ఆగ్రహం

**ఢిల్లీలో నిర్బంధంపై కేంద్ర ప్రభుత్వంపై సీపీఐ నారాయణ ఫైర్**

**తెలంగాణ ఆర్టీసీ ఎన్నికల్లో ఏఐటీయూసీ గెలుపుపై హర్షం**

**కమ్యూనిస్టులను ఓడించాలన్న కాంగ్రెస్‌పై విమర్శలు**



సీపీఐ సీనియర్ నేత నారాయణ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశ రాజధాని ఢిల్లీలో పూర్తిస్థాయి లాక్‌డౌన్ విధించారని, ఇంతకీ ఢిల్లీని పాకిస్థాన్‌కు ఏమైనా అప్పగించారా అని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో ఒక వీడియో విడుదల చేశారు.

శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వచ్చిన వారిని అణచివేసేందుకు 50 వేల నుంచి 75 వేల మంది పోలీసు, ఇతర భద్రతా సిబ్బందిని మోహరించి సాధారణ జనజీవనాన్ని స్తంభింపజేయడం అన్యాయమని అన్నారు. కేంద్రం తప్పులను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం కేంద్రం పరిస్థితి ముందు నుయ్యి, వెనుక గొయ్యిలా తయారైందని వ్యాఖ్యానించారు. ఈ పరిణామాలపై న్యాయ నిపుణులు, సుప్రీంకోర్టు కూడా స్పందిస్తున్నాయని గుర్తుచేశారు.

ఇదే సమయంలో, తెలంగాణ ఆర్టీసీ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో ఏఐటీయూసీ అనుబంధ ఎంప్లాయీస్ యూనియన్ విజయం సాధించడంపై నారాయణ సంతోషం వ్యక్తం చేశారు. అయితే, ఈ ఎన్నికలను కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా రాజకీయ పోటీగా మార్చిన కాంగ్రెస్ పార్టీపై ఆయన విమర్శలు గుప్పించారు. అధికార అహంకారంతో కమ్యూనిస్టులను ఓడించాలని పిలుపునివ్వడం సరికాదన్నారు. ప్రజల ఉద్యమాలను అణచివేతతో ఆపలేరని, కేంద్రం తన తప్పులను సరిదిద్దుకోవాలని నారాయణ డిమాండ్ చేశారు.

# హైదరాబాద్ హైస్పీడ్ రైల్.. భూసేకరణపై కేంద్రం కీలక ప్రకటన

**భూసేకరణకు రాష్ట్రాలకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని వెల్లడి**

**ప్రస్తుతం జరుగుతున్న భూసేకరణ చట్టవిరుద్ధమని స్పష్టీకరణ**

**కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో కిషన్ రెడ్డి భేటీ అనంతరం ప్రకటన**

**ప్రస్తుతం కేవలం అలైన్‌మెంట్ అధ్యయనాలు మాత్రమే జరుగుతున్నాయని వెల్లడి**

హైదరాబాద్ కేంద్రంగా నిర్మించ తలపెట్టిన మూడు హైస్పీడ్ రైల్ కారిడార్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఈ ప్రాజెక్టులకు సంబంధించి ప్రస్తుతం అలైన్‌మెంట్ అధ్యయనాలు మాత్రమే జరుగుతున్నాయని, భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వాలకు ఎటువంటి ప్రతిపాదనలు పంపలేదని స్పష్టం చేసింది. ఈ దశలో హైస్పీడ్ రైల్ పేరుతో ఎవరైనా భూసేకరణకు పాల్పడితే అది చట్టవిరుద్ధం అవుతుందని స్పష్టం చేసింది.



కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి శనివారం ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీలో హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-పుణె హైస్పీడ్ రైల్ కారిడార్ల పురోగతిపై చర్చించారు. సమావేశం అనంతరం ఈ వివరాలను కిషన్ రెడ్డి 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పంచుకున్నారు.

"రైల్వే మంత్రి స్పష్టం చేసిన దాని ప్రకారం.. సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకు ఎటువంటి భూసేకరణ అభ్యర్థనలు పంపలేదు. ఈ దశలో హైస్పీడ్ రైల్ పేరుతో జరుగుతున్న ఏ భూసేకరణ అయినా చట్టవిరుద్ధం" అని కిషన్ రెడ్డి తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రాజెక్టుల అలైన్‌మెంట్ ఖరారైన తర్వాతే ఆ వివరాలను రాష్ట్ర ప్రభుత్వాలతో, రైతులతో పంచుకోవడం జరుగుతుందని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో రైల్ కారిడార్లతో పాటు ఇతర ప్రాజెక్టుల కోసం భూసేకరణ ప్రయత్నాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో కేంద్రం చేసిన ఈ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వ భూసేకరణ ప్రయత్నాలను కొందరు రైతులు వ్యతిరేకిస్తున్న తరుణంలో ఈ స్పష్టత రావడం గమనార్హం.

మరోవైపు కిషన్ రెడ్డితో జరిగిన సమావేశంపై దక్షిణ మధ్య రైల్వే కూడా స్పందించింది. హైదరాబాద్‌ను మూడు ప్రధాన నగరాలతో అనుసంధానించే హైస్పీడ్ రైల్ కనెక్టివిటీకి సంబంధించిన ప్రతిపాదిత అలైన్‌మెంట్‌పై ఇరువురు మంత్రుల మధ్య ఉన్నత స్థాయి చర్చలు జరిగాయని సోషల్ మీడియాలో పేర్కొంది.

ఇదిలా ఉండగా, భారతీయ రైల్వేలు 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను జూలై వరకు బడ్జెట్ కేటాయింపుల్లో రూ. 1.14 లక్షల కోట్లకు పైగా మూలధన వ్యయం చేసినట్లు ప్రభుత్వం గతంలో వెల్లడించింది. అలాగే, దేశీయ పరిజ్ఞానంతో రూపొందించిన 'కవచ్' ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ (ఏటీపీ) వ్యవస్థను 2,633 రూట్ కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసినట్లు రైల్వే మంత్రి లోక్‌సభలో తెలిపారు.

# కాంగ్రెస్ 'ఓటు చోరీ' ఆరోపణలను తిప్పికొట్టండి: బీజేపీ శ్రేణులకు రాంచందర్ రావు పిలుపు

**ఎన్నికల కమిషన్ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందన్న రాంచందర్ రావు**

**వరుస ఓటములతోనే కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శ**

**రాజ్యాంగబద్ధ సంస్థలపై బురద చల్లుతున్నారని మండిపాటు**



ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (SIR) ప్రక్రియపై కాంగ్రెస్ చేస్తున్న 'ఓటు చోరీ' ఆరోపణలను క్షేత్రస్థాయిలో బలంగా తిప్పికొట్టాలని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగానే ఎన్నికల కమిషన్ (ఈసీ) పారదర్శకంగా ఓటర్ల జాబితాను సిద్ధం చేసిందని ఆయన స్పష్టం చేశారు.

శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలు, మీడియా ప్యానలిస్టులతో జరిగిన సమావేశంలో రాంచందర్ రావు మాట్లాడారు. దొంగ ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ చేస్తున్న అసత్య ఆరోపణలను ఖండించారు. వరుస ఎన్నికల్లో ఓటమి పాలవుతున్న కాంగ్రెస్ పార్టీ, రాజ్యాంగబద్ధ సంస్థలపై బురదజల్లే ప్రయత్నం చేస్తోందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ చేపట్టిన 'ఓటు చోరీ' ప్రచారాన్ని ప్రజల్లో ఎండగట్టాలని, ప్రజాస్వామ్యంలో స్వచ్ఛమైన ఓటర్ల జాబితా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని ఆయన పార్టీ శ్రేణులకు సూచించారు. ఓటర్ల జాబితా నుంచి తమ మద్దతుదారుల పేర్లను అక్రమంగా తొలగిస్తున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో రాంచందర్ రావు ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ అంశంపై కాంగ్రెస్ నేతలు ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు, జాతీయ స్థాయిలో రాష్ట్రపతిని కూడా కలిసి తమ వాదనలు వినిపించారు.

## మహబూబాబాద్: లింగ్యా తండాలో విషాదం

మహబూబాబాద్ కురవి మండలం లింగ్యా తండాలో దారుణ ఘటన చోటుచేసుకుంది.కుటుంబ కలహాలతో తల్లి తన ఇద్దరు పిల్లలతో కలిసి బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది.మృతులు బానోత్ అనూష (35), కుమారుడు విశాల్ కృష్ణ (09), కూతురు వర్షిణి (05) గా గుర్తించారు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వరంగల్ భద్రకాళి అమ్మవారి ఆలయంలో వైభవంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

## భద్రకాళి అమ్మవారికి హరిద్రాభిషేకం

వరంగల్ వరంగల్ భద్రకాళి అమ్మవారి ఆలయంలో వైభవంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ముందుగా భద్రకాళి అమ్మవారికి హరిద్రాభిషేకం నిర్వహించారు. దసరా మహోత్సవాల ముందు వచ్చే అమావాస్య తిథిరోజున అమ్మవారికి ప్రత్యేక పసుపు అభిషేకం నిర్వహించడం అనవాయితీ. ఆలయ ప్రధాన అర్చకులు శేషు ఆధ్వర్యంలో ఆలయ ఆర్చకులు అభిషేకం నిర్వహించారు. నవరాత్రి మహోత్సవాల సందర్భంగా భక్తులు వేలాదిగా తరలివచ్చారు.

## ఫలక్ నామా కాళీ మాత ఆలయంలో కవిత పూజలు

హైదరాబాద్ పాత బస్తిలోని లోని ఫలక్నుమా కాళీ మాత అమ్మ వారిని టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శనివారం దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆలయం వద్ద ఉన్న సమస్యలను అక్కడి పరిస్థితులను భక్తులను అడిగి తెలుసుకున్నారు.

# బ్యాలెట్ తో ఎన్నికలు

విజయవాడ, అక్టోబరు 11 ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా కీలక ప్రకటన చేశారు. విజయవాడ వేదికగా పంచాయతీరాజ్, మున్సిపల్, రెవెన్యూ శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన ఎన్నికల రోడ్‌మ్యాప్‌ను స్పష్టం చేశారు. ఈ దఫా స్థానిక సమరాన్ని బ్యాలెట్ పేపర్ల ద్వారానే నిర్వహించనున్నట్లు పునేఠా అధికారికంగా వెల్లడించారు. బ్యాలెట్ బాక్సుల లభ్యత, ముద్రణ, భద్రతా ఏర్పాట్లపై ఇప్పటికే క్షేత్రస్థాయి యంత్రాంగానికి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశామని, ఎన్నికల నిర్వహణకు కమిషన్ పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతోందని స్పష్టం చేశారు.ఓటర్ల జాబితా రూపకల్పనపై ఎస్ఈసీ ప్రకటన చేశారు. 2026 ఫిబ్రవరి నాటికి సిద్ధమయిన తుది ఓటర్ల జాబితానే ఈ స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రాతిపదికగా తీసుకోనున్నట్లు పునేఠా ప్రకటించారు. అర్హులైన కొత్త ఓటర్లందరికీ ఓటు హక్కు కల్పించేలా, డూప్లికేట్ ఎంట్రీలు లేకుండా పకడ్బందీగా ఈ లిస్టులను రూపొందించాలని జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో వార్డులు, పంచాయతీల వారీగా ఓటర్ల జాబితాల పునర్విభజన ప్రక్రియను ఎటువంటి తప్పిదాలు లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు.ప్రస్తుతం స్థానిక ఎన్నికల రిజర్వేషన్లు, ఇతర అంశాలపై సుప్రీంకోర్టులో నడుస్తున్న న్యాయపరమైన ప్రక్రియను కమిషన్ నిశితంగా పరిశీలిస్తోందని ఎస్ఈసీ తెలిపారు. సుప్రీంకోర్టు నుంచి తుది తీర్పు , స్పష్టమైన ఆదేశాలు వెలువడిన వెంటనే ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటిస్తామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణ, భద్రతా బలగాల మోహరింపును దృష్టిలో ఉంచుకుని స్థానిక పోరును ఏకకాలంలో కాకుండా విడతల వారీగా నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు స్పష్టం చేశారు. పంచాయతీ, మండల, జిల్లా పరిషత్, మున్సిపల్ ఎన్నికల దశలను పక్కా ప్రణాళికతో చేపట్టేలా కసరత్తు చేస్తున్నామన్నారు.ఉన్నతాధికారుల సమీక్షలో ఎన్నికల ఏర్పాట్లు, నిధుల సమీకరణ, సిబ్బంది శిక్షణ వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అధికార యంత్రాంగం నిష్పాక్షికంగా, పారదర్శకంగా వ్యవహరించాలని, ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ప్రతి ప్రక్రియ చట్టబద్ధంగా సాగేలా గట్టి నిఘా ఉంచాలని పునేఠా స్పష్టం చేశారు. న్యాయస్థానం వైపు నుంచి గ్రీన్ సిగ్నల్ రావడమే తరువాయి.. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో సిద్ధంగా ఉండాలని ఆదేశించడంతో వచ్చే రెండు, మూడు నెలలు స్థానిక ఎన్నికల హంగామా కనిపించనుంది.

# బెజవాడకు దళపతి విజయ్

విజయవాడ, అక్టోబరు 11 తమిళనాడు సీఎం ఆంధ్రప్రదేశ్ పర్యటనకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. విజయవాడలో అత్యంత వైభవంగా జరిగే ప్రసిద్ధ ఇంద్రకీలాద్రి దసరా ఉత్సవాలకు హాజరుకావాల్సిందిగా విజయ్‌ను విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని శివనాథ్ ప్రత్యేక బృందం నేరుగా ఆహ్వానించింది.

ఎంపీ బృందం ఆహ్వానానికి విజయ్ కూడా సానుకూలంగా స్పందించినట్లు, దసరా వేడుకల్లో పాల్గొనేందుకు ఆయన ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది.ఇటీవల కాలంలో విజయ్ ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై, ఇక్కడి సామాజిక పరిస్థితులపై ప్రత్యేక ఆసక్తి కనబరుస్తున్నట్లు ఆయన వ్యూహకర్తలు చెబుతున్నారు. తన పార్టీ భావజాలాన్ని, తమిళనాడు ప్రభుత్వ విజయాలను కేవలం సొంత రాష్ట్రానికే పరిమితం చేయకుండా తెలుగు ప్రజలకు కూడా చేరేలా ప్రత్యేకంగా తెలుగులో ప్రకటనలు ఇప్పించడం, టీవీ ఛానెళ్లలో ప్రసారం చేయించడం చేస్తున్నారు. కేవలం సినిమాల ద్వారానే కాకుండా, రాజకీయంగా కూడా తన ప్రభావాన్ని ఇతర రాష్ట్రాలకు, ముఖ్యంగా పొరుగునే ఉన్న ఏపీకి విస్తరించాలనే ఆలోచనలో విజయ్ ఉన్నట్లు ఆయన సన్నిహిత వర్గాలు అంటున్నాయి.తమిళనాడు దాటి తన పార్టీని దక్షిణాది ఇతర రాష్ట్రాల్లోకి తీసుకువెళ్లేందుకు అడుగులు వేస్తున్న విజయ్‌కు, ఏపీ తొలి పర్యటన ద్వారా ప్రజా స్పందనను పరిశీలించే అవకాశం ఉంది. విజయవాడ దసరా ఉత్సవాల వేదికగా ఆయన పర్యటిస్తే, ఇక్కడి రాజకీయ, సామాజిక సమీకరణాలపై ఆయనకు ఒక స్పష్టమైన అవగాహన వచ్చే అవకాశం ఉంది. ఇక్కడి స్పందనను బట్టి భవిష్యత్తులో ఏపీ రాజకీయాల్లో టీవీకే ఏ రకమైన పాత్ర పోషించాలనే దానిపై ఆయన ఒక స్పష్టమైన నిర్ణయానికి రావచ్చని భావిస్తున్నారు.తమిళనాట విజయ్ వేస్తున్న ప్రతి అడుగు జాతీయ స్థాయిలోనూ ఆసక్తి రేపుతున్న తరుణంలో, ఆయన ఏపీ టూర్ ఖరారైతే అది తెలుగు రాజకీయాల్లోనూ సరికొత్త చర్చకు తెరలేపడం ఖాయం.

# 9 ప్రామాణిక జోన్‌లుగా భూ వినియోగం

తిరుపతి అక్టోబరు 11 ఆంధ్రప్రదేశ్‌లోని పట్టణాలు, నగరాల్లో వ్యాపారాలు, నివాస గృహాలు, పారిశ్రామిక ప్రాజెక్టుల నిర్మాణాలకు సంబంధించిన అనుమతుల ప్రక్రియలో ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఏకీకృత నిబంధనలు తెస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కామన్ జోనింగ్ రెగ్యులేషన్స్-2026 ను అమల్లోకి తెచ్చింది. ఇప్పటివరకు అమల్లో ఉన్న సంక్లిష్టమైన విభిన్న జోనింగ్ నిబంధనలను రద్దు చేసి, ఆధునిక అవసరాలకు తగినట్లుగా కేవలం 9 ప్రామాణిక జోన్‌లుగా భూ వినియోగాన్ని క్రమబద్ధీకరించారు.ఈ నూతన విధానంలో అత్యంత కీలకమైన అంశం నెగిటివ్ లిస్ట్ విధానాన్ని ప్రవేశపెట్టడం. గతంలో ఒక నిర్దిష్ట భూమిలో ఏ నిర్మాణానికి అనుమతి ఉందో తెలుసుకోవడానికి పౌరులు, డెవలపర్లు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు నెగిటివ్ లిస్ట్ ద్వారా సదరు జోన్‌లో ఖచ్చితం ప్రోహిబిటెడ్ కార్యకలాపాలు మినహా, మిగిలిన అనుకూల ప్రాజెక్టులన్నింటికీ ఆటోమేటిక్‌గా అనుమతులు లభించే వీలుంది. ఈ పారదర్శక విధానం వల్ల అధికారులు నిబంధనల పేరుతో చేసే అనవసర ఆటంకాలకు, అవినీతికి శాశ్వత చెక్ పడనుంది.ఈ కొత్త జోనింగ్ మార్గదర్శకాలకు అనుగుణంగానే ఇటీవలే సమగ్రంగా సవరించిన ‘ఏపీ బిల్డింగ్ రూల్స్’ను కూడా ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. 24 మీటర్లు , అంతకంటే ఎక్కువ ఎత్తు ఉన్న భవనాలను ‘హైరైజ్’ భవనాలుగా పరిగణిస్తూ, వాటికి అవసరమైన ఫైర్, పర్యావరణ అనుమతులను డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఒకే గొడుగు కిందకు తెచ్చారు. అంతేకాకుండా, పెద్ద నివాస, వాణిజ్య కాంప్లెక్స్‌లలో ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్లు, 50 మంది కంటే ఎక్కువ ఉద్యోగులున్న ఆఫీసుల్లో పిల్లల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయడాన్ని నిబంధనల్లో భాగం చేశారు.ఈ జోనింగ్ సంస్కరణల వల్ల గృహ నిర్మాణాలు, రియల్ ఎస్టేట్ రంగానికి కొత్త ఊపిరి అందడమే కాకుండా, విదేశీ, స్వదేశీ పెట్టుబడిదారులకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ మరింత మెరుగవుతుంది. సుదీర్ఘకాలంగా మాస్టర్ ప్లాన్లు, భూ వినియోగ మార్పిడుల వివాదాల్లో చిక్కుకున్న భూములకు స్పష్టత రావడంతో రాష్ట్రవ్యాప్తంగా స్థిరాస్తి వ్యాపారం, మౌలిక వసతుల కల్పన వేగవంతం కానున్నాయి

# పనితీరుపై రేవంత్ నజర్

హైదరాబాద్, అక్టోబరు 10 తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లు పూర్తవుతున్న తరుణంలో.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆత్మపరిశీలనకు సిద్ధమైంది. ప్రభుత్వ పాలనపై, ముఖ్యంగా నేతల పనితీరుపై ప్రజాభిప్రాయాన్ని సేకరించేందుకు అత్యంత రహస్యంగా పావులు కదుపుతోంది. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు, జీహెచ్ఎంసీ సహా పలు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇంటెలిజెన్స్ ద్వారా క్షేత్రస్థాయి సర్వే నిర్వహిస్తున్నట్లు సమాచారం. ప్రజా నాడిని ముందుగానే పట్టుకుని, లోపాలను సరిదిద్దుకోవడానికి ప్రభుత్వం సర్వే చేయిస్తున్నట్టు తెలుస్తోంది.సాధారణంగా ఏ ప్రభుత్వమైనా అధికారంలోకి వచ్చాక తమ పథకాలు ప్రజలకు ఎంతవరకు చేరుతున్నాయి.. తమ పాలనపై ప్రజలు ఏమనుకుంటున్నారు.. అనే అంశాలపై ఎప్పటికప్పుడు థర్డ్ పార్టీల ద్వారా నిఘా పెడుతుంటాయి. అయితే.. రేవంత్ రెడ్డి సర్కార్ మాత్రం ఏకంగా ఇంటెలిజెన్స్ యంత్రాంగాన్ని రంగంలోకి దించింది. ప్రభుత్వ పనితీరుపై క్షేత్రస్థాయిలో లోతుగా ఆరా తీస్తోంది. గ్రామ పంచాయతీ నుంచి మున్సిపల్ వార్డులు, కార్పొరేషన్ డివిజన్ల వారీగా ఈ సర్వేను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.ఈ సర్వేలో కేవలం ప్రభుత్వం, ముఖ్యమంత్రి పనితీరు మాత్రమే కాకుండా, స్థానిక ఎమ్మెల్యేల పనితీరు, మంత్రుల పాలనా శైలిపై కూడా ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ప్రజలు ఏమనుకుంటున్నారు.. ఏ ఏ పథకాలపై సానుకూలంగా ఉన్నారు? వేటిపైన అసంతృప్తితో ఉన్నారు.. లాంటి అంశాలను గుర్తించి.. సరిదిద్దుకేవడమే ఈ సర్వే ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది.గత ఎన్నికల హామీల అమలు, సంక్షేమ పథకాల లబ్ధి అర్హులందరికీ అందుతున్నాయా లేదా అనే అంశాలపై క్షేత్రస్థాయిలో ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసుకోవడం ద్వారా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సర్కార్ భావిస్తోంది. ఈ సర్వేలో ప్రజలను ప్రధానంగా అయిదు నుంచి ఏడు రకాల కీలక అంశాలపై ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం, ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యేల పనితీరుతో పాటు, రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తే బాగుంటుంది? ఒకవేళ కాంగ్రెస్‌కు ఓటు వేయకపోతే దానికి గల కారణాలు ఏమిటి? అనే ప్రశ్నలను సంధించడం ద్వారా ప్రతిపక్షాల వైపు ప్రజల మొగ్గు ఎలా ఉందో అంచనా వేయాలని చూస్తున్నారు. ముఖ్యంగా హైడ్రా పనితీరు, ఉచిత పథకాలు, విద్యుత్ కోతలు, నిరుద్యోగ సమస్య, ఉద్యోగుల పెండింగ్ డిమాండ్లు వంటి సమస్యాత్మక అంశాలపై ప్రజల స్పందనను ఇంటెలిజెన్స్ వర్గాలు కూలంకషంగా సేకరిస్తున్నట్లు సమాచారం.ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గ్యాస్ సబ్సిడీ వంటి పథకాలు ఎంతవరకు జనాల్లోకి వెళ్లాయనే కోణంలోనూ ఈ సర్వే వివరాలు రాబడుతోంది. అదే సమయంలో, కొన్ని వర్గాల నుంచి వస్తున్న వ్యతిరేకత, ఉచితాలకు వ్యతిరేకంగా ఉన్న అభిప్రాయాలు, సంక్షేమ పథకాల అమలులో ఉన్న లోపాలను గుర్తించి దిద్దుబాటు చర్యలు చేపట్టడానికి ఈ డేటా ప్రభుత్వానికి అత్యంత కీలకం కానుంది. ఎన్నికల సమయానికి ముందే ప్రజా వ్యతిరేకతను తగ్గించి, పాలనను గాడిలో పెట్టడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ ఇంటెలిజెన్స్ సర్వేను ఒక అస్త్రంగా మలుచుకుంటున్నట్లు స్పష్టమవుతోంది.

# ఎస్ఐఆర్ పై కాంగ్రెస్ అనవసర రాద్ధాంతం..

## ఓటమి భయంతోనే ఆందోళనలు కీర్తిరెడ్డి

హైదరాబాద్ ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో కాంగ్రెస్ పార్టీ అనవసర రాద్ధాంతం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ జూటూరు కీర్తిరెడ్డి విమర్శించారు. జూబ్లీహిల్స్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా బీజేపీకి పెరుగుతున్న ప్రజాదరణను కాంగ్రెస్ పార్టీ ఓర్వలేకపోతోందని, ఓటమి భయంతోనే వివిధ అంశాలపై ఆందోళనలు చేస్తోందని ఆరోపించారు.ఓటర్ల జాబితాలో ఉన్న అవకతవకలను సరిచేయడం, డూప్లికేట్ ఓట్లు, అనర్హమైన ఓట్లను తొలగించడం ప్రజాస్వామ్యానికి అవసరమని కీర్తిరెడ్డి పేర్కొన్నారు. గతంలో ఓటర్ల జాబితాలో అక్రమాలున్నాయని ఆరోపించిన కాంగ్రెస్ నేతలు.. ఇప్పుడు వాటిని సరిచేసే ప్రక్రియను ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు. నిజమైన ఓటర్ల హక్కులను కాపాడటమే ఎస్ఐఆర్ లక్ష్యమని, అర్హులైన ఓటర్లకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తొలగించబడిన ఓట్ల విషయంలో అభ్యంతరాలుంటే సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదించాలే తప్ప, రోడ్లపై ఆందోళనలు చేయడం సరికాదని హితవు పలికారు.ఓట్ చోరీ గురించి మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదని కీర్తిరెడ్డి విమర్శించారు. గతంలో జరిగిన రాజకీయ పరిణామాలను ప్రస్తావిస్తూ.. రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి ఈ అంశాలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మరోవైపు, తెలంగాణలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆమె ఆరోపించారు. రాష్ట్రంలోని ప్రజా సమస్యలను పరిష్కరించకుండా సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో ధర్నాలు, ఆందోళనలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజల సమస్యలను పక్కనపెట్టి రాజకీయ ఇమేజ్ కోసం ప్రయత్నించడం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీకి నిజంగా ఓటర్లపై ప్రేమ ఉంటే.. నిజమైన ఓటర్ల హక్కులను కాపాడటంతో పాటు, అనర్హమైన ఓట్ల తొలగింపు ప్రక్రియకు సహకరించాలని కీర్తిరెడ్డి సూచించారు.

# శీతాకాలం ఉన్నట్టా..

తెలంగాణలో ఈ ఏడాది శీతాకాలం ఛాయలు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉంది. సాధారణంగా నైరుతి రుతుపవనాల నిష్క్రమణతో వాతావరణంలో చలి పుంజుకోవాలి. కానీ, ఈ ఏడాది దానికి విరుద్ధంగా అక్టోబర్ ప్రారంభంలోనే ఎండలు మండిపోతున్నాయి. రాష్ట్రంలో శీతాకాలపు ఆనవాళ్లు లేకుండా పోవడానికి వాతావరణ మార్పులతో పాటు పాలకుల విధానపరమైన వైఫల్యాలే ప్రధాన కారణమనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.నైరుతి రుతుపవనాల ఉపసంహరణ సమయంలోనే ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరుగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఆదిలాబాద్‌లో 37 డిగ్రీలు, హైదరాబాద్‌లో 35 డిగ్రీలు, భద్రాచలం, మహబూబ్‌నగర్‌లలో 36.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ ఏడాది తెలంగాణలో నైరుతి రుతుపవనాల కాలంలో ఏకంగా 17 శాతం వర్షపాత లోటు నమోదైంది. మొత్తం 615.5 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా, అంతకంటే తక్కువగా వర్షాలు పడ్డాయి. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో అయితే ఏకంగా 27 శాతం వర్షపాత లోటు నమోదు కావడం పట్టణాభివృద్ధిలో పర్యావరణ పరిరక్షణను గాలికి వదిలేశారనేదానికి నిదర్శనం.ప్రకృతిలో వస్తున్న ఈ మార్పులపై పాలకులకు స్పష్టమైన ప్రణాళిక కొరవడింది. ఎల్ నినో పరిస్థితుల ప్రభావం ఉంటుందని భారత వాతావరణ శాఖ ముందే హెచ్చరించింది. కానీ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడంలో విఫలమైంది.

కర్బన ఉద్గారాలను తగ్గించడం, పట్టణాల్లో గ్రీనరీని పెంచడంపై కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్న రాజకీయ నాయకులు, గ్రౌండ్ లెవెల్‌లో కాలుష్య నియంత్రణకు కఠినమైన చట్టాలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు.రుతుపవనాల నిష్క్రమణలో జాప్యం, వర్షపాత లోటు కారణంగా వాతావరణ సమతుల్యత దెబ్బతిన్నది. దీనివల్ల అక్టోబర్ నెలలోనే ప్రజలు తీవ్ర ఉక్కపోతతో, అసౌకర్య వాతావరణంతో అల్లాడిపోతున్నారు. శీతాకాలం జాడ లేకపోవడం వల్ల రాబోయే కాలంలో తీవ్రమైన తాగునీటి ఎద్దడి, వ్యవసాయ రంగానికి నష్టాలు తప్పవని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రాజకీయ నాయకులు ఓటు బ్యాంకు రాజకీయాలను పక్కన పెట్టి, వాతావరణ మార్పులను అరికట్టే దీర్ఘకాలిక విధానాలను అమలు చేయకపోతే.. భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రం తీవ్రమైన పర్యావరణ సంక్షోభాన్ని ఎదుర్కోక తప్పదు.

# బహుజన తెలంగాణ సాధన కోసం బతుకమ్మలో

## గౌరమ్మలా ఒదిగి కలిసి పని చేద్దాం కవిత



హైదరాబాద్ తెలంగాణ నేలపై పూల సింగిడి వికసించింది.. మన ఆత్మగౌరవ పతాక.. సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అయిన మన బతుకమ్మ పండుగ సంబురం మొదలైంది.. నేటి ఎంగిలి పూలతో మొదలయి.. సద్దుల బతుకమ్మ వరకు తొమ్మిది రోజుల పాటు సాగే తీరొక్క పూల పండుగ సందర్భంగా తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత తెలంగాణ ఆడబిడ్డలందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

కవిత మాట్లాడుతూనాడు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బతుకమ్మను సాంస్కృతిక వారధిగా మలుచుకున్న మనమంతా.. సబ్బండ వర్గాలు.. సకల జనుల వికాసం.. సాధికారితతో కూడిన బహుజన తెలంగాణ సాధన కోసం బతుకమ్మలో గౌరమ్మలా ఒదిగి కలిసి పని చేద్దామని ప్రతినబూనుదామని పిలుపునిచ్చారు.

# దసరా నవరాత్రుల వేళా ...

**అమ్మ వారి విగ్రహ ఏర్పాటు విషయంలో ఇరు వర్గాల మధ్యగొడవ....**

**మహిళలు తో సహా తుక్కు తుక్కు గా కొట్టుకున్న వైనం**

పల్నాడు రాజుపాలెం మండలం దేవరంపాడు లో ఇరు వర్గాల వైరం ఘర్షణకు దారి తీసింది. రామారావు వెర్సెస్ శ్రీను వర్గం పరస్పర దాడులకు దిగాయి. దేవరంపాడు గ్రామాలోని రామాలయంలో బతుకమ్మ విగ్రహం ఏర్పాటు విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దసరా సందర్భంగా ఆలయంలో విగ్రహం ఏర్పాటు చేయాలని ఒక వర్గం, అందుకు అంగీకరించేది లేదని మరో వర్గం పట్టుబట్టడంతో వివాదం చెలరేగింది. విగ్రహాన్ని ఆలయం వద్దకు తీసుకురావడంతో ఇరువర్గాలు పరస్పరం దాడులకు దిగాయి. ఈ ఘటనలో 10 మందికి స్వల్ప గాయాలు కాగా, వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది

# అతి చేస్తున్న విపక్షాలు

## వెంకయ్య నాయుడు

విజయవాడ సీఈసీ రాజీనామా, ‘సర్’ ప్రక్రియ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆందోళనలపై మాజీ ఉపరాష్ట్ర వెంకయ్యనాయుడు స్పందించారు. అత్కూరు లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రతిపక్షాలు అతిగా ప్రవర్తిస్తున్నాయంటూ . రాజ్యాంగబద్ధ సంస్థను రాజకీయాలతో ముడిపెట్టడం, వ్యక్తిగత విమర్శలు సరికాదన్నారు. నిరాధార ఆరోపణలతో సీఈసీ, ప్రధాని రాజీనామా చేయాలనే డిమాండ్ సమంజసం కాదని చెప్పుకొచ్చారు. ఓట్లు మూకుమ్మడిగా తొలగించారనేది అపోహ మాత్రమే అని స్పష్టం చేశారు. గెలిస్తే తమ ఘనత అని.. ఓడిపోతే ఈవీఎమ్లను నిందించడం హాస్యాస్పదమంటూ వెంకయ్య నాయుడు వ్యాఖ్యానించారు.

# భూగర్భ విద్యుత్..

# 6 వేల కి.మీ.కుపైగా అండర్‌గ్రౌండ్ కేబులింగ్

హైదరాబాద్, అక్టోబరు 10 హైదరాబాద్‌లో విద్యుత్ మౌలిక వసతులను మరింత ఆధునికంగా, సురక్షితంగా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక ప్రాజెక్ట్ చేపట్టింది. ుఊూఖఆఅఛ ఆధ్వర్యంలో హైదరాబాద్ భూగర్భ విద్యుత్ కేబులింగ్ ప్రాజెక్ట్ ఫేజ్-1 అమలు కానుంది. ఇందులో సుమారు 311 కిలోమీటర్ల 33 కేవీ, 5,772 కిలోమీటర్ల 11 కేవీ విద్యుత్ లైన్లను భూగర్భంలోకి మార్చనున్నారు. చెట్లు, గాలులు, వర్షాల కారణంగా విద్యుత్ అంతరాయాలు తగ్గడంతోపాటు వీధుల్లో భద్రత, నగర సౌందర్యం, స్మార్ట్ గ్రిడ్ సామర్థ్యం మెరుగుపడే అవకాశం ఉందని ుఊూఖఆఅఛ అధికారులు ట్విట్టర్ ఎక్స్ ద్వారా వెల్లడించారు.ప్రపంచ స్థాయి నగరంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌లో విద్యుత్ మౌలిక వసతులను ఆధునీకరించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. నగరంలో ప్రస్తుతం ్తంభాలపై ఉన్న విద్యుత్ లైన్లను దశలవారీగా భూగర్భంలోకి మార్చే హైదరాబాద్ భూగర్భ విద్యుత్ కేబులింగ్ ప్రాజెక్ట్ ఫేజ్-1ను చేపడుతోంది. తెలంగాణ దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్ట్ అమలు కానుండగా.. నగర విద్యుత్ వ్యవస్థలో గణనీయమైన మార్పులు వచ్చే అవకాశం ఉంది.ఫేజ్-1లో సుమారు 311 కిలోమీటర్ల మేర 33 కేవీ విద్యుత్ లైన్లను, దాదాపు 5,772 కిలోమీటర్ల మేర 11 కేవీ లైన్లను భూగర్భంలోకి తరలించనున్నారు. బంజారాహిల్స్, గ్రీన్‌ల్యాండ్స్, సైఫాబాద్, ప్యారడైజ్, కంటోన్మెంట్, మెహదీపట్నం, చార్మినార్, బేగంబజార్, బోయిన్‌పల్లి, అస్మాన్‌గఢ్, ఆజామాబాద్ డివిజన్లు ఈ తొలి దశలో భాగంగా ఉన్నాయి. బంజారాహిల్స్, సికింద్రాబాద్, హైదరాబాద్ సెంట్రల్, హైదరాబాద్ సౌత్ సర్కిళ్ల పరిధిలోని 11 డివిజన్లలో ఈ పనులు చేపట్టనున్నారు. భూగర్భ కేబులింగ్‌తో ముఖ్యంగా వర్షాకాలంలో విద్యుత్ సరఫరాకు ఎదురయ్యే అంతరాయాలు తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుతం చెట్లు విరిగిపడటం, బలమైన గాలులు, వర్షాలు, పిడుగుల ప్రభావంతో విద్యుత్ లైన్లు దెబ్బతినే సందర్భాలు ఉంటాయి. కేబుళ్లు భూగర్భంలోకి వెళ్లడంతో ఇలాంటి బాహ్య ప్రభావాల నుంచి విద్యుత్ వ్యవస్థకు రక్షణ లభిస్తుంది. ఫలితంగా విద్యుత్ సరఫరాను మరింత స్థిరంగా కొనసాగించేందుకు వీలవుతుందని ుఊూఖఆఅఛ అధికారులు వెల్లడించారు.అదే సమయంలో రోడ్ల పక్కన, ఇళ్లకు సమీపంలో వేలాడుతున్న విద్యుత్ తీగలు తగ్గడంతో ప్రజల భద్రత కూడా మెరుగుపడనుంది. బాల్కనీలు, ఇళ్లు, ఫుట్‌పాత్‌లకు సమీపంలో ఉన్న ప్రమాదకర విద్యుత్ లైన్ల సమస్య తగ్గడంతో పాటు స్తంభాల సంఖ్య తగ్గడం వల్ల పాదచారులకు మరింత స్థలం అందుబాటులోకి రానుంది. ముఖ్యంగా చారిత్రక ప్రాంతాలు, వారసత్వ కట్టడాల పరిసరాల్లో తీగల గందరగోళం తగ్గడం నగర సౌందర్యాన్ని పెంచే అంశంగా మారనుంది. ఈ ప్రాజెక్ట్‌లో స్మార్ట్ గ్రిడ్ సాంకేతికతకు కూడా ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ాఅంఆం ఆధారిత రింగ్ మెయిన్ యూనిట్లు అందుబాటులోకి రావడంతో విద్యుత్ నెట్‌వర్క్‌లో లోపాలను వేగంగా గుర్తించి, ప్రభావిత ప్రాంతాన్ని వేరు చేసి సరఫరాను త్వరగా పునరుద్ధరించే అవకాశం ఉంటుంది. భూగర్భ కేబుళ్లకు అనధికారికంగా కొక్కేలు వేయడం కష్టంగా ఉండటంతో విద్యుత్ చౌర్యం, సాంకేతిక నష్టాలను తగ్గించడంలోనూ ఈ వ్యవస్థ ఉపయోగపడనుంది. మొత్తంగా భూగర్భ కేబులింగ్ ప్రాజెక్ట్ హైదరాబాద్‌ను మరింత సురక్షితమైన, అందమైన, ఆధునిక విద్యుత్ వ్యవస్థ కలిగిన నగరంగా తీర్చిదిద్దే దిశలో కీలక అడుగుగా నిలవనుంది. భవిష్యత్తులో నగరంలోని ఇతర ప్రాంతాలకు కూడా ఈ విధానాన్ని విస్తరించడం ద్వారా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా మరింత పటిష్టమైన నెట్‌వర్క్‌ను నిర్మించే అవకాశం ఉంటుంది.

# నవంబర్ 2వ వారం నుంచి కాళేశ్వరం పనులు

కరీంనగర్, అక్టోబరు 10 కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులను నవంబర్ రెండో వారంలో ప్రారంభిస్తామని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2027 వర్షాకాలం నాటికి ఈ 3 బ్యారేజీల పునరుద్ధరణ పనులను పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. సెంట్రల్ వాటర్ కమిషన్ (సాంకేతిక పర్యవేక్షణ కమిటీకి కొత్త డిజైన్లను సమర్పిస్తామని, ఆ తరువాత సాంకేతిక అనుమతులు లభించిన వెంటనే క్షేత్రస్థాయిలో బ్యారేజీల పునరుద్ధరణ పనులు వేగవంతం చేస్తామన్నారు. బ్యారేజీల భద్రత, నిర్మాణం నాణ్యత విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి రాజీపడే ప్రసక్తే లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తేల్చిచెప్పారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇచ్చిన సిఫార్సులు, జాతీయ సాంకేతిక సంస్థల సూచనలు, నిపుణుల కమిటీ వ్యక్తం చేసిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని పునరుద్ధరణ ప్రణాళికను రూపొందిస్తున్నామని చెప్పారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల భద్రతను అత్యంత పటిష్ఠం చేస్తామని, ఈ మూడింటిలో నీటి నిల్వతో పాటు వినియోగ సామర్థ్యాన్ని పూర్తి స్థాయిలో పునరుద్ధరించి రైతులకు సాగునీరు నీరందిస్తామని మంత్రి ఉత్తమ్ హామీ ఇచ్చారు.కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు ( ఐఒఎఖ) భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో గోదావరి నదిపై నిర్మించిన ఒక బహుళార్ధసాధక నీటిపారుదల ప్రాజెక్టు. ప్రపంచంలో అతిపెద్ద మల్టీ స్టేజ్ ఎత్తిపోతల ప్రాజెక్టు. 2016లో శంకుస్థాపన చేయగా, తొలి దశ 2019 జూన్ 21న అప్పటి గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, అప్పటి సీఎం కేసీఆర్ ప్రారంభించారు. కాళేశ్వరం ప్రాజెక్టు 7 లింకులు, 28 ప్యాకేజీలుగా విభజించారు. ఈ ప్రాజెక్టు 13 జిల్లాల గుండా సుమారు 500 కి.మీ (310 మైళ్ళు ) దూరం విస్తరించి ఉంది. ఈ ప్రాజెక్టు మొత్తం 240 టీఎంసీల నీటిని ఎత్తిపోసి అందించడమే లక్ష్యం. మేడిగడ్డ బ్యారేజీ నుంచి 195, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి 20, భూగర్భ జలాల నుంచి 25). ఇందులో 169 టీఎంసీలను రైతులకు సాగునీటి కోసం, 30 టీఎంసీలను హైదరాబాద్ నీటి అవసరాలకు, 16 టీఎంసీలను ఇతర పారిశ్రామిక అవసరాలకు, 10 టీఎంసీలను సమీప గ్రామాలకు తాగునీటి కోసం కేటాయించారు. నీటిని ఎత్తిపోయడానికి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల అనే 3 ప్రధాన బ్యారేజీలను నిర్మించారు. అయితే 2023లో మేడిగడ్డ బ్యారేజీలో పిల్లర్లు కుంగడంతో ప్రాజెక్టు భద్రతపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. పగుళ్లకు రిపేర్లు చేపించాలని బీఆర్ఎస్ చెబుతంటే.. భారీ స్కామ్ చేసి దోచుకున్నారని కేసీఆర్ ఫ్యామిలీ మీద కాంగ్రెస్ నేతలు ఆరోపణలు గుప్పించారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఈ ప్రాజెక్టు లోపాలు, నిర్లక్ష్యం, అక్రమాలు జరిగాయని కాంగ్రెస్ విమర్శలు గుప్పించడం బీఆర్ఎస్ పార్టీకి మైనస్ అయింది. ప్రాజెక్టు సేఫ్టీ మీద అనుమానంతోనే గత మూడేళ్లుగా బ్యారేజీల నుంచి తెలంగాణ ప్రభుత్వం నీటిని ఎత్తిపోయడం లేదు. దీనిపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ఆరోపణలు, విమర్శలు కొనసాగుతున్నాయని తెలిసిందే

# 14న సింహగర్జన

అదిలాబాద్, అక్టోబరు 10 సింగరేణి కాలరీస్ కంపెనీలిమిటెడ్ మరోసారి చర్చనీయాంశంగా మారుతోంది. సింగరేణి కార్మికుల సమస్యలపై పోరాడేందుకు ప్రతిపక్ష బీఆర్ఎస్ సిద్ధమవుతోంది. సింగరేణి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం వైఫలమైందంటూ అక్టోబర్ 14న రామగుండం వేదికగా 'సింగరేణి కార్మిక గర్జన' నిర్వహించబోతోంది. ఈ సభకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కీలక నేత హరీశ్ రావు తదితరులు హాజరవుతున్నారు.సింగరేణి లాభాల్లో కార్మికులకు దక్కే వాటా గణనీయంగా తగ్గిపోయిందనేది బీఆర్ఎస్ ప్రధానంగా ఆరోపిస్తోంది. గత బీఆర్ఎస్ పాలనలో కార్మికులకు ఏకంగా 32 శాతం లాభాల వాటా అందిందని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే ఆ వాటా 16 శాతానికి, ఆ తర్వాత 2024-25 నాటికి 12.5 శాతానికి పడిపోయిందని హరీష్ రావు

ఆరోపించారు. దసరాకు ముందే లాభాలు, వాటాలను ప్రకటించడం ఆనవాయితీగా వస్తున్నప్పటికీ, ఈసారి ఆ సంప్రదాయానికి తూట్లు పడ్డాయని బీఆర్ఎస్ విమర్శిస్తోంది.సింగరేణి ఆర్థిక పరిస్థితిపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి రూ. 4,712 కోట్ల లాభాలను ఆర్జించగా, 2024-25 నాటికి అవి రూ. 6,394 కోట్లకు చేరాయని బీఆర్ఎస్ చెప్తోంది. అయితే ఈ ఏడాది మాత్రం లాభాలు రూ. 1,800 కోట్లకు మించే అవకాశం లేదని అంచనా వేస్తున్నారు. ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలు, పరిపాలనా వైఫల్యాలు, టెండర్లలో జాప్యం, భారీ వ్యయంతో కూడిన కాంట్రాక్టుల కారణంగానే సంస్థ ఈ దుస్థితిని ఎదుర్కొంటోందని బీఆర్ఎస్ వాదిస్తోంది. మరోవైపు.. బ్యాంకుల్లో రూ.6,323 కోట్లు నిల్వ ఉన్నప్పటికీ, అదనంగా 4,000 కోట్ల

ఓవర్‌డ్రాఫ్ట్ ఎందుకు తీసుకోవాల్సి వచ్చిందని హరీష్ రావు ప్రభుత్వాన్ని నిలదీశారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచి బొగ్గు గనుల ప్రాంతాలు ఏ పార్టీ రాజకీయ భవిష్యత్తునైనా నిర్ణయించడంలో కీలక పాత్ర పోషించాయి. ఇప్పుడు సింగరేణి కార్మికులను కూడగట్టడం ద్వారా ఉత్తర తెలంగాణలో మళ్లీ పట్టు సాధించాలని బీఆర్ఎస్ భావిస్తోంది. గతంలో తమ ప్రభుత్వ హయాంలో కార్మికులకు అందిన సంక్షేమం, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను పోల్చి చెప్పడం ద్వారా కార్మిక లోకంలో సానుభూతిని పొందడమే లక్ష్యంగా ఈ 'కార్మిక గర్జన' రూపుదిద్దుకుంటోంది.మొత్తానికి? రామగుండం వేదికగా జరగనున్న ఈ సభ రాష్ట్ర రాజకీయాల్లో అధికార కాంగ్రెస్‌ను ఇరుకున పెట్టేందుకు బీఆర్ఎస్ చేస్తున్న వ్యూహాత్మక అడుగుగా పరిశీలకులు భావిస్తున్నారు. కార్మిక సమస్యల పేరుతో తెరపైకి వస్తున్న

ఈ రాజకీయం రానున్న రోజుల్లో ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో వేచి చూడాలి

# ప్రేమ వేధింపులతో యువతి ఆత్మహత్య



పరిగి వికారాబాద్ జిల్లా పరిగి మండలం రావులపల్లి గ్రామంలో దారుణం జరిగగింది. ప్రేమ పేరుతో యువకుడి వేధింపులు ఎక్కువ కావడంతో బాలిక ఆత్మహత్య చేసుకుంది. బాధితురాలు గ్రామశివారులోని బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. చరణ్ అనే యువకుడు ప్రేమించాలని పదే పదే ఫోన్ చేసి ఒత్తిడి చేసాడు. పోలీసులు బాలిక మృతదేహాన్ని పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిందితుడు చరణ్ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



మేడ్చల్ కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగారం రాంపల్లి చౌరస్తా లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నాగారం నుండి అహ్మద్ గూడ వైపు వెళ్తున్న గ్యాస్ లారీ ప్రమాదపు శాత్తు వెనక టైర్ కిందపడి యువకుడు అక్కడికక్కడే మృతి. ఉదయం జిమ్ ముగించుకొని శివానంద్ పూరి కాలనీ లో తన ఇంటికి వెళు ్తుండగా అఖిల్ (20 సంవత్సరాలు )లారీ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు రోదన అక్కడ ఉన్న వారి ని కంటతడి పెట్టింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టంకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## జీడిమెట్ల పోలీస్ స్టేటస్ పరిధి చింతల్లో విషాదం..

## సైనేడ్ ముట్టుకొని రెండున్నరేళ్ల చిన్నారి మృతి

మేడ్చల్ జీడిమెట్ల పోలీస్ స్టేటస్ పరిధి చింతల్లో సైనేడ్ ముట్టుకొని రెండున్నరేళ్ల చిన్నారి మృతి చెందాడు. దాంతో విష్ణు జ్యువెలరీ ఎదుట బంధువులు ఆందోళనకు దిగారు. న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు జీడిమెట్ల పోలీసులను ఆశ్రయించారు. చింతల్ కాస్త్రాబజార్లోని విష్ణు జ్యువెలరీ లో బంగారం కొనుగోలు చేసేందుకు తల్లితో కలిసి వచ్చిన రెండేళ్ల ఐదు నెలల చిన్నారి మిష సైనేడ్ పదార్థాన్ని ముట్టుకోవడంతో మృతి చెందినట్లు సమాచారం.

# ఎమ్మెల్సీకే టోపీ



హైదరాబాద్ ఏపీ ఎమ్మెల్సీ రామ చంద్రయ్య కే కేటుగాళ్లు టోకరా వేసారు. ఆయన దగ్గరే రూ.25 లక్షలు కాజేసారు. తమది కాని భూమి తమదేనని నమ్మించి మోసం చేసారు.

మాదాపూర్ 100 ఫీట్ రోడ్డులో తనకు 5.5 ఎకరాల భూమి ఉందని, ఆ భూమిని అమ్ముతున్నామని జూబ్లీహిల్స్లో నివాసం ఉండే ఏపీ ఎమ్మెల్సీ సి. రామచంద్రయ్యను పేరూరు తులసిగోపాల్, అతని కొడుకు గిరిధర్ అనే వ్యక్తులు. నమ్మించారు. వారి మాటలు నమ్మి రూ.25 లక్షలు అడ్వాన్సా రామచంద్రయ్య ఇచ్చారు. భూమి ఒరిజినల్ పత్రాలు చూపించాలని కోరగా తప్పించుకుని తిరగడంతో, అసలు ఆ భూమి తులసి గోపాల్ది కాదని తెలియడంతో ఎమ్మెల్సీ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పౌరసరఫరాల శాఖ మేనేజర్ కురూ.100 కోట్ల ఆస్తులు..



మహబూబాబాద్ పౌరసరఫరాల శాఖ మేనేజర్ వాసంశెట్టి నరసింహారావు భారీగా అక్రమ ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ గుర్తించింది.గతంలో రెండుసార్లు సస్పెండ్ అయిన ఆయనపై తాజాగా ఫిర్యాదులు రావడంతో తనిఖీలు చేసింది.ఖమ్మం, సూర్యాపేట,నిజామాబాద్ జిల్లాల్లో 28 ఎకరాల భూమి,5ప్లాట్లు,ఖమ్మం,హైదరాబాద్ లో భవనాలు,361గ్రా.బంగారం,రూ.33 లక్షల విలువైన వెండి ఉన్నట్లు తేలింది.ఆస్తుల మార్కెట్ విలువ రూ.100అఖీకు పైగా ఉంటుందని అంచనా.

## బస్టాండులో వ్యాపారాల జోరు..

వనపర్తి .నాలుగు దశాబ్దాలైనా మారని వనపర్తి బస్టాండ్ తీరు.పండుగ వేళ బస్సుల కోసం పడిగాపులు.. పట్టించుకోని అధికారులు.చెత్తాచెదారం మధ్యే ప్రయాణాలు.. అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు ఆగ్రహనీ.బస్టాండులో వ్యాపారాలకు ఇచ్చే ప్రాధాన్యం ప్రయాణికుల సౌకర్యాలకు ఏదీ? ఆదాయం మీద ఉన్న శ్రద్ధ.. ప్రయాణికుల ఇబ్బందులపై ఎందుకు లేదు? నాలుగు దశాబ్దాలు గడిచినా వనపర్తి ఆర్టీసీ బస్టాండ్ రూపురేఖలు మారకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. దసరా పండుగ వేళ సొంతూళ్లకు వెళ్లాల్సిన ప్రయాణికులు బస్సుల కోసం గంటల తరబడి పడిగాపులు కాస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు పడుతున్న అవస్థలు చూసి చలించిన అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు శనివారం బస్టాండ్ పరిసరాలను పరిశీలించి అధికారుల తీరుపై మండిపడ్డారు.బస్సుల్లేవు.. సౌకర్యాల్లేవు!జిల్లా కేంద్రం నుంచి నిర్ణీత సమయానికి బస్సులు నడపలేని దుస్థితి నెలకొందని అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ సతీష్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. డిపోలో సరిపడా బస్సులు లేక ప్రైవేట్ బస్సులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. పండుగ సమయంలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. బస్సుల నిర్వహణలో లోపాలు, ప్రమాదాలపై అధికారులు దృష్టి సారించి ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని డిమాండ్ చేశారు.చెత్త కుప్పల మధ్య ప్రయాణమా?బస్టాండ్ పరిసరాలు చెత్తాచెదారంతో నిండిపోయినా శుభ్రతపై అధికారులకు పట్టింపు లేకపోవడం దారుణమని సతీష్ యాదవ్ విమర్శించారు. అపరిశుభ్ర వాతావరణం ప్రయాణికుల ఆరోగ్యానికి ముప్పుగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బస్టాండ్‌ను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు తాగునీరు, కూర్చునే వసతి తదితర మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని కోరారు.

# జ్ఞానేశ్ కుమార్ ను సస్పెండ్ చేయాలి

## ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి
## తొలగించిన ఓట్లను తిరిగి చేర్చాలి
## రైతు సంఘం డిమాండ్.




మండల కేంద్రనీ నందు రైతు సంఘం ఆధ్వర్యంలో దేశంలో 13. 8 కోట్ల మంది ఓటు హక్కును తొలగించి బిజెపికి తొత్తుగా వ్యవహరిస్తూ, ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తున్న జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కోరుతూ ,వాల్మీకి విగ్రహం సర్కిల్ నందు జ్ఞానేశ్ కుమార్ ఫోటోలను తగలబెట్టి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కే మల్లయ్య ,మండల కార్యదర్శి బి ఈరన్న మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని కూని చేసి 13.8 కోట్ల మందికి ఓటు హక్కు లేకుండా చేసి, బిజెపికి ఏజెంట్గా వ్యవహరిస్తూ ,ఇద్దరు కమిషనర్లు 10 నెలల కాలంలో 14 సార్లు ఎస్ ఐ ఆర్ పై అభ్యంతరాన్ని వ్యక్తం చేసినప్పటికీ ఏకపక్షంగా వ్యవహరిస్తూ ఎన్నికల వ్యవస్థ పైన ప్రజలకు నమ్మకం లేకుండా చేస్తున్న జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు.ఎన్నికల కమిషనర్లను నియమించే కమిటీ లో 2023 లో బిజెపి ప్రభుత్వం సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ ను తొలగించి అధికార పార్టీ లో ఇంకో మంత్ర ని పెట్టుకున్నప్పటి నుండి ఎన్నికల కమిషన్ స్వతంత్రతను కోల్పోయి బిజెపి ఏజెంట్గా మారిందని వారు ఆరోపించారు. తొలగించిన ఓట్లను తిరిగి చేర్చాలని ఫారం సిక్స్ లో చేసిన సవరణలను రద్దు చేయాలని డిమాండ్ చేసినారు .ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గురు, చిన్న మారయ్య, వీరేష్, వలి, ఖాదర్ భాష ఆంజనేయులు ,ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ రైతు అవార్డు గ్రహీత, బీసీ బిడ్డ..
# నందికొట్కూరు చైర్మన్ రేసులో జనసేన నేత మాసమ్ సాహెబ్

### ప్రజారాజ్యం నుండి జనసేన వరకు.. పార్టీ కోసం ప్రాణం పెట్టిన సమాజసేవకర్తకు చైర్మన్ పదవే లక్ష్యం
### వేతనంలో సగం పేదలకే.. నందికొట్కూరును అభివృద్ధి బాటలో నడిపిస్తా మాసమ్ సాహెబ్ సంచలన హామీ



నందికొట్కూరు ప్రజారాజ్యం నుంచి జనసేన వరకు పార్టీ జెండా మోసిన నిఖార్సయిన జన సైనికుడు బీసీ బిడ్డ మాసమ్ సాహెబ్ నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ పీఠంపై కన్నేశారు. జనసేన పార్టీ అవకాశం ఇస్తే చైర్మన్ రేసుకు సిద్ధమని సంచలన ప్రకటన చేశారు.తాను రియల్ ఎస్టేట్ వ్యాపారిగా, సమాజ సేవకుడిగా నందికొట్కూరు పట్టణంలోనే పుట్టి పెరిగానని, ఈ పట్టణంలోని ప్రతి వీధి, ప్రతి సమస్య తనకు తెలుసని ఆయన పేర్కొన్నారు.క్యాడర్ ఆవేదనను వినిపించిన మాసమ్ సాహెబ్.2024 ఎన్నికల్లో కూటమి గెలుపు కోసం నందికొట్కూరు నియోజకవర్గంలోని 6 మండలాల్లో జనసేన నాయకులు కార్యకర్తలు వీరమహిళలు ప్రాణం పెట్టి పనిచేశారు.కానీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జనసేనకు చెప్పుకోదగ్గ నామినేటెడ్ పదవులు గానీ టెండర్లు గానీ ఎక్కడా దక్కలేదు.ఇది చాలా బాధాకరం. దీంతో నియోజకవర్గ స్థాయిలో క్యాడర్ తీవ్ర అలకతో ఉంది. పార్టీ బలోపేతం కావాలంటే కార్యకర్తలకు అధికారికంగా ప్రజలకు సేవ చేసే అవకాశం ఇవ్వాలి అని మాసమ్ సాహెబ్ ఆవేదన వ్యక్తం చేశారు.నాకు జనసేన పార్టీ చైర్మన్ గా అవకాశం ఇస్తే.. నందికొట్కూరు మున్సిపాలిటీలో ఇప్పటివరకు ఎవరూ చూడని అభివృద్ధిని చేసి చూపిస్తా. కూటమిలోని తెలుగుదేశం బీజేపీ నేతలతో సమన్వయం చేసుకుంటూ పట్టణాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తా.నేను చైర్మన్ గా తీసుకునే గౌరవ వేతనంలో సగభాగాన్ని పదవిలో ఉన్నంతకాలం పేద ప్రజల సంక్షేమానికే ఖర్చు చేస్తానని మాట ఇస్తున్నా అని ఆయన ప్రకటించారు.జనసేనకు చైర్మన్ పదవి దక్కితే నియోజకవర్గంలో పార్టీ క్యాడర్ లో నూతన ఉత్సాహం వస్తుందని పార్టీ మరింత బలోపేతం అవుతుందని మాసమ్ సాహెబ్ ఆశాభావం వ్యక్తం చేశారు.




## మన గ్రామానికి గర్వకారణం

కోహెడ సిద్దిపేట జిల్లా కోహెడ మండలం చెంచర్ పల్లె గ్రామానికి చెందిన కంకనాల పర్శురామ్ రెడ్డి తన బృందంతో కలిసి జాతీయ స్థాయి ప్రాజెక్ట్ పోటీలలో పాల్గొని ప్రథమ బహుమతి సాధించడం ఎంతో గర్వకారణం.మహిళలు నెలసరి సమయంలో ఎదుర్కొనే కడుపునొప్పి, అసౌకర్యాన్ని తగ్గించడంలో సహాయపడేలా 'పీరియడ్' నొప్పి నివారణ పరికరం రూపొందించి,తన మొదటి పరికరంతోనే జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి సాధించడం విశేషం.మన చెంచర్ పల్లె గ్రామం నుంచి ఇలాంటి వినూత్న ఆలోచనలతో ముందుకు వచ్చి జాతీయ స్థాయిలో విజయం సాధించడం మన జిల్లాకు, మన మండలానికి, మన గ్రామానికి, మనందరికీ గర్వకారణం.కంకనాల పర్శురామ్ రెడ్డికి మరియు వారి బృందం సభ్యులందరికీ హృదయపూర్వక అభినందనలు.భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించి మన గ్రామానికి, మన ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము.

## వనపర్తి జిల్లా పదేళ్ల పండగ సందర్భంగా అభివృద్ధి ప్రస్తావని గుర్తు చేసుకుందాం

### మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి.

వనపర్తి. పరిపాలన వికేంద్రీకరణ పాలన సంస్కరణలు తెచ్చిన ఏకైక నాయకుడు కె.సి.ఆర్ 33జిల్లాల ఏర్పాటు కొత్త మండలాల ఏర్పాటు.విప్లవాతమమైన మార్పు.దశాబ్ది ఉత్సవాల కృతజ్ఞతా 5ఐ రన్ జయప్రదం చేద్దాం.పాల్గొననున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వాకిటి శ్రీధర్, ఃఖీూ జిల్లా అధికార ప్రతినిధి. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల.చంద్రశేఖర్ రావుతెలంగాణ రాష్ట్రంలో పరిపాలన వికేంద్రీకరణ పాలన సంస్కరణలలో భాగంగా 33నూతన జిల్లాలు, నూతన మండలాలు ఏర్పాటు చేసి 10సంవత్సరాలు అయిన సందర్భంగా.దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మాజీ మంత్రిసింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో. అక్టోబర్ 11,ఆదివారం, ఉదయం 6:00గంటలకు ప్రారంభం.స్థలం: స్థానిక పాలిటెక్నిక్ కళాశాల నుండి నల్లచెరువు ట్యాంక్ బండ్ వరకు 5కె రన్ నిర్వహించడం జరుగుతుందని జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ తెలిపారు.అభివృద్ధి కాముకులు, యువకులు, విద్యార్థులు, మేధావులు, మహిళలు, బి.ఆర్.ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయగలరని శ్రీధర్ విజ్ఞప్తి చేశారు

# ఆర్టీసీ యూనియన్ ఎన్నికల్లో అధికార పార్టీకి షాక్



హైదరాబాద్ తెలంగాణ ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికల్లో అధికార పార్టీకి ఎదురు దెబ్బ తాకింది. స్వయానా రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ హామీల వర్షం కురిపించినా, టీపీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ ప్రచారం చేసినా, ఆర్టీసీ కార్మికులు కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇచ్చిన కూటమిని లైట్ తీసుకున్నారు.

శుక్రవారం న్న జరిగిన తెలంగాణ ఆర్టీసీ ఎన్నికల్లో టీఎస్ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ), తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ), నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) కూటమి ఘన విజయం సాధించింది.

కాంగ్రెస్ మద్దతిచ్చిన తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ (టీడబ్ల్యూయూ), స్టాఫ్ వర్కర్స్ అండ్ ఫెడరేషన్ (ఎస్డబ్ల్యూయూ) కూటమికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కానీ, అనుబంధ కార్మిక సంఘం కానీ ఎవరికి మద్దతు ఇవ్వలేదు. బడా నేతలు ప్రచారం చేసినా కూడా గుర్తింపు సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమికి చుక్కెదురవ్వడం ఇప్పుడు చర్చనీయాంశం అయ్యింది.

# ఢిల్లీలో ప్రజాస్వామ్య హక్కులను కాలరాయొద్దు..

## నిరసనలను అణచివేయడం మానుకోవాలి
## -మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ ఎన్నికల అక్రమాలపై ప్రశ్నిస్తే అరెస్టులా..? ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను తొలగించాల్సిందే. నిరసన తెలిపే హక్కును అడ్డుకునే అధికారం ఎవరిచ్చారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఢిల్లీలో ప్రజాస్వామ్య హక్కులను కాలరాయొద్దు. నిరసనలను అణచివేయడం మానుకోవాలి. జంతర్ మంతర్కు వెళ్లకుండా నిరసనకారులను ఎందుకు అడ్డుకుంటున్నారు ? ఓటర్ల జాబితా సవరణ (ూఎఖీ) పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిస్తున్నారన్న ఆరోపణలపై సమాధానం చెప్పాలి. దొంగ ఓట్ల నమోదుపై వస్తున్న ఆరోపణలపై ఎన్నికల సంఘం విచారణ జరపాలి.రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వంటి నాయకులపై పోలీసుల దాడుల ఆరోపణలు ఆందోళనకరం. ఢిల్లీలో ఇంటర్నెట్, రైళ్లు, బస్సులు, మెట్రో సేవల నిలిపివేతపై స్పష్టత ఇవ్వాలి. 50 వేల కేంద్ర పోలీసు బలగాల మోహరింపు, విద్యార్థుల అరెస్టులపై సమాధానం చెప్పాలి. నిరసనకారులను అడ్డుకునేందుకు బీజేపీ, సంఘ్ పరివార్ కార్యకర్తలను సమీకరిస్తున్నారన్న ఆరోపణలపై స్పష్టత ఇవ్వాలి. దేశంలో ఘర్షణలకు తావిచ్చే పరిస్థితులు సృష్టించవద్దు – శాంతిభద్రతలను కాపాడాలి. రైతుల ఉద్యమాన్ని అణచివేసినట్లే ఇప్పుడు విద్యార్థుల నిరసనలను అణచివేయాలని చూస్తున్నారా? ఈడీ, సీబీఐ, ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగబద్ధ సంస్థలు స్వతంత్రంగా పనిచేయాలి. బీజేపీ తన వైఖరి మార్చుకుని ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలి. బ్రిటిష్ పాలనను ఎదిరించిన కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు పోరాడుతుంది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా నుండి బీజేపీ తిరోగమనం ప్రారంభమైంది. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును, నిరసన తెలిపే హక్కును ఎవరూ కాలరాయలేరని అన్నారు.

# మోడి అంటే " మర్డరర్ ఆఫ్ డెమొక్రటిక్ ఆఫ్ ఇండియా "

### ఫారం 6, ఫారం 7 లను మోడీ దుర్వినియోగం చేశారు
### మా దగ్గర కత్తులు కటార్లు బాంబులు ఏమీ లేవు. అడ్డుకోవడం చంద్రబాబు కి తగదు వైఎస్ షర్మిలా రెడ్డి




విజయవాడ నన్ను హౌజ్ అరెస్ట్ చేయించడం చంద్రబాబు కి న్యాయమా ? నిరసన వ్యక్తం చేయడం రాజ్యాంగం కల్పించిన హక్కు. కత్తులు, రాళ్లు మా దగ్గర లేవు. శాంతియుతంగా రాజ్ భవన్ కి వెళ్ళాలి అనుకున్నాం . ప్రజాస్వామ్యం బ్రతకాలి అంటే ఓటు ఉండాలి . ఇలాంటి ఓటు హక్కును బీజేపీ ప్రభుత్వం తొలగిస్తుందని ఏపీసీసీ ఛీఫ్ షర్మిలా రెడ్డి అన్నారు.

షర్మిలా మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 13.40 కోట్ల ఓట్లను తొలగించారు. ఓటర్ల జాబితా నుంచి 13 నుంచి 20 శాతం మందిని తొలగించారు. ఇలా చేస్తే ప్రజాస్వామ్యం ఎలా బ్రతుకుతుంది ? ప్రజల ఓటు చోరీ అవుతుంటే నిరసన చేయడం తప్పా ? ఓటు వజ్రాయుధం. నచ్చిన నాయకుడిని స్వేచ్ఛగా ఎన్నుకొనే హక్కు ఉంది. దళితులు, పేదలు, ముస్లిం, క్రిస్టియన్ల ఓట్లు తొలగిస్తున్నారు. పథకం ప్రకారం బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తుంది. ?కర్ణాటకలో వోట్ చోరీ పై రాహుల్ గాంధీ అన్ని నిజాలు బయట పెట్టారు. బ్రతికి ఉన్న వారి ఓట్లను చనిపోయినట్లు తొలగించారు. ఫారం 6, ఫారం 7 ను బీజేపీ కావాల్సినట్టుగా దుర్వినియోగం చేస్తుంది స్వయం ప్రతిపత్తి సంస్థలు అన్ని మోదీ గుప్పిట్లో ఉన్నాయి . ఎన్నికల సంఘం మోదీ చెప్పినట్లుగా పని చేస్తుంది. ?జ్ఞానేశ్ కుమార్ ను పథకం ప్రకారం అఇఅ చేశారు. జ్ఞానేష్ కోసం ఏకంగా 2023 లో చట్టాన్ని మార్చారని అన్నారు.

సీఈసీ ని ఎంపిక చేయాలి అంటే ప్రధాని, ప్రతిపక్ష నాయకుడు, సీజేఐ ముగ్గురు కమిటీ సభ్యులుగా ఉండాలి. కానీ అఏఎ స్థానంలో క్యాబినెట్ మంత్రిని పెట్టారు. ?అమిత్ షా ను కావాలని మోదీ కమిటీకి నామినేట్ చేశారు. ముగ్గురి సభ్యుల్లో ఇద్దరి మెజారిటీ ఉంటే చాలు. ఎల్వోపీ ఆమోదం లేకుండా నచ్చిన వ్యక్తిని అఇఅ చేయొచ్చు . అందుకే బీజేపీ కార్యకర్త జ్ఞానేష్ ను అఇఅ చేశారు .చీఫ్ ఎలక్షన్ కమిషనర్ గా జ్ఞానేష్ ఉండటం ప్రజాస్వామ్యానికి సేఫ్ కాదు. జ్ఞానేష్ మీద మాకు నమ్మకం లేదు. ఫారం 7 ను పూర్తిగా బీజేపీ దుర్వినియోగం చేసింది. కర్ణాటకలో ఒక బీజేపీ కార్యకర్త 7 వేల ఓట్లను పేరు రాసి తొలగించారు. ?ఓటరు కి సంబంధం లేకుండా ఓటు తొలగించారు . ?మేము కూడా జ్ఞానేష్ కుమార్ పేరును ఫారం 7 లో రాస్తున్నాం . ఆయనకు కూడా ఆయన ఓటు తొలగిస్తే ఎంత బాధ ఉంటుంది తెలియాలి. ఎవరైనా ఫారం 7 లో జ్ఞానేష్ పేరు రాసి ఆయన బూత్ లో ఇవ్వాలి. మోడీ అంటే "మర్డరర్ ఆఫ్ డెమాక్రటిక్ ఇండియా. ?మోదీ అంటే ప్రజాస్వామ్యాన్ని చంపే వాడని అన్నారు.

## ప్రకాశం జిల్లాలో విషాదం.. పాకల బీచ్‌లో ఇద్దరు యువకులు మృతి

సింగరాయకొండ: ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం పాకల బీచ్‌లో విషాదకర ఘటన చోటుచేసుకుంది. సముద్రంలో స్నానానికి వెళ్లిన కనిగిరికి చెందిన ఏడుగురు యువకులు గల్లంతయ్యారు.సమాచారం అందుకున్న మెరైన్ సిబ్బంది వెంటనే స్పందించి ఐదుగురిని సముద్రం నుంచి బయటకు తీసుకొచ్చారు. అయితే వారిలో ఇద్దరు మృతి చెందగా, మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.ఇదిలా ఉండగా, సముద్రంలో గల్లంతైన మరో ఇద్దరి ఆచూకీ కోసం మెరైన్ పోలీసులు మత్స్యకారుల సహకారంతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనతో కనిగిరి ప్రాంతంలో విషాదం నెలకొంది. మృతుల పేర్లు, వయస్సులు, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# ప్రజా వ్యతిరేకతను బేఖాతరు చేస్తున్న ఎక్సైజ్ శాఖ

**రేణిగుంటలో జనావాసాలు,**
**బడుల మధ్యే యథేచ్ఛగా వైన్ షాపులు?**
**తొమ్మిది రోజులుగా మహిళలు, ప్రజా సంఘాల నిరసనలు....**
**తీరుమారని ఎక్సైజ్ అధికారులు.....**
**నిబంధనల పేరుతో కాలయాపన... వైన్‌షాపుల**
**యజమానులకు కొమ్ముకాస్తున్న వైనం?**
**విచారణ పేరుతో చేతులు దులుపుకుంటున్న అధికారులు?**

రేణిగుంట: ప్రత్యేక ప్రతినిధితిరుపతి జిల్లా రేణిగుంటలో ప్రజల ప్రాణాలతో, మహిళలు, విద్యార్థుల భద్రతతో ఎక్సైజ్ శాఖ చెలగాటమాడుతోంది. జనావాసాలు, పవిత్ర ప్రార్థనా స్థలాలు, బడులు, బస్టాప్‌లకు అతి సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటైన 'ఆద్య వైన్స్', 'సర్వేశ్ వైన్స్' మద్యం దుకాణాలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ ప్రజలు, మహిళా సంఘాలు భగ్గుమంటున్నాయి. అయితే, ప్రజా ఆగ్రహాన్ని, మహిళల ఆవేదనను కనీసంగా కూడా పరిగణనలోకి తీసుకోని ఎక్సైజ్ శాఖ అధికారులు.. "నిబంధనల ప్రకారమే వైన్ షాపులు నడుస్తున్నాయి" అంటూ బాధ్యతారహితమైన ప్రకటనలు చేయడం పట్ల సర్వత్రా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.?తొమ్మిది రోజులుగా ఆందోళనలు.. పట్టించుకోని అధికార యంత్రాంగం..రేణిగుంట పాంచాలినగర్ ప్రాంతంలో వెలిసిన ఈ మద్యం దుకాణాల వల్ల నిత్యం మహిళలు, పాఠశాలలకు వెళ్లే చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగుబోతుల బెడదతో ఇళ్ల నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేదని, అసాంఘిక కార్యకలాపాలకు ఈ దుకాణాలు అడ్డాగా మారుతున్నాయని స్థానికులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఈ దుకాణాలను తక్షణమే ఊరి బయటకు తరలించాలని కోరుతూ స్థానికులు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా ఆధ్వర్యంలో గత తొమ్మిది రోజులుగా రోడ్డు ఎక్కి నిరసనలు,



ధర్నాలు చేస్తున్న.. ప్రభుత్వంలో స్పందన కరువైంది. గ్రీవెన్స్ సెల్ ఫిర్యాదుతో తంతు తూతూ మంత్రంగా విచారణ...ప్రజల నుంచి వస్తున్న తీవ్ర వ్యతిరేకత నేపథ్యంలో సెప్టెంబర్ 28న తిరుపతి జిల్లా కలెక్టరేట్ గ్రీవెన్స్ సెల్లులో బాధితులు స్పష్టమైన ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు పై శనివారం ఉదయం ఎక్సైజ్ సీఐ ఏలూరు నరసానాయుడు బృందం విచారణకు దిగింది. ఈ సందర్భంగా స్థానికులు మునస్వామి రాయుడు శివప్రసాద్ ప్రసన్నలక్ష్మి తదితరులు మద్యం దుకాణాల వల్ల జరుగుతున్న అనర్థాలను అధికారుల ముందు పూస గుచ్చి వివరించారు.నిబంధనల ముసుగులో వైన్ షాపుల తొలగింపునకు ఎసరు...మహిళల భద్రతను ప్రజా శ్రేయస్సును గాలికి వదిలేసి ఎక్సైజ్ నిబంధనల ప్రకారమే దుకాణాలున్నాయి. అంటూ అధికారులు చెబుతున్న మాటలు వింటే వారికి ప్రజల ఆరోగ్యం కంటే వ్యాపారుల ప్రయోజనాలే ముఖ్యమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జనావాసాల మధ్య బడులు గుడుల పక్కనే మద్యం దుకాణాలు ఉంటే నిబంధనలు ఎలా సంక్రమవుతాయని ప్రజలు నిలదీస్తున్నారు. ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి, మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్న ఈ మద్యం దుకాణాలను తక్షణమే తొలగించాలని లేనిచో ప్రజా ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కొండ్రెడ్డి ఈశ్వరమ్మ హెచ్చరించారు. ఈ విచారణ కార్యక్రమంలో ఐద్వా మండల అధ్యక్షురాలు భారతి సిపిఎం నాయకులు వెంకటరమణ రేణిగుంట ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కొండ్రెడ్డి హరినాథ్ సిఐటియు మండల కన్వీనర్ సెల్వరాజ్ తదితరులు పాల్గొని ఉద్యమానికి మద్దతు తెలిపారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని ప్రజల శ్రేయస్సు దృష్ట్యా ఆ మద్యం దుకాణాలను అక్కడి నుంచి శాశ్వతంగా తరలించాలని ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

# గ్లోబల్ గ్రేస్ క్యాన్సర్ రన్ 2026లో 300 మందికి పైగా క్యాన్సర్ విజేతలు

హైదరాబాద్, అక్టోబర్ 10,క్యాన్సర్‌ను జయించి జీవితంలో ముందుకు సాగుతున్న 300 మందికి పైగా క్యాన్సర్ విజేతలు, మరో 35,000 మంది రన్నర్లతో కలిసి క్యాంబియంట్ గ్లోబల్ గ్రేస్ క్యాన్సర్ రన్ 2026లో పాల్గొననున్నారు. ఎవర్‌నార్త్ హెల్త్ సర్వీసెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ 9వ ఎడిషన్ అక్టోబర్ 11, ఆదివారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరగనుంది.తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి 300 మందికి పైగా క్యాన్సర్ విజేతలు ఒకే వేదికపైకి వచ్చి పాల్గొనడం ఈ ఏడాది కార్యక్రమంలో అత్యంత ప్రత్యేకమైన అంశంగా నిలవనుంది. క్యాన్సర్ అవగాహన రన్‌లో ఇంత పెద్ద సంఖ్యలో క్యాన్సర్‌ను జయించిన వారు పాల్గొనడం, క్యాన్సర్‌పై ప్రపంచవ్యాప్త పోరాటానికి ఆశ, ధైర్యం, ఆత్మవిశ్వాసం, పట్టుదలతో కూడిన శక్తివంతమైన సందేశాన్ని అందించనుంది. క్యాన్సర్ అవగాహన రన్‌లో క్యాన్సర్ విజేతలు పాల్గొనే అతిపెద్ద కార్యక్రమాల్లో ఇది ఒకటిగా నిలిచే అవకాశం ఉంది.ఈ క్యాన్సర్ విజేతలు ఉదయం ×7:45 గంటలకు ప్రారంభమయ్యే ప్రత్యేక 'కాంకరర్స్ రన్'×లో పాల్గొంటారు. వారి భాగస్వామ్యం జీవితాన్ని వేడుకగా జరుపుకోవడంతో పాటు, క్యాన్సర్ నిర్ధారణ అయినంత మాత్రాన జీవితంలోని కలలు, ఆశయాలు, అవకాశాలు ముగిసిపోవని చాటిచెప్పనుంది.ప్రతి క్యాన్సర్ విజేత వెనుక పోరాటం, అనిశ్చితి, చికిత్స, పట్టుదలతో కూడిన ఒక కథ ఉంటుంది. కొందరు పెద్ద శస్త్రచికిత్సలు చేయించుకోగా, మరికొందరు కీమోథెరపీ, రేడియేషన్ వంటి చికిత్సలను ఎదుర్కొన్నారు. దీర్ఘకాలిక చికిత్స, కోలుకునే క్రమంలో ఎదురైన ఎన్నో సవాళ్లను అధిగమించి వారు ఈ రన్‌లో పాల్గొనడం, ప్రస్తుతం క్యాన్సర్‌తో పోరాడుతున్న వేలాది మందికి స్ఫూర్తినివ్వనుంది.300 మందికి పైగా క్యాన్సర్ విజేతలను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా, క్యాన్సర్‌పై ప్రజల్లో ఉన్న భయాన్ని తొలగించి, దాని గురించి మరింత సానుకూలమైన అవగాహన కల్పించడమే గ్లోబల్ గ్రేస్ క్యాన్సర్ రన్ లక్ష్యం. వీరి భాగస్వామ్యం ద్వారా ముందస్తు గుర్తింపు, సకాలంలో చికిత్స, పునరావాసం, మానసిక మద్దతు, స్క్రీనింగ్ సేవల ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయనున్నారు.ఇటీవల క్యాన్సర్ నిర్ధారణ అయిన రోగులకు, వారి కుటుంబాలకు వందలాది మంది క్యాన్సర్ విజేతలు కలిసి పాల్గొనడం ఒక ముఖ్యమైన సందేశాన్ని అందిస్తుంది. క్యాన్సర్ నిర్ధారణతో జీవితం ముగిసిపోదు. ముందస్తుగా గుర్తించడం, సకాలంలో చికిత్స పొందడం ద్వారా మెరుగైన ఫలితాలను సాధించే అవకాశం ఉంటుంది.

# జగన్ కేసుల్లో రోజువారీ విచారణ చేపట్టండి

– హైదరాబాద్ వైకాపా అధినేత, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ఇతర నిందితులపై దాఖలైన మనీలాండరింగ్ (పీఎంఎల్‌ఏ) కేసుల విచారణను వేగవంతం చేయాలని, రోజువారీ ప్రాతిపదికన విచారణ జరపాలని కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తెలంగాణ హైకోర్టులో రిట్ పిటిషన్ (నం. 33845/2026) దాఖలు చేసింది. కేసులోని నిందితులందరూ విచారణకు వ్యక్తిగతంగా హాజరయ్యేలా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరింది.పదేళ్లుగా కొలిక్కిరాని విచారణదివంగత వై.ఎస్. రాజశేఖరరెడ్డి హయాంలో ప్రభుత్వ లబ్ధి పొందిన పలు కార్పొరేట్ సంస్థలు, వ్యక్తులు క్విడ్ ప్రో కో పద్ధతిలో జగన్‌మోహన్‌రెడ్డి కంపెనీల్లో అధిక ప్రీమియంతో అక్రమంగా పెట్టుబడులు పెట్టారనే ఆరోపణలపై సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ దర్యాప్తు చేపట్టింది. భారతి సిమెంట్స్, జగతి పబ్లికేషన్స్, జనని ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి సంస్థల్లోకి అరబిందో, హెటిరో, వాన్‌పిక్, ఇండియా సిమెంట్స్ తదితర సంస్థలు భారీగా నిధులు మళ్లించినట్లు గుర్తించింది. ఈ క్రమంలో 2016 నుంచి 2021 మధ్య కాలంలో నాంపల్లి సీబీఐ ప్రత్యేక కోర్టులో ఈడీ 9 ప్రాసిక్యూషన్ ఫిర్యాదులను దాఖలు చేసింది.ఈ 9 ఫిర్యాదులను ప్రత్యేక న్యాయస్థానం విచారణకు స్వీకరించి ఏళ్లు గడుస్తున్నా, నిందితులు దాఖలు చేసిన డిశ్చార్జి పిటిషన్ల కారణంగా కేసు ప్రాథమిక దశలోనే నిలిచిపోయిందని ఈడీ తెలిపింది. న్యాయాధికారుల బదిలీలు తదితర కారణాల వల్ల డిశ్చార్జి పిటిషన్లపై ఎలాంటి తుది నిర్ణయం వెలువడకుండా తీవ్ర జాప్యం జరుగుతోందని పిటిషన్‌లో పేర్కొంది.ఆర్టికల్ 21 ప్రకారం సత్వర న్యాయం కావాలిగతంలో 'వై.ఎస్. జగన్ వర్సెస్ సీబీఐ' కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును ఈడీ ప్రస్తావించింది. ఆర్థిక నేరాలు దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే తీవ్రమైన అంశాలని, వాటిని భిన్నమైన దృక్పథంతో చూడాలని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసిన విషయాన్ని గుర్తుచేసింది.

# లెనిన్ సెంటర్ లో అఖిల పక్షాల ఆందోళన



లెనిన్ సెంటర్ ఓట్ల దొంగ జ్ఞానేష్ కుమార్ ను తొలగించాలని, సర్ ను రద్దు చేయాలని, ఓటు హక్కును పరిరక్షించాలని కోరుతూ అఖిల పక్షాలు, ప్రజా సంఘాలు చేపట్టిన చలో లోక్ భవన్ కార్యక్రమంలో వందలాదిమంది లెనిన్ సెంటర్ కు చేరుకున్నారు. పోలీసుల ముందస్తు అరెస్టులు, నిర్బంధాలను ఛేదించుకుని కార్యకర్తలు, విద్యార్థులు, యువత, పార్టీల, సంఘాల నేతలు వందలాది మందిని పోలీసులు అరెస్టు చేశారు మహిళలను, విద్యార్థినులను సైతం పోలీసులు ఈడ్చుకొని వెళ్లి పోలీస్ వాహనాల్లో వేశారు. పలువురికి గాయాలయ్యాయి.అలంకార్ సెంటర్, లెనిన్ సెంటర్లలో కార్యకర్తలు బైఠాయించి పెద్ద ఎత్తున మోడీ ప్రభుత్వానికి, ఎన్నికల కమిషనర్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.




వందలాదిగా పోలీసులు, పదుల సంఖ్యలో వాహనాలతో మోహరించినప్పటికీ కార్యకర్తలు, యువత తరలివచ్చి ఉధృతంగా ఆందోళన సాగించారు, ఓట్లు దొంగ జ్ఞానేశ్ కుమార్ ను మోడీ, అమిత్ షా, బీజేపీ ప్రభుత్వం కాపాడుతోందని, వారంతా కుమ్మక్కయ్యారని నేతలు ఆరోపించారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ,కూటమి సర్కార్ ఓటు హక్కును పరిరక్షించాల్సిపోయి, నిసిగ్గుగా ఎన్నికల కమిషన్ ను, కేంద్ర ప్రభుత్వాన్ని బలపరచటం సిగ్గుచేటుఓట్ల దొంగలు ఉన్న అరెస్టు చేయకపోగా ఓటు హక్కు కోసం పోరాడుతున్న వారిని అరెస్టు చేయటం దుర్మార్గం. ఢిల్లీలో మోడీ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం, నిర్బంధాన్ని ప్రయోగించడం, అణిచివేయటం గర్హనీయమని, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబురావు అన్నారు.

# హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుల అంతర్రాష్ట్ర ఆపరేషన్లు

హైదరాబాద్ నగర సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సెప్టెంబర్ 2026 నెలలో నమోదైన పలు ఔఅభీఖ ఫిర్యాదులపై వేగంగా స్పందించి, మొత్తం 83 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసింది. ఈ నెలలో చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్లలో భాగంగా హైదరాబాద్ నగర సైబర్ క్రైమ్ పోలీసులు దేశవ్యాప్తంగా 9 విభిన్న రాష్ట్రాల్లో దాడులు నిర్వహించి 23 సైబర్ క్రైమ్ కేసులకు సంబంధించి 35 మంది నిందితులను అరెస్ట్ చేశారు. అలాగే సైబర్ నేరగాళ్ల ఖాతాల్లో స్తంభింపజేసిన మొత్తం ?88,48,134 రూపాయలను బాధితులకు విజయవంతంగా తిరిగి వాపసు (రిఫండ్) చేయించారు. ఈ సెప్టెంబర్ నెలలో అరెస్టయిన 35 మంది నిందితుల నేరాల స్వభావాన్ని పరిశీలిస్తే.. సోషల్ మీడియా నేరాలకు సంబంధించి 9 మంది, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌లో 7 మంది, డిజిటల్ అరెస్ట్ కేసుల్లో 6 మంది, ట్రేడింగ్ ఫ్రాడ్‌లో 5 మంది, ప్రకటనల మోసాల్లో (ంటలవతీబితిబవఎవనిబి ఈతీజీబీట) 3 మంది, ఐడెంటిటీ థెఫ్ట్‌లో (ఎటవనిబితిబిం బిష్ట్రవటబి) ఇద్దరు, ఎక్స్‌టార్షన్ (బెదిరింపులు) కేసులో ఒకరు, జాబ్ ఫ్రాడ్‌లో ఒకరు, కస్టమర్ కేర్ మోసంలో ఒకరు చొప్పున ఉన్నారు. వీరు అరెస్ట్ అయిన రాష్ట్రాల వారీగా వివరాలు చూస్తే.. తెలంగాణ నుండి 10 మంది, ఆంధ్రప్రదేశ్ నుండి 9 మంది, మహారాష్ట్ర నుండి 6 మంది, కేరళ నుండి ముగ్గురు, ఉత్తర ప్రదేశ్ నుండి ముగ్గురు, బీహార్ నుండి ఒకరు, హర్యానా నుండి ఒకరు, రాజస్థాన్ నుండి ఒకరు మరియు పంజాబ్ నుండి ఒకరు ఉన్నారు. నిందితుల వద్ద నుండి 10 మొబైల్ ఫోన్లు, 07 చెక్ బుక్కులు, ఒక షెల్ కంపెనీ సీల్ స్టాంప్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివిధ మోసాల పద్ధతుల (ఓనీటబీబ ూజూవతీజీనిటతి) వారీగా బాధితులు కోల్పోయిన మొత్తం మరియు పోలీసులు వాపసు చేయించిన రిఫండ్ వివరాలను పరిశీలిస్తే.. ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌కి చెందిన 17 కేసుల్లో బాధితులు ?7,68,42,420 నష్టపోగా ?9,20,201 రిఫండ్ చేయించారు. ట్రేడింగ్ ఫ్రాడ్ 11 కేసుల్లో ?8,43,49,836 పోగొట్టుకోగా ?40,24,762 వాపసు ఇప్పించారు. 5 ఓటీపీ ఫ్రాడ్ కేసుల్లో ?23,71,465 పోగా ?24,68,321 రిఫండ్ అయ్యాయి. 2 ఏపీకే ఫైల్ ఫ్రాడ్ కేసుల్లో ?8,18,716 నష్టపోగా ?5,50,832 రిఫండ్ చేయించారు. ప్రకటనల మోసం (ంటలవతీబితిబవఎవనిబి ఈతీజీబీట) ఒక కేసులో ?1,29,000 పోగా ?50,016 వాపసు ఇచ్చారు. డిజిటల్ అరెస్ట్ ఒక కేసులో ?85,00,047 నష్టపోగా ?6,91,076, మరియు అనధికార యూపీఐ లావాదేవీల (జనిజీబీబిష్ట్రనీతీతిళివట జఖఎ ంతీజీనిబజీఇబితినీనిబ) ఒక కేసులో ?4,84,674 నష్టపోగా ?1,42,926 రిఫండ్ ఇప్పించారు. ఈ విధంగా మొత్తం 38 కేసుల్లో బాధితులు ?17,34,96,158 నష్టపోగా, పోలీసులు ?88,48,134 మొత్తాన్ని బాధితులకు తిరిగి ఇప్పించగలిగారు. జోనల్ సైబర్ సెల్స్ (జిఅఅ) డేటా ప్రకారం.. ఈ విభాగం పరిధిలో 2,767 ఔఅభీఖ పిటిషన్లు రాగా, అందులో 381 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. 10 కేసులలో 11 మంది నిందితులను అరెస్ట్ చేసి, ?67,54,049 మొత్తాన్ని బాధితులకు రిఫండ్ చేశారు. డిజిటల్ మానిటరింగ్ ద్వారా సైబర్ పెట్రోల్ విభాగాలు నిర్వహించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ వివరాలను పరిశీలిస్తే.. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో మైనర్లను అసభ్యకరంగా, బూతు మాటలతో చూపుతూ వీక్షణలు, లైక్‌లు, సబ్‌స్క్రైబర్లు మరియు మానిటైజేషన్ పొందేందుకు రన్ చేస్తున్న 140 సోషల్ మీడియా ప్రొఫైల్స్, 30 పెయిడ్ ప్రకటనలను గుర్తించారు.

అలాగే పాత నాణాలు, ?5 ట్రాక్టర్ నోట్లు, ?786 సిరీస్ నోట్లు, మోసపూరిత బెట్టింగ్ అంచనాలు, గ్యారెంటీ గెలుపుల పేరుతో మోసాలు చేస్తున్న ప్రొఫైళ్లను నిలిపివేశారు. వీటితో పాటు మ్యాట్రిమోనియల్, ప్రైవేట్ వీడియో కాల్ సర్వీసులు, నకిలీ ఉద్యోగ ప్రకటనల ద్వారా అడ్వాన్స్ డబ్బులు, వ్యక్తిగత/ఆర్థిక వివరాలు సేకరించే అనుమానాస్పద ఖాతాలను గుర్తించి చర్యలు తీసుకున్నారు. ముందస్తు జాగ్రత్తగా ఈ 140 ఖాతాలను సంబంధిత సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లకు రిపోర్ట్ చేసి తొలగించేలా (ఛీనవని టనీలిని) చేశారు. సైబర్ పెట్రోల్ నిరంతర చర్యల్లో భాగంగా ఆన్‌లైన్ గేమింగ్, అక్రమ బెట్టింగ్, నకిలీ ఇన్వెస్ట్‌మెంట్ సైట్లను ప్రచారం చేస్తున్న 1,457 ప్రొఫైల్స్, 2,603 పెయిడ్ అడ్వర్టైజ్‌మెంట్లను నిలిపివేసి, వాటిని ప్రమోట్ చేస్తున్న వారిపై 09 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు.

# రైతుల సౌకర్యాలే కూటమి ప్రభుత్వ ప్రాధాన్యం

**సహకార వ్యవస్థ బలోపేతానికి మరో ముందడుగు..**

**ఐతవరం సొసైటీలో నూతన క్యాష్ కౌంటర్ ప్రారంభం.**

**ఐతవరం సొసైటీ అభివృద్ధితో రైతులకు మరింత మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయి**

**? ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**

..నందిగామ: రైతులకు మెరుగైన సేవలు అందిస్తూ సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు.నందిగామ మండలం ఐతవరం గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (ఖంఆూ) సొసైటీలో నూతనంగా ఏర్పాటు చేసిన క్యాష్ కౌంటర్‌ను ఉమ్మడి కృష్ణాజిల్లా కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం , మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు , మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ తో కలిసి ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా సొసైటీలో రైతులకు అందుతున్న సేవలు, నగదు లావాదేవీల నిర్వహణ, సహకార బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా రైతులకు కలుగుతున్న ప్రయోజనాలపై నాయకులు చర్చించారు. నూతన క్యాష్ కౌంటర్ అందుబాటులోకి రావడంతో రైతులు, ఖాతాదారులకు లావాదేవీల నిర్వహణ మరింత సులభతరం కానుంది. గ్రామీణ ప్రాంతాల్లో సహకార సంఘాల సేవలను మెరుగుపరచడం ద్వారా రైతులకు స్థానికంగానే అవసరమైన బ్యాంకింగ్ సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుంది.

# సదాశివపేట పట్టణం లోని సిద్దాపూర్ రోడ్డుకు శాశ్వత పరిష్కారం చూపాలి: జగ్గారెడ్డి, నిర్మల

### కూల్చివేతలు లేకుండా, పాన్ షాప్ లు, పూల దుకాణాలు,మటన్,చికెన్ దుకాణాలకు ఇబ్బంది కలగకుండా పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మించాలి

### అక్టోబర్ 30లోగా అంచనాలు సిద్ధం చేయాలని అధికారులకు సూచన



సదాశివపేట అక్టోబర్10:సదాశివపేట పట్టణంలోని సిద్దాపూర్ రోడ్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అధికారులను ఆదేశించారు. నిర్మల జగ్గారెడ్డితో కలిసి ఆయన సిద్దాపూర్ రోడ్డును పరిశీలించారు. ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, పబ్లిక్ హెల్త్, మున్సిపల్ అధికారులతో రోడ్డు నిర్మాణం, వర్షపు నీటి పారుదల, కల్వర్టులు, డ్రైనేజీ పనులపై సమీక్ష నిర్వహించారు.

మెయిన్ రోడ్డు నుంచి సిద్దాపూర్ కాలనీ చివరి వరకు పలుమార్లు పనులు చేపట్టినా రోడ్డు సమస్య పరిష్కారం కాకపోవడంపై జగ్గారెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. 2004లో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు సిద్దాపూర్ రోడ్డు వేయించానని గుర్తుచేశారు. గత పదేళ్లలో ఈ రోడ్డు విషయంలో ఏం జరిగిందో తెలియదన్నారు. ఇకపై సిద్దాపూర్ రోడ్డు సమస్య పదేపదే చర్చకు రాకుండా పటిష్ఠంగా పనులు చేపట్టాలని సూచించారు.

మెయిన్ రోడ్డు నుంచి సిద్దాపూర్ ఈద్గా వరకు సుమారు 1.5 కిలోమీటర్ల మేర పూర్తిస్థాయిలో సీసీ రోడ్డు నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని తెలిపారు. డిగ్రీ కళాశాల నుంచి మెయిన్ రోడ్డు జంక్షన్ వరకు సాంకేతికంగా సరైన లెవల్స్ తీసుకుని, వరద నీరు, డ్రైనేజీ నీరు సక్రమంగా వెళ్లేలా రోడ్డు నిర్మించాలని స్పష్టం చేశారు. రోడ్డు ప్రారంభం నుంచి చివరి వరకు ఎక్కడా వర్షపు నీరు నిలవకుండా డ్రైన్లు, అవసరమైన చోట్ల కల్వర్టులు ఏర్పాటు చేయాలన్నారు. కల్వర్టులు అవసరమైన ప్రాంతాలను జగ్గారెడ్డి, నిర్మల స్వయంగా పరిశీలించారు.

రోడ్డు వెడల్పు, అందుబాటులో ఉన్న స్థలాన్ని టేపుతో కొలిచి మరీ పరిశీలించారు.కూల్చివేతలు లేకుండా పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. 30 అడుగుల వెడల్పు ఉన్నచోట 30 అడుగులు, 40 అడుగులు ఉన్నచోట 40 అడుగులు, 60 అడుగులు అందుబాటులో ఉన్నచోట 60 అడుగుల మేర రోడ్డు నిర్మించాలని చెప్పారు. తనకు తెలియజేయకుండా సిద్దాపూర్ రోడ్డులో ఏ డబ్బానూ తొలగించవద్దని స్పష్టం చేశారు. చిరు వ్యాపారులు, పాన్‌షాపులు, పూల దుకాణాలు, మటన్, చికెన్ దుకాణాలకు ఇబ్బంది కలగకుండా పనులు జరగాలన్నారు. సిద్దాపూర్ కూడలిలో ప్రజలకు, వ్యాపారులకు ఇబ్బంది కలగకుండా జంక్షన్ అభివృద్ధి చేయాలని సూచించారు. మధ్యలో విగ్రహం ఏర్పాటుకు అనువుగా సర్కిల్ రూపకల్పన చేయాలని చెప్పారు. రోడ్డు పనులకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

సిద్దాపూర్ రోడ్డు పనులకు సంబంధించి రూ.2 కోట్ల నిధులు మిగిలి ఉన్నాయని, మున్సిపాలిటీలో టీఎఫ్ఐడీసీకి చెందిన మరో రూ.5 కోట్ల నిధులు కూడా అందుబాటులో ఉన్నాయని సమీక్షలో ప్రస్తావించారు. కలెక్టర్‌తో సమావేశం అనంతరం సంబంధిత శాఖల సమన్వయంతో పనులను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. సరైన లెవల్స్, డ్రైన్లు, కల్వర్టులతో కూడిన 1.5 కిలోమీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి అక్టోబర్ 30లోగా అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

పట్టణం, మండలంలోని సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు రోజూ ఒక ప్రాంతంలో పర్యటిస్తానని జగ్గారెడ్డి తెలిపారు. త్వరలో ఊబ చెరువును పరిశీలిస్తానన్నారు.

## ఘనంగా భారత్ స్కాట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపక దినోత్సవం



హైద్రాబాద్ అక్టోబర్ 10:భారత్ స్కాట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపక దినోత్సవం, ఫ్లాగ్ డేను హైద్రాబాద్ జిల్లా స్కాట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జెండా స్టిక్కర్స్ను జిల్లా స్కాట్స్ అండ్ గైడ్స్ అసోసియే షన్ కమిషనర్(బాలురు) బి.వెంకటేశ్వర్లు, గర్ల్స్ కమిషనర్ అనీల చేతుల మీద ఫ్లాగ్ స్టిక్కర్స్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యదర్శి లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ,స్కాట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లకు ఒక రోజు ఓరియంటేషన్ కార్యక్రమం, హైద్రాబాద్ జిల్లా వ్యాప్తంగా స్కాట్స్ అండ్ గైడ్స్ మూడు రోజుల టెస్టింగ్ క్యాంప్తో పాటు ర్యాలీ క్యాంప్ నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. హైద్రాబాద్ జిల్లాలో నూతనంగా ఆమోదం లభించిన ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, స్కాట్ మాస్టర్ అండ్ గైడ్ కెప్టెన్ పేర్లను త్వరలో నమోదు చేసుకుని వారికి దసరా సెలువు అనంతరం శిక్షణ అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కాట్స్ అండ్ గైడ్స్ అధికారులు లక్ష్మణ్ నాయక్, అనిత, మోహన్, రాములు నాయక్, హేమా ప్రియదర్శిని, దీపిక తదితరులు పాల్గొన్నారు.



## కవులు ఏ పుస్తకం రాసినా అచ్చు వేయించి ప్రచురించే బాధ్యత నాది:

మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావుసిద్దిపేట సిద్దిపేట జిల్లా ఏర్పడి పదేళ్లు పూర్తయిన సందర్భంగా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా స్థానిక విపంచి కళా నిలయంలో ఘనంగా నిర్వహించిన కవి సమ్మేళనంలో మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిద్దిపేట సాహిత్య వైభవం, స్వరాష్ట్రంలో సాధించిన గుణాత్మక మార్పులు, భవిష్యత్ ప్రణాళికలను వివరిస్తూ హరీశ్ రావు ప్రసంగించారు.హరీశ్ రావు మాట్లాడుతూజీవితం శాశ్వతమైనది కాదు ఈ సమాజంలో శాశ్వతంగా నిలిచిపోయేది అక్షరాలు, మనం చేసే మంచి పనులు మాత్రమే.కవులు ఏ పుస్తకం రాసినా సరే, దాన్ని స్వయంగా అచ్చు వేయించి ప్రచురించే పూర్తి బాధ్యతను నేను తీసుకుంటాను.సిద్దిపేటకు ఒక ప్రత్యేకత ఉంది.. ఈ రాష్ట్రంలో గానీ, దేశంలో గానీ అవార్డుల జాబితా ఉంటే అందులో సిద్దిపేట పేరు లేకుండా అవార్డే ఉండదు.అభివృద్ధి, హరితహారం, విద్య, వైద్యం, స్వచ్ఛతలోనే కాకుండా సాహిత్య రంగంలోనూ నంది పురస్కారం నుంచి జాతీయ సాహిత్య అకాడమీ వరకు సిద్దిపేటకు నిరంతరం అవార్డులు వస్తున్నాయిఒకప్పుడు ఎన్నికలు వస్తే గోడల మీద నినాదాలు మాత్రమే కనిపించేవి.. గెలిపిస్తే సిద్దిపేట జిల్లా చేస్తాం, గోదావరి జలాలు తెస్తాం, రైలు రప్పిస్తాం అని దశాబ్దాలుగా రాతలుగా మిగిలిన కలలన్నీ స్వరాష్ట్రంలో నేడు మన కళ్ల ముందే సాకారమైన నిజాలు.ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తూ విద్యా, వైద్యం, మౌలిక వసతులు, పచ్చదనం, సాగు, తాగునీటి రంగాల్లో సమగ్ర గుణాత్మక మార్పును తీసుకొచ్చాం.నేను కొత్తగా ఎమ్మెల్యే అయిన నాడు సిద్దిపేటలో కేవలం 50 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం మాత్రమే పండేది నేడు గోదావరి జలాలు, కాళేశ్వరం ప్రాజెక్టు పుణ్యమాని సాగు విస్తీర్ణం పెరిగి 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండుతోంది.ఆయిల్ పామ్ పంట అంటే ఏంటో తెలియని మన ప్రాంతంలో నేడు విరివిగా ఆయిల్ పామ్ తోటలు విస్తరించి రైతులు అధిక లాభాలు గడిస్తున్నారు.గతంలో తిరుపతికో, ఆంధ్ర ప్రాంతానికో, హైదరాబాద్‌కో వెళ్తేనే మనకు రైలు కనిపించేది మన ప్రజలకు రైలు అంటేనే తెలిసేది కాదు అలాంటిది నేడు రైలు మార్గం సిద్దిపేటకు వచ్చింది.రాబోయే కొద్ది రోజుల్లోనే రైల్వే విద్యుదీకరణ పూర్తయితే ప్రతి అరగంటకు ఉత్తర భారతానికి రైళ్లు నడిచే రోజులు అతి దగ్గరలోనే ఉన్నాయి.ఈ అభివృద్ధి అంతా సిద్దిపేట మట్టి గొప్పతనం, ప్రజల గొప్పతనం అందుకే ఈ పదేళ్ల ప్రగతి పండుగను సిద్దిపేట ప్రజలకే సగర్వంగా అంకితం చేస్తున్నాం.

## ముంచుకొస్తున్న కరువు ముప్పు.. తెలంగాణలో పెరుగుతున్న ఆందోళన!

**(హెచ్. ప్రతాప్)**

తెలంగాణలో వర్షాభావ పరిస్థితులు వ్యవసాయ రంగానికి కొత్త సవాళ్లను విసురుతున్నాయి. నైరుతి రుతుపవనాలు ఆశించిన స్థాయిలో వర్షాలు కురిపించకపోవడంతో పలు జిల్లాల్లో పంటల సాగు, సాగునీటి లభ్యత, తాగునీటి సరఫరాపై ఆందోళన నెలకొంది. ప్రాథమిక అంచనాల ప్రకారం రాష్ట్రంలోని 18 జిల్లాల్లో 320 మండలాలు వర్షాభావ ప్రభావాన్ని ఎదుర్కొంటున్నట్లు కొన్ని నివేదికలు పేర్కొంటున్నాయి. అధికారికంగా వెల్లడించిన వివరాల ప్రకారం 235 మండలాల్లో కరవు పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో రైతాంగాన్ని ఆదుకోవడం, అందుబాటులో ఉన్న నీటివనరులను సమర్థంగా వినియోగించడం, రాబోయే నెలల అవసరాలకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయడం అత్యంత ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

2026 నైరుతి రుతుపవన కాలంలో రాష్ట్రానికి సాధారణంగా 740.6 మిల్లీమీటర్ల వర్షపాతం అందాల్సి ఉండగా 615.5 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. అంటే 125.1 మిల్లీమీటర్ల మేర, దాదాపు 17 శాతం వర్షపాతం లోటు ఏర్పడింది. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 18 జిల్లాలు వర్షలోటుతో రుతుపవన కాలాన్ని ముగించాయి. ముఖ్యంగా జోగులాంబ గద్వాల జిల్లాలో 41 శాతం, నారాయణపేట, హనుమకొండ జిల్లాల్లో 35 శాతం చొప్పున, నల్గొండ జిల్లాలో 34 శాతం వర్షపాతం లోటు నమోదైంది. ప్రాంతాలవారీగా వర్షాల పంపిణీలో కనిపిస్తున్న ఈ అసమానత వ్యవసాయ ప్రణాళికలకు సవాలుగా మారింది.

వర్షాలపై ఆధారపడిన వ్యవసాయ ప్రాంతాల్లో నేలలో తేమ తగ్గిపోవడం వల్ల పంటల ఎదుగుదల ప్రభావితమయ్యే అవకాశముంది. ముఖ్యంగా పత్తి, మొక్కజొన్న, వరి, పప్పుధాన్యాల సాగులో నీటి అవసరాలను నిరంతరం అంచనా వేయాల్సి ఉంటుంది. సాగు పెట్టుబడులు పెరుగుతున్న పరిస్థితుల్లో పంట దిగుబడులు తగ్గితే రైతుల ఆదాయంపై ప్రభావం పడవచ్చు. పశుగ్రాసం కొరత ఏర్పడకుండా ముందస్తు నిల్వలు ఏర్పాటు చేయడం కూడా అవసరం.

వర్షాభావ ప్రభావాన్ని సమీక్షించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అక్టోబర్ 12న ప్రత్యేక మంత్రివర్గ సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు, తాగునీటి సరఫరా, పెరుగుతున్న విద్యుత్ అవసరాలు, రైతులకు అందించాల్సిన సహాయక చర్యలపై చర్చించనున్నారు. కరవు నివారణ చర్యల కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.20 వేల కోట్ల ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని రాష్ట్రం కోరింది. రైతు సంఘాలు, వ్యవసాయ నిపుణుల సూచనలను కూడా పరిగణనలోకి తీసుకునే అవకాశముంది.

ప్రస్తుత పరిస్థితుల్లో గ్రామాలవారీగా పంటల స్థితిగతులను అంచనా వేయడం, అందుబాటులో ఉన్న సాగునీటిని ప్రాధాన్య క్రమంలో పంపిణీ చేయడం, తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించడం ప్రయోజనకరంగా ఉంటుంది. వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులకు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక సూచనలు అందించాలి. చెరువులు, కుంటలు, భూగర్భజలాల సంరక్షణతోపాటు సూక్ష్మసేద్య పద్ధతుల వినియోగాన్ని పెంచాలి.

గ్రామీణ ఉపాధి అవకాశాలను బలోపేతం చేయడం, పశువులకు మేత, తాగునీరు అందుబాటులో ఉంచడం, అవసరమైన ప్రాంతాల్లో ముందస్తు సహాయక ఏర్పాట్లు చేయడం ద్వారా వర్షాభావ ప్రభావాన్ని తగ్గించవచ్చు. దీర్ఘకాలికంగా వర్షపునీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ, నీటి పొదుపు సాగు పద్ధతులకు ప్రాధాన్యం ఇవ్వాలి.

వర్షాలను నియంత్రించడం మన చేతుల్లో లేకపోయినా, వర్షాభావ ప్రభావాన్ని తగ్గించుకోవడం సమష్టి కృషితో సాధ్యమే. రైతులకు సకాలంలో సహాయం, నీటివనరుల సమర్థ నిర్వహణ, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు అందుబాటులోకి వస్తే కరవు సవాళ్లను అధిగమించవచ్చు. అన్నదాతకు భరోసా కల్పించడమే వ్యవసాయ రంగానికి, రాష్ట్ర ఆహార భద్రతకు బలమైన పునాది.

## తెలంగాణ సంస్కృతికి సజీవ సాక్ష్యం! బతుకమ్మ- ప్రొఫెసర్ లిల్లీ మేరీ



హైదరాబాద్ అక్టోబర్ 10: ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమికి ముందురోజు వచ్చే అమావాస్య రోజున ఎంగిలి పూల బతుకమ్మ పేరుతో ప్రారంభమై దుర్గాష్టమి రోజున సద్దుల బతుకమ్మతో ముగుస్తుంది అని బాలారిష్టాలు, కలరా, మలేరియా, ప్లేగు వంటి మహమ్మారి రోగాల నుండి పిల్లా పాపలను, కరువు కాటకాల నుండి ప్రజలను కాపాడి బతుకును ఈయమ్మా అని ప్రజలు ప్రకృతి గౌరీని తమ సాధారణ ఆటపాటలతో పూజించే వేడుకే బతుకమ్మ పండుగ అని కుత్బుల్లాపూర్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రొఫెసర్ లిల్లీ మేరి అన్నారు.

తెలంగాణ పల్లెల్లోని ప్రతీ ఒక్క ఆడపడుచు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసే ఈ బతుకమ్మ పండుగ యువతులు, ముత్తైదువులు సాంప్రదాయం ఉట్టిపడేలా తయారయ్యి ఊరంతా ఒకటయ్యి తమలో బీదా గొప్పా వర్ణం వర్గం అంతా ఒకటే అంటూ జరుపుకునే పల్లె ప్రజల సాంస్కృతిక పండుగ ఇది. మంచి వర్షాలతో వరుణ దేవుడు అనుగ్రహించి అన్నపూర్ణమ్మ దయతో వ్యవసాయం అభివృద్ధి చెంది రైతు జీవితం కళకళలాడుతూ ఉండాలని, ఊరంతా పచ్చగా ఉండాలని ఆకాంక్షిస్తూనే యువతులు ముత్తైదువులు రంగు రంగు పువ్వులతో బతుకమ్మను తీర్చిదిద్ది అందులో గౌరమ్మను పెట్టి పూజించి ఊరంతా ఒక్క చోట గుమిగూడి పల్లె ప్రజల జీవితాలను కష్టసుఖాలను పాటలరూపంలో ప్రకృతి గౌరికి విన్నవించుకుంటారు అని ప్రొఫెసర్ లిల్లీ మేరి పేర్కొన్నారు.

## మాలలను తక్షణమే బి గ్రూపులో చేర్చాలి

### సెంటర్ ఫర్ బెటర్ ఇండియా రిసెర్చ్ ఫౌండేషన్ డైరెక్టర్ మామిడి నారాయణ డిమాండ్

హైద్రాబాద్ అక్టోబర్ 10:మాలలను తక్షణమే బి గ్రూపులో చేర్చాలని సెంటర్ ఫర్ బెటర్ ఇండియా రిసెర్చ్ ఫౌండేషన్ డైరెక్టర్ మామిడి నారాయణ డిమాండ్ చేశారు.శనివారం భాషేర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో ప్రొఫెసర్స్ డాక్టర్ ప్రభాకర్,ప్రొఫెసర్ డేవిడ్ తో కలిసి మాట్లాడారు.గడచిన 32 సంవత్సరాలుగా నిత్యం మాలలపై విషం చిమ్ముతూ బతికే మందకృష్ణ పద్మశ్రీ పురస్కారం పొందిన తర్వాత కూడ అబద్దాలు ఆడటం మానడం లేదని విమర్శించారు. వర్గీకరణ విషయంలో ఉమ్మడి రాష్ట్రంలో మాదిగలకు 7% ఉండేది. మాదిగలకు ప్రస్తుతం తెలంగాణలో 9%, ఆంధ్రపదేశ్ లో 6.5% రెండు కలుపగ 15.5% వస్తున్నాయి. కాని రెండు రాష్ట్రాలలోని మొత్తం 14% దటకూడదు. ఉష మెహ్రా కమీషన్ ప్రకారం తెలంగాణలో మాదిగలకన్న మాలలు వెనుకబడి ఉన్నారన్న విషయం తొక్కిపెట్టించి ప్రభుత్వాన్ని బ్లాక్ మెయిల్ చేసి బి గ్రూపులోకి రావలసిన మాలలను కాదని మాదిగలను బి గ్రూపులో చేర్పించుకున్నాడన్నారు



ఎదిగిన కొద్ది పరిపక్వతతో మాట్లాడవలిసినది పోయి కాకి లెక్కలు అబద్దపు ప్రచారాలు కొనసాగించడం అభ్యంతరకరం. ఆయన లెక్క ప్రకారం కడియం కావ్య మాదిగ కానప్పుడు తెలంగాణ రాష్ట్రంలో కేవలం అచ్చంపేట ఎంఎల్ఎ వంశీ కృష్ణ ఎంఎల్ సి గోరేటి వెంకన్న మాత్రమే మాలలని మిగితావారు కులాంతర వివాహాలు చేసుకొని సామాజిక వివక్షను దాటిఉన్నారని తెలుసుకోవాలని వాస్తవాలు గ్రహించి అబద్దాలు ప్రచారం చేయడం మానుకోవాలని వారు సూచించారు..

# న్యాయవ్యవస్థలో బహుజనులకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలి

## సామాజిక న్యాయమే లక్ష్యంగా బీసీ లాయర్స్ అసోసియేషన్ తీర్మానం

సాధించేందుకు స్వల్పకాలిక వ్యూహాలు, దీర్ఘకాలిక లక్ష్యాలతో ముందుకు సాగాలని బీసీ లాయర్స్ అసోసియేషన్ నిర్ణయించింది. బహుజన న్యాయవాదుల్లో చైతన్యం




హైదరాబాద్, అక్టోబర్ 10:న్యాయవ్యవస్థలో బహుజన వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని బీసీ లాయర్స్ అసోసియేషన్ తీర్మానించింది. న్యాయవ్యవస్థలో సామాజిక న్యాయం, సమాన అవకాశాలు బలోపేతం కావాలంటే న్యాయమూర్తుల నియామకాలతో సహా అన్ని కీలక వ్యవస్థల్లో జనాభా నిష్పత్తికి అనుగుణంగా బహుజన న్యాయవాదులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందని సదస్సు అభిప్రాయపడింది.

హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో శనివారం 'ఉన్నత న్యాయవ్యవస్థలో సామాజిక న్యాయం అనే అంశంపై బీసీ లాయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు.

అసోసియేషన్ అధ్యక్షుడు తలకొక్కుల రాజు అధ్యక్షతన, కార్యదర్శి పొన్నం దేవరాజ్ గౌడ్ సమన్వయంతో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని న్యాయవ్యవస్థలో సామాజిక ప్రాతినిధ్యంపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

న్యాయవ్యవస్థలో సమాన అవకాశాలకు ప్రాధాన్యం

సమాజంలోని అన్ని వర్గాలకు న్యాయం అందించే వ్యవస్థలోనే అన్ని సామాజిక వర్గాలకు తగిన భాగస్వామ్యం ఉండాలని వక్తలు పేర్కొన్నారు. న్యాయవ్యవస్థలో బహుజన వర్గాల ప్రాతినిధ్యం పెరగడం ద్వారా సామాజిక న్యాయం, సమానత్వం పట్ల ప్రజల్లో విశ్వాసం మరింత బలపడుతుందని



అభిప్రాయపడ్డారు. అర్హత కలిగిన బహుజన న్యాయవాదులకు ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

కొలీజియం వ్యవస్థపై పునరాలోచన అవసరం

ఉన్నత న్యాయస్థానాల్లో న్యాయమూర్తుల నియామకాలకు సంబంధించి అమలులో ఉన్న కొలీజియం వ్యవస్థపై పునరాలోచన జరగాలని సదస్సు అభిప్రాయపడింది.

. నియామకాల ప్రక్రియలో పారదర్శకత, సమాన అవకాశాలు, సామాజిక ప్రాతినిధ్యానికి ప్రాధాన్యం కల్పించే విధానాలను పరిశీలించాలని కోరింది. న్యాయవ్యవస్థలో అన్ని వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించే దిశగా విధానపరమైన మార్పుల కోసం కృషి చేయాలని నిర్ణయించింది.

బహుజన న్యాయవాదుల చైతన్యానికి కార్యాచరణ

న్యాయవ్యవస్థలో సామాజిక న్యాయం

పెంపొందించడంతో పాటు, వారి సమస్యలు మరియు ప్రాతినిధ్యానికి సంబంధించిన అంశాలపై సంఘటితంగా కృషి చేసేందుకు సమగ్రమైన కార్యాచరణ రూపొందించనున్నట్లు ప్రకటించింది. అవసరమైతే తమ డిమాండ్ల సాధన కోసం కార్యాచరణను మరింత విస్తృతం చేస్తామని స్పష్టం చేసింది.

ప్రముఖుల భాగస్వామ్యం

ఈ సదస్సులో విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య, విశ్రాంత ఐఏఎస్ అధికారి టి. చిరంజీవులు, బార్ కౌన్సిల్ సభ్యులు రఘునాథ్, సునీల్ గౌడ్, ముఖిద్, బీసీ మేధావులు పి. వినయ్ కుమార్, నారగోని, బొమ్మగాని ప్రభాకర్, చిక్కుడు ప్రభాకర్, మాస్టర్ జి. రంగయ్య, నల్లమాస కృష్ణ, చామకూర రాజు, కోల జనార్ధన్, మంజుల దేవి తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధుని చికిత్సకు వెస్సో సాయం




హైద్రాబాద్ అక్టోబర్ 10;మచిలీపట్నం గొడుగుపేట కాశానిగూడెం కు చెందిన విశ్వనాథ చారి (61) స్వర్ణకారుడు, స్టేట్ బ్యాంక్ లో అప్రైజర్‌గా పని చేస్తూ తమ కుటుంబాన్ని పోషించే వారు.ఇటీవల తీవ్ర మెదడు పక్షవాతానికి గురై, విజయవాడ లోని విజయ ఆసుపత్రిలో అత్యవసర చికిత్స పొందుతున్నారు. ఇప్పటివరకు మెదడుకు రెండు, గొంతుకు ఒకటి చొప్పున మొత్తం మూడు శస్త్రచికిత్సలు జరిగాయి. అయినప్పటికీ, ప్రస్తుతం ఆయన అపస్మారక స్థితిలోనే ఉన్నారు. ఇప్పటి వరకు సుమారు ?7 లక్షలు ఖర్చు కాగా, ?3 లక్షలు బీమా ద్వారా లభించాయి. మిగిలిన ?4 లక్షలను బంధువులు సమకూర్చారు. వైద్యుల సూచన మేరకు తదుపరి ఫిజియోథెరపీ, పునరావాస చికిత్స కోసం మరో మూడు, నాలుగు లక్షల వరకు అవసరం అవుతాయని అంచనా. ఇప్పటికే ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న కుటుంబానికి ఈ ఖర్చులు భరించడం భారంగా మారింది. ఆర్థిక సహాయం కొరకు వారి కుటుంబ సభ్యులు వెస్సో ట్రస్టును కోరగా, వెస్సో ట్రస్టీలు గౌరవ దాతల సహకారంతో విశ్వనాథంకు 51,200/- రూపాయలు అందజేశారు.

## స్థానిక సంస్థల్లో బీసీలకు కేటాయించిన స్థానాల వివరాలు ఇవే !

విజయవాడ స్థానిక సంస్థల్లో బీసీలక కేటాయించిన స్థానాలకు సంబంధించిన గణాంకాలు ఇలా ఉన్నాయి. కార్పొరేషన్ మేయర్లకు సంబంధించి మొత్తం 17 స్థానాల్లో 6 స్థానాలను బీసీలకు కేటాయించారు. ఇది 35.29 శాతంగా ఉంది. అలాగే 106 మున్సిపల్ చైర్మన్ స్థానాల్లో 35 స్థానాలు, 3,884 మున్సిపల్ వార్డుల్లో 1,273 వార్డులను బీసీలకు కేటాయించారు.జిల్లా పరిషత్ చైర్మన్లకు సంబంధించి మొత్తం 28 స్థానాల్లో 7 స్థానాలు బీసీలకు కేటాయించగా, 661 జెడ్పీటీసీ స్థానాల్లో 152 స్థానాలు, 661 ఎంపీపీ స్థానాల్లో 152 స్థానాలు బీసీలకు దక్కాయి. అదేవిధంగా 9,913 ఎంపీటీసీ స్థానాల్లో 2,400 స్థానాలను బీసీలకు కేటాయించారు.గ్రామీణ స్థానిక సంస్థల్లో భాగంగా మొత్తం 13,351 సర్పంచ్ స్థానాల్లో 3,128 స్థానాలు, 1,33,910 పంచాయతీ వార్డు సభ్యుల స్థానాల్లో 30,315 స్థానాలను బీసీలకు కేటాయించినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.స్థానిక సంస్థల్లో బీసీలకు కేటాయించిన ఈ స్థానాలు రాజకీయ ప్రాతినిధ్యం పరంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అయితే, ఈ గణాంకాలు అధికారికంగా ప్రకటించిన రిజర్వేషన్ వివరాలతో సరిపోలుతున్నాయో లేదో సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా నిర్ధారించుకోవాలి.

# తెలంగాణ సంస్కృతికి ప్రతీక.. ఎంగిలిపూల బతుకమ్మ

## మహిళల ఆటపాటలతో ప్రారంభమైన పూల పండుగ..

## 7 రోజుల పాటు బతుకమ్మ సంబరాలు

**వేములవాడ, అక్టోబర్ 10: (ప్రజాబలం ప్రతినిధి)**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేములవాడ పట్టణంలో ఉత్సాహంగా ప్రారంభమైంది. బతుకమ్మ సంబరాల్లో తొలి రోజైన ఎంగిలిపూల బతుకమ్మను మహిళలు శనివారం ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ప్రకృతిని పూలతో ఆరాధించే ఈ పండుగలో భాగంగా మహిళలు వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో వేడుకల్లో పాల్గొన్నారు.తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐకమత్యానికి, ప్రకృతి ప్రేమకు ప్రతీకగా బతుకమ్మ పండుగ నిలుస్తుంది. తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి, వాటి చుట్టూ చేరి





సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ మహిళలు సందడి చేశారు. ఆటపాటలతో పండుగ వాతావరణాన్ని నింపారు.ఏడు రోజుల పాటు బతుకమ్మ సంబరాలువేములవాడ పట్టణంలో ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమయ్యే బతుకమ్మ సంబరాలు ఏడు రోజుల పాటు కొనసాగుతాయి. ప్రతిరోజూ ప్రత్యేకమైన పేరుతో, సంప్రదాయ పద్ధతుల్లో బతుకమ్మను పూజిస్తూ మహిళలు వేడుకలను నిర్వహిస్తారు. చివరి రోజైన సద్దుల బతుకమ్మతో ఈ సంబరాలు మరింత వైభవంగా ముగుస్తాయి.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తోంది. మహిళలంతా ఒకచోట చేరి ఆనందంగా జరుపుకునే ఈ పూల పండుగ వేములవాడ పట్టణంలో ఆధ్యాత్మికతను, సాంస్కృతిక వైభవాన్ని చాటిచెబుతోంది.

# ఆకాశమే హద్దుగా ఆడపడుచుల బతుకమ్మ సంబరాలు,



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 10 ఏటూరు నాగారం** బతుకమ్మ తొలి రోజు కావడంతో ఆడపడుచులు ప్రతి చెటుకు పూసిన పువ్వులతో అందంగా తయారు చేసి బతుకమ్మ తల్లికి పసుపు కుంకుమ పెట్టి తల్లిని పాటలతో ఆటలతో మైమరిపిస్తూ బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా ఏటూరు నాగారం మండల కేంద్రంలో నిర్వహించారు ఈ బతుకమ్మ సంబరాలకు భారీ ఎత్తున మహిళలు తరలివచ్చి బతుకమ్మ పాటలతో పాటలతో ప్రజానీకాన్ని మైమరిపించారు

చిన్నపిల్లల నుంచి పెద్దవారి దాకా బతుకమ్మ పాటలతో ఆటలతో మహిళా లోకం ఉవ్వెత్తున ఎగిసింది ఈ కార్యక్రమానికి పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తూ ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు బందోబస్తు ఏర్పాటు చేశారు

## కుప్పంలో అక్టోబరు 20న వైభవంగా శ్రీ మహాలక్ష్మీ దీపపూజ

## భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు చేపట్టాలి : టీటీడీ జేఈవో డా. ఎ. శరత్

కుప్పం విలజాపురం రోడ్డు, కుప్పం చెరువు కట్ట సమీపంలోని శ్రీ మహాలక్ష్మీ దీపోత్సవ ప్రాంగణంలో అక్టోబరు 20వ తేదీ సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్న శ్రీ మహాలక్ష్మీ దీపపూజకు అన్ని ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని టీటీడీ జేఈవో డా.ఎ.శరత్ అధికారులను ఆదేశించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.శనివారం తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో తన ఛాంబర్ నుంచి నిర్వహించిన జూమ్ సమావేశంలో ఆయన కుప్పంలో జరుగుతున్న ఏర్పాట్లను సంబంధిత అధికారులతో సమీక్షించారు.

భక్తులకు పటిష్ట సౌకర్యాలు

ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ, శ్రీ మహాలక్ష్మీ దీపపూజలో పాల్గొనే భక్తుల కోసం తగిన సంఖ్యలో షెడ్లు, మ్యాట్లు, దీపారాధన సామగ్రి, ఎల్ఈడీ స్క్రీన్లు, తాగునీరు, పారిశుధ్య సదుపాయాలు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.కుప్పం, గుడుపల్లె, రామకుప్పం, శాంతిపురం, వి.కోట తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో విచ్చేసే భక్తుల కోసం తాగునీరు, మజ్జిగ, అన్నప్రసాద పంపిణీ కేంద్రాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతమైన ఆధ్యాత్మిక వాతావరణంలో దీపపూజలో పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

## హైదరాబాద్లో లఘు ఉద్యోగ్ భారతీ సదస్సు

## సౌత్ ఇండియా కాంక్లేవ్కు ముఖ్యఅతిథిగా కిషన్రెడ్డి

హైదరాబాద్ హైదరాబాద్ లో జరిగిన లఘు ఉద్యోగ్ సదస్సుకు ముఖ్యఅతిథిగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి హాజరయ్యారు. కిషన్ రెడ్డి మాట్లాడుతూ వికసిత్ భారత్ లక్ష్య సాధనలో ఓూఓఇలదే కీలకపాత్ర. ఉద్యోగ కల్పనలో ఓూఓఇలది కీలక పాత్ర అని అన్నారు.ఓూఓఇలకు కేంద్ర పథకాలతో రుణ సదుపాయాలు, మార్కెట్ అవకాశాలు పెంచుతున్నాం. బ్యాంకులు, ఓూఓఇల మధ్య బంధం పెరగాలి. విశాఖ, మహారాష్ట్రలో మినరల్ పార్కు ఏర్పాటు చేస్తున్నాం. భారత ఆర్థిక వ్యవస్థపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. దేశ భవిష్యత్తును యువత కాపాడుకోవాలని అన్నారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఏటూరునాగారం వాసి పాల్వాయి రమేష్‌ను పరామర్శించిన కాకులమర్రి ప్రదీప్ రావు

### అతివేగం వల్ల జరిగిన యాక్సిడెంట్ అత్యంత బాధాకరం
### ఇసుక లారీల మూలంగా జరుగుతున్న ప్రమాదాలను అరికట్టాలని విజ్ఞప్తి

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 10 ములుగు** పస్రా–తాడ్వాయి మధ్య జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి గార్డెన్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న



ఏటూరునాగారానికి చెందిన పాల్వాయి రమేష్‌ను ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఆదేశాల మేరకు వారి సోదరుడు కాకులమర్రి ప్రదీప్ రావు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు.

ఈ సందర్భంగా కాకులమర్రి ప్రదీప్ రావు హాస్పిటల్ వైద్యులతో మాట్లాడి, రమేష్ గారికి అందిస్తున్న వైద్య చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితుడికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను కోరారు. బాధితుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్తూ, పార్టీ తరపున ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలపడం జరిగింది.బి

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మితిమీరిన వేగం మూలంగా ఇలాంటి ప్రమాదం జరగడం అత్యంత బాధాకరమని అన్నారు. ఇసుక లారీల వేగం, అజాగ్రత్త వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రజల భద్రత దృష్ట్యా ఇటువంటి లారీలను, వాటి అతివేగాన్ని అరికట్టాల్సిన అవసరం పోలీస్ శాఖకు ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు

ఈ కార్యక్రమంలో ఎండి ఖాజా పాషా గారు బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# కామేశ్వరాలయా పున ప్రారంభానికి సన్నాహాలు

## భారత పురావస్తు శాఖ

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 10** పాలంపేట యుగస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం ను ఈ రోజుహైదరాబాద్ సర్కిల్‌కు చెందిన ఏ ఎస్ ఐ (భారత పురావస్తు శాఖ) సాంకేతిక బృందం, ఎంటీఎల్ఎస్ ఇంజనీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (హైదరాబాద్) మరియు ఎన్ఐటీ వరంగల్‌కు చెందిన ప్రముఖ రిటైర్డ్ జియోటెక్నికల్ నిపుణుల భాగస్వామ్యంతో జియోటెక్నికల్ పరిశోధనలు నిర్వహించింది. పాలంపేటలోని రామప్ప దేవాలయంలో ఉన్న కామేశ్వరాలయానికి సంబంధించి, తొలగించిన నిర్మాణ భాగాలను తిరిగి అమర్చడం కోసం, మెరుగుపరిచిన/స్థిరీకరించిన భూగర్భ పరిస్థితులను అంచనా వేయడానికి ఇటీవల



పూర్తయిన పునాది ప్రాంతంలో ఈ పరిశోధనలు జరిగాయి. ఇందులో భాగంగా ఐఎస్ కోడ్ ప్రమాణాలు 1888 మరియు 2720 ప్రకారం ప్లేట్ లోడ్ పరీక్షలు (నిర్వహించడంతో పాటు నిర్దేశిత కోన్ల నుండి చెదరని మట్టి నమూనాలను సేకరించారు.

రూ. 2.89 కోట్ల వ్యయంతో ఏ ఎస్ ఐ ఇటీవల ఈ పునాది పనులను పూర్తి చేసింది. కామేశ్వరాలయం యొక్క పైనిర్మాణాన్ని తిరిగి నిర్మించడానికి రూ. 6.89 కోట్ల విలువైన టెండర్ల ఆమోద ప్రక్రియ ప్రస్తుతం పరిశీలనలో ఉంది.

# డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించిన పేరూరు ఎస్సై కృష్ణ ప్రసాద్



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 10**వాజేడు మండలంలోని పేరూరు రహదారిపై వాహనాశ్రీఖ తనిఖీలు ముమ్మరంగా ఏర్పాటు చేశారు ద్విచక్ర వాహనదారులు నుంచి మొదలుకొని ఫోర్ వీలర్ దాకా వాహనాల తనిఖీలు ఏర్పాటు చేశారు ముఖ్యంగా మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తున్న డ్రైవర్లను డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేసి వారిపై కేసు నమోదు చేస్తున్నామని వారు అన్నారు జిల్లా ఎస్పీ రామ్నాథ్ కేకన్ ఆదేశాల మేరకు పేరూరు ఎస్సై కృష్ణ ప్రసాద్ తన సిబ్బందితో నిమ్మరంగా తనిఖీలు ఏర్పాటు చేశారు అనుమనితులను అదుపులో తీసుకొని విచారించి వదిలేస్తున్నారు దసరా సందర్భంగా గుడుంబా రవాణాపై నిఘా ఏర్పాటు చేసి చత్తీస్గడ్ నుంచి వచ్చే వాహనాలను ఆపి తనిఖీలు చేస్తున్నారు

# చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ని తొలగించాలి.

### ...ఎస్ఐఆర్ ను రద్దు చేయాలి.
### ....సామాన్యుని ఓటు హక్కును కాపాడాలి.
### యు ఎస్ పి సి మహబూబ్ నగర్ జిల్లా కమిటీ డిమాండ్.

మహబూబ్నగర్, శనివారం: చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కోరుతూ శనివారం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యు ఎస్ పి సి)ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో నిరసన ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఈ ప్రదర్శనను ఉద్దేశించి ఉపాధ్యాయ సంఘాల స్టీరింగ్ కమిటీ నాయకులు ఎన్ కిష్టయ్య, వెంకటస్వామి, వేణుగోపాల్ (టి ఎస్ యు టి ఎఫ్), శ్రీశైలం, ఓంకార్ , రాములు(డి టి ఎఫ్), నారాయణమ్మ(టి పి టి ఎఫ్)లు మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగబద్ధ స్వతంత్ర భారత ఎన్నికల వ్యవస్థను రక్షించుకోవాలని, కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కోరుతూ దేశవ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమానికి మద్దతు ప్రకటిస్తూ ఆందోళన చేపట్టారు. జ్ఞానేష్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలను సమీక్షించాలని డిమాండ్ చేశారు.ఎన్నికల కమీషన్ స్వతంత్రను కాపాడాలని, సర్




ప్రక్రియను రద్దు చేయాలని,
ఇప్పటి వరకు తొలగించిన 13 కోట్ల ఓట్లపై సమగ్ర, స్వతంత్ర విచారణ చేపట్టాలి అని,
ఎన్నికల కమీషనర్ల నియామక చట్టం– 2023 ను రద్దు చేయాలని ,2024, ఆ తర్వాత జరిగిన అన్ని ఎన్నికలపై
విచారణ చేపట్టాలని
ఓటింగ్ మిషన్ లకు బదులు బాలెట్ పేపర్లతో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన ప్రదర్శనలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఎన్ కిష్టయ్య, ఎం వేణుగోపాల్, వెంకటస్వామి, ఖాదరయ్య, అజయ్, శివరాజు, ఎం కె కవిత, అయూబ్, కిస్టియా నాయక్, కథలయ్య, చిన్నయ్య, నాగమద్దిలేటి, శంకర్ నాయక్, ఎల్లప్ప, రాములు, కోటేశ్వర ఆచారి (టి ఎస్ యు టి ఎఫ్); ఓంకార్, రాములు, శ్రీశైలం, వామన్ కుమార్, వెంకటేశ్వర్లు, రఫీ, సృజన, సంధ్యారాణి, స్పందన (డి టి ఎఫ్), నారాయణమ్మ(టి పి టి ఎఫ్ ) తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీవో అండదండలతో రోడ్లపైనే నిలిచిన ఇసుక ఇసుక లారీలు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 10 మంగపేట వాజేడు** ములుగు జిల్లా మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఇసుక ర్యాంపుల వలన ప్రతిరోజు ప్రయాణికులకు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అలాగే యాక్సిడెంట్లు జరుగుతున్న పట్టింపులేని ములుగు జిల్లాలో కార్యాలయం ఉన్న పట్టింపు లేకుండా ఉండడంతోఇసుక లారీ డ్రైవర్లు ఇసుక ర్యాంప్ నిర్వాహకులు ఇష్టానుసారంగా జాతీయ రహదారులపై రాత్రి పగలు తేడా లేకుండా జాతీయ రహదారులపై ఐదు కిలోమీటర్ల మేర రోడ్డుపై ఇసుక లారీలు నిలిచి ఉండడంతో చాలా సందర్భాలలో యాక్సిడెంట్లు జరిగిన మృత్యువాత పడిన సందర్భాలు చాలా ఉన్నాయి మొన్న జరిగిన పసర తాడువాయి మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు జవాన్లతో పాటు మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి పలుమార్లు ఆర్టీవో అధికారులకు తెలియజేసిన పట్టింపు లేకపోవడంతో ఇష్టానుసారంగా లారీ డ్రైవర్లు మద్యం మత్తులో వాహనాలను నడుపుతూ అమాయక ప్రజల ప్రాణాలు తీస్తున్నారు ఇన్ని జరుగుతున్న ఆర్టీవో ఆఫీసర్ పట్టించకపోవడం పై ప్రజలు తీవ్ర కోపానికి లోనవుతున్నారు ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ పోలీస్ అధికారులు రోడ్ల పై ఇసుక లారీలు నిల్పకుండా చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నారు

# ఆర్టీసీ ఎన్నికల్లో తెలంగాణ వర్కర్స్ యూనియన్ ( టి డబ్ల్యూ యు) ఘనవిజయం

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 10 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:**నర్సాపూర్: ఆర్టీసీ గుర్తింపు సంఘంఎన్నికల్లో తెలంగాణ వర్కర్స్ యూనియన్ (టి డబ్ల్యూ యు ) ఘనవిజయం సాధించింది, నర్సాపూర్, బస్ డిపో ఎన్నికల్లో డిపో కార్యదర్శి పదవికి జరిగిన ఎన్నికల్లో మొత్తం 108 ఓట్లకు గాను (టీ డబ్ల్యూ యు ) యూనియన్‌కు 100, ఓట్లు లభించడంతో భారీ మెజారిటీతో విజయం సాధించింది.అదేవిధంగా రాష్ట్రస్థాయి ఎన్నికల్లోనూ మొత్తం 108 ఓట్లకు గాను 105 ఓట్లు (టి డబ్ల్యూ యు)యూనియన్‌కు



లభించినట్లు పోలింగ్ అధికారులు ప్రకటించారు, ఈ విజయంతో యూనియన్ నాయకులు, కార్యకర్తలు, ఆర్టీసీ కార్మికుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.ఈసందర్భంగా నర్సాపూర్ డిపో, (టీ డబ్ల్యూ యు )యూనియన్ గౌరవ అధ్యక్షులు ఆవుల రాజిరెడ్డి, యూనియన్ ప్రతినిధులను, డిపో కార్యదర్శిగ ఎన్నికైన వెంకట్ గౌడ్,ను ఘనంగా సన్మానించి,అభినందనలు తెలిపారు.ఆర్టీసీ కార్మికుల హక్కుల పరిరక్షణ, వారి సమస్యల పరిష్కారం కోసం యూనియన్ నాయకులు నిరంతరం కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు ఈ విజయం కార్మికుల నమ్మకానికి, ఐక్యతకు నిదర్శనమ నియూనియన్ ప్రతినిధులు పేర్కొన్నారు.



# డయాగ్నొస్టిక్ సెంటర్‌పై దాడి.. నిందితుడి అరెస్ట్



**జహీరాబాద్, అక్టోబరు 10 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్ పట్టణంలోని మెడ్ఎక్స్ డయాగ్నొస్టిక్ సెంటర్ సిబ్బందిపై దాడి చేసి, డబ్బులు ఇవ్వాలని బెదిరించిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. ఈ వివరాలను పట్టణ ఎస్సై లవకుమార్ శనివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. జహీరాబాద్ మండలం హుగ్గెల్లి గ్రామానికి చెందిన మేతరి సురేష్ (33) అక్టోబరు 9న డయాగ్నొస్టిక్ సెంటర్‌కు వచ్చి తప్పుడు నివేదికలు ఇచ్చారని ఆరోపిస్తూ సిబ్బందితో వాగ్వాదానికి దిగాడు. డబ్బులు ఇవ్వకపోతే సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తానని, కేంద్రాన్ని తగలబెడతానని బెదిరించినట్లు పోలీసులు తెలిపారు. ఇనుప రాడ్డుతో దాడి చేయడంతో మేనేజర్ మహమ్మద్ మిన్హాజ్, అతని స్నేహితుడు సలీంకు గాయాలయ్యాయి. ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ యంత్రాలతోపాటు ఇతర పరికరాలు, ఫర్నిచర్‌ను ధ్వంసం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు శనివారం నిందితుడిని అరెస్ట్ చేసి జైలుకు పంపినట్లు ఎస్సై తెలిపారు.

# దసరాకి ఊరెళ్తున్నారా.. ఈ పనులు చేసి వెళ్లడం తప్పనిసరి: బాలానగర్ ఏసీపీ



**కూకట్పల్లి (ప్రజాబలం) అక్టోబర్ 10:** దసరా పండుగ కోసమని చాలా మంది ప్రజలు నగరాలు, పట్టణాలు విడిచి స్వగ్రామాలకు వెళ్తుంటారు. ఇదే అదునుగా దొంగలు రెచ్చిపోతున్నారు. ఇటీవలి కాలంలో తాళం వేసిన ఇండ్లే టార్గెట్ చేసి నగరంలో పలుచోట్ల చోరీలకు పాల్పడుతున్నారు. విలువైన వస్తువులు, నగదు దోచుకెళ్తున్నారు. ఈ నేపథ్యంలో పండగకు సొంతూర్లకు వెళ్లే ప్రజలకు బాలానగర్ ఏసీపీ పింగిలి నరేష్ రెడ్డి కొన్ని సూచనలు, జాగ్రత్తలు జారీ చేశారు. దొంగల బారిన పడకుండా వీటిని తప్పని సరిగా పాటించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు ఏసీపీ నరేష్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ఊరికి వెళ్లినపుడు తప్పనిసరిగా సమీప పోలీస్ స్టేషన్లలో సమాచారం అందించాలని, దీని వల్ల పెట్రోలింగ్ పోలీసులు సంబంధిత నివాస గృహాలపై ప్రత్యేక నిఘా పెడుతారని స్పష్టం చేశారు. అలాగే ఇరుగు పొరుగుకు కూడా సమాచారం ఇవ్వాలని, మీ ఇంటికి సంబంధించి ఏదైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే మీకు తెలియజేయాలని విజ్ఞప్తి చేయాలని సూచించారు. ఊరికి వెళ్లేటప్పుడు ఎక్కువ బంగారం, డబ్బు ఇంట్లో ఉంచకుండా బ్యాంక్ లాకర్లలో పెట్టుకోవాలని, బీరువాలో విలువైన వస్తువులుంటే వాటి తాళాలు ఇంట్లో పెట్టకుండా వెంట తీసుకెళ్లాలని చెప్పారు. మీరు ఊరు వెళ్తున్నట్లు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టవద్దని, నేరగాళ్లు తెలుసుకుని, మీ ఇల్లు ఖాళీ చేసే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. ఇంట్లో లైట్లు వేసి ఉంచాలని, తాళం బయటికి కనిపించకుండా డోర్ కర్టెన్ వేయాలని, ఇంట్లో, వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు, అందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనుమానితులపై నిఘా ఉంచాలని, అలాంటి వారి గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సైబర్ నేరాలపైనా అలర్ట్‌గా ఉండాలని, పండగ పేరిట వచ్చే ఆన్‌లైన ఆఫర్ల లింకులతో మోసపోవద్దని, బ్లూ కలర్ లింకులు అస్సలు ఓపెన్ చేయవద్దని, లాటరీ తగిలిందని, తక్కువ ధరకు గిఫ్ట్ వచ్చిందని వచ్చే మెస్సేజ్‌ను నమ్మవద్దని హెచ్చరించారు. సైబర్ నేరానికి గురై డబ్బులు పోగొట్టుకున్నట్టయితే వెంటనే 1930కి ఫిర్యాదు చేస్తే డబ్బులు రికవరీ అయ్యే అవకాశం ఉందని చెప్పారు. అత్యవసర సహాయం కోసం జాతీయ హెల్ప్‌లైన్ 112, 100కు కాల్ చేయాలని, పోలీసులకు ప్రజలు సహకరించాలని, పండుగను ఆనందోత్సాహంతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఏసీపీ నరేష్ రెడ్డి సూచించారు.

# మణికొండ AVOPA మహిళా విభాగం ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

### మహిళల సృజనాత్మకతకు ప్రోత్సాహం -- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణే లక్ష్యం




మణికొండ: దసరా పండుగను పురస్కరించుకొని AVOPA (ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) మణికొండ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ, సోమవారం సాయంత్రం 5 గంటలకు అల్కాపురి టౌన్‌షిప్‌లోని రోడ్ నంబర్ 4లో గల స్వామి వివేకానంద పార్క్‌లో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి లిశ్రీమతి పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి గారిని, దీ=వా పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి శ్రీ కార్తీక్ రెడ్డి గారిని, లిలిశ్రీ సీతారాం ధూళిపాళ గారిని, AVOPA రాష్ట్ర అధ్యక్షులు లిలిశ్రీ మాలిపెద్ది శంకర్ గారినిలి నిర్వాహకులు ఆహ్వానించారు.

ఈ సందర్భంగా సామూహిక బతుకమ్మ వేడుకలతో పాటు మహిళల కోసం ప్రత్యేకంగా బతుకమ్మల పోటీలను నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన మహిళలకు మొదటి, రెండో, మూడో బహుమతులతో పాటు పలు ప్రత్యేక బహుమతులను అందజేయనున్నారు. మొత్తం సుమారు లిరూ.30,000 విలువైన బహుమతులనులి అందించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

మహిళల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడం, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించి భావితరాలకు అందించడం, ప్రకృతి ప్రాధాన్యతను తెలియజేయడం ఈ వేడుకల ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలుస్తుందని వారు తెలిపారు.

మణికొండ, పుప్పాలగూడ, నెక్నాంపూర్, అల్కాపురి టౌన్‌షిప్ పరిసర ప్రాంతాల మహిళలందరూ ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని, బతుకమ్మల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమానికి సంబంధించి ~~మణికొండ మహిళా విభాగం అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులుగా వ్యవహరిస్తున్న స్నేహ, మహాలక్ష్మి, దేవి ప్రియలి వివరాలను వెల్లడించారు.

# అత్యంత కిరాతకంగా హత్య



**జహీరాబాద్ అక్టోబర్ 10 ప్రజాబలం ప్రతినిధి:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం తూముకుంట శివారు అటవీ ప్రాంతంలో ఓ వ్యక్తిని గుర్తు తెలియని దుండగులు అత్యంత కిరాతకంగా హత్య చేశారు. హత్య అనంతరం ఆధారాలు మాయం చేసేందుకు మృతదేహంతో పాటు అతడి ఆటోను కూడా దహనం చేశారు. మృతుడు మొగుడంపల్లి మండలం మన్నాపూర్‌కు చెందిన ఆటో డ్రైవర్ శ్రీనివాస్‌గా పోలీసులు గుర్తించారు. శ్రీనివాస్ ఈనెల 7వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో దీంతో చిరాగ్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో అదృశ్యం కేసు కూడా నమోదైంది. గాలింపు చర్యలు కొనసాగుతుండగానే.. తూముకుంట అడవిలో అతడు శవమై కనిపించడం స్థానికంగా కలకలం రేపింది. హత్య జరిగి దాదాపు నాలుగు రోజులు కావడంతో మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిన దశకు చేరుకుంది. సమాచారం అందుకున్న వెంటనే జహీరాబాద్ సీఐ రవి, రూరల్ ఎస్ఐ రాజేందర్ రెడ్డి, చిరాగ్‌పల్లి ఎస్ఐ వినయ్ కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించి కీలక ఆధారాలు సేకరించారు. మృతదేహం పరిస్థితి దృష్ట్యా వైద్యులు ఘటనా స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించారు. ప్రస్తుతం జహీరాబాద్ గ్రామీణ పోలీసులు ఈ కేసును ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు.

# యూరోప్ స్టడీ టూర్ ముగించుకుని స్వదేశానికి చేరుకున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను ఘనంగా శాలువాతో సన్మానించిన డాక్టర్ కొండల్ రెడ్డి



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 10 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** యూరోప్ స్టడీ టూర్ పూర్తిచేసుకుని క్షేమంగా స్వదేశానికి తిరిగి వచ్చిన వికారాబాద్ శాసనసభ్యులు తెలంగాణ శాసనసభాపతి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ని ఘనంగా శాలువాతో సన్మానించిన ఎస్ కే ఆర్ ట్రస్టు వ్యవస్థాపకులు మాజీ గ్రంథాలయ సమస్త చైర్మన్ డాక్టర్ కొండల్ రెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించారు, తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అంటే నాయకులకు ఎంతో ప్రేమ ఆప్యాయత అనురాగం మంచితనం మంచి అభిప్రాయం నాయకుల ప్రజల గుండెల్లో ప్రేమ సుపరిచితులు అని చెబుతూ ఉంటారు అలాగే నాయకులన్నప్రజలన్న ప్రజాసేవ అయినా చాలా ప్రేమగా ఆస్వాదించి ప్రజలను ఆప్యాయంగా పలకరించి హక్కును చేర్చుకునే మంచి శాసనసభ్యులు మా వికారాబాద్ శాసనసభ్యులు తెలంగాణ శాసనసభ ప్రతి గడ్డం ప్రసాద్ కుమార్ అని ఎస్ కే ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ సన్న గారి కొండల్ రెడ్డి తెలిపారు

# యువతి యువకులకు లకు ఉచిత నైపుణ్య శిక్షణ 100% ఉచితంగా ఉపాధి శిక్షణ పొందే అవకాశం




**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 10 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** సంగారెడ్డి జిల్లాలోని నిరుద్యోగ యువతి యువకులకు శుభవార్త తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ( నేషనల్ అకాడమీ ఆఫ్ డెవలప్మెంట్ ) ఆధ్వర్యంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో, ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు, అందుబాటులో ఉన్నాయి శిక్షణ కోర్సులు, "అసిస్టెంట్ ఎలక్ట్రిషన్ " ప్లంబర్ జనరల్", మొబైల్ ఫోన్ హార్డ్వేర్ రిపేర్ టెక్నీషియన్" విద్యార్థులు, అసిస్టెంట్ ఎలక్ట్రిషన్- 10వ తరగతి, ప్లంబర్ జనరల్ -10వ తరగతి, మొబైల్ ఫోన్ హార్డ్వేర్ రిపేర్ టెక్నీషియన్ - 10వ తరగతి,( బిపిఎల్) కుటుంబాలకు చెందిన యువతకు ప్రాధాన్యత, "ప్రధాన ప్రయోజనాలు"ఉచిత నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు, మార్గదర్శకత్వం, ప్రాక్టికల్ శిక్షణ, కెరీర్ అభివృద్ధికి సహకారం,మరిన్నివివరాలకోసం సంప్రదించవలసిన నెంబరు, 9959206337.7337421351,9640427913, యువతి, యువకులు, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, నైపుణ్యాలను పెంపొందించుకొని, ఉపాధి అవకాశాలు పొందాలని కోరుతున్నాం, అని వైద్య ఆరోగ్యశాఖ క్యాంపు కార్యాలయం సంగారెడ్డి వారు తెలియజేశారు.....

# పుట్టినరోజు సందర్భంగా సందీప్ ను శాలువాతో సన్మానించిన అంకిత సంస్థ డిస్టిక్ కోఆర్డినేటర్ ఎం సురేష్



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి అక్టోబర్ 10 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** వికారాబాద్ జిల్లా అంకిత సంస్థ జిల్లా కోఆర్డినేటర్ పుట్టినరోజు సందర్భంగా సందీప్ ను శాలువాతో ఘనంగా సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు సందీప్ కుటుంబం ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో నిండు నూరేళ్లు హ్యాపీగా ఉండాలని వికారాబాద్ జిల్లా అంకిత సంస్థ కోఆర్డినేటర్ ఎం సురేష్ తెలిపారు

# ఎస్సీ వర్గీకరణలో రోస్టర్ ను సవరించాలి





**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 10 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :**ఎస్సీ వర్గీకరణలో రోస్టర్ విధానాన్ని సవరించాలని(టీఎంఈఏ) అధ్యక్షులు బి,రాజు, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, నారాయణఖేడ్, పట్టణంలో కార్తికేయ హోటల్ లో శనివారం(ఎం సి ఎఫ్) సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షతన ఎం, లక్ష్మణ్, వహించారు. ఈ సందర్భంగా బి,రాజు, మాట్లాడుతూ,మాల కోఆర్డినేషన్ ఫోరం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించాలని, మాలలకు జరుగుతున్న అన్యాయంపై గ్రామ గ్రామాన వివరిస్తామని తెలిపారు, ప్రభుత్వం ఏర్పాటులో కీలకపాత్రలో మాలలు ఉన్నారని, కానీ మాలలకే అన్యాయం చేయడందు ర్మార్గమన్నారు,వెంటనే ఎస్సీ వర్గీకరణలో రోస్టర్, ను సవరించాలని డిమాండ్ చేశారు ఈకార్యక్రమంలో (ఎంసీఎఫ్) డివిజన్ ప్రధాన కార్యదర్శి డి, నరసింహులు, జ్యోతి, లింగం, మారుతి, రాజకుమార్, నర్సింలు, బి, నర్సింలు, లక్ష్మయ్య, భానుశంకర్, మారుతి, శంకర్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు





# నిద్ర వ్యవస్థలో ఎక్సైజ్ శాఖ
# పచ్చని పల్లెలో బెల్ట్ జోరు

**గ్రామాలలో బార్లను తలపిస్తున్న బెల్టుషాపులు**

**ఆదాయమే లక్ష్యంగా ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం...**

**గుల్ల అవుతున్న మద్యం ప్రియులు జేబులు**



**చంద్రుగొండ అక్టోబర్ 10 ప్రజాబలం ప్రతినిధి :-** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట నియోజకవర్గం చంద్రుగొండ మండల కేంద్రం తో పాటు పరిసర ప్రాంతం మరియు గ్రామాల్లో గల్లీకో బెల్ట్ షాపు ఏర్పాటు చేసి మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. అయినా కూడా సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు మాకు ఏమీ సంబంధం లేనట్టుగా, చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. బెల్ట్ షాపుల నిర్వహణ వల్ల రిటైల్ మద్యం షాపుల వ్యాపారాలకు అడ్డగోలుగా లాభాలు పొందుతూ, మద్యం ప్రియుల బతుకులను రోడ్డుకి ఈడుస్తున్నారు పల్లెల్లో బెల్టుషాపులు దందా జోరుగా సాగుతోంది

. పల్లెలు, మారుమూల గ్రామాల్లో రాత్రింబవళ్లు మత్తులో జోగుతున్న యి. గ్రామాలు, తండాలలో పుట్టగొడుగుల్లా బెల్టుషాపులు వెలుస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా బెల్టు షాపులు ఏర్పాటు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అనేకమంది బెల్టు షాపుల్లో మద్యం కొనుగోలు చేసి జేబులు గుల్ల చేసుకుంటున్నారు. అప్పులు చేసి తాగడంతో కాపురాలు వీధి పాలు అవుతున్నాయి మండల లో ప్రధాన కేంద్రం గా అధికార వైన్ షాప్ కు నిత్యం వచ్చే మద్యం ప్రియులకు ఎమ్మార్పీ ధరల కు అమ్మకాలు చేస్తున్నారు. కానీ సిండికేట్ కారణంతో విచ్చలవిడిగా పెరిగిపోతున్న బెల్ట్ షాప్ నిర్వాహకులు వల్ల క్వాటర్ 30/రూ. లు హాఫ్ పై 60/రూ. లు ఫుల్ పై కనీసం 120/రూ. లు బీర్ పై 50/రూ. లు అదనంగా వసూలు చేస్తున్నారు. వైన్ షాపుల్లో లేని బ్రాండ్లు బెల్ట్ షాప్ లో ఉండడం గమనార్హం. ప్రతి ఒక గ్రామంలో వీధి వీధికి బెల్ట్ షాప్ వెలవటంతో ఆంతర్యమేమిటో అర్థంకాని పరిస్థితి. ఒక్కమాటలో చెప్పాలంటే సంబంధిత అధికారులు, కేవలం గుడుంబా స్థావరాల పై దృష్టి పెట్టడంతో పరోక్షంగా బెల్టుషాపులు నిర్వాహకులను పెంచి పోషించినట్లుశీదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ 5 మండలం లో మొత్తం గ్రామ పంచాయతీలు 104 ఉండగా మొత్తం గ్రామ పంచాయతీల్లో సుమారు 1000 పైగా బెల్టుషాపులు నిర్వాహకులు బెల్టుషాపులు నడుపుతున్నారు.పట్టణ ప్రాంతాల్లో, మండల కేంద్రాల్లో రాత్రి సమయంలో మద్యం దొరకదు కానీ గ్రామాలలో ఏ మధ్య రాత్రి అయిన బెల్టు షాపు తలుపు తట్టిన చాలు (ఏ టీ ఎం) లాగ కావలసిన మద్యం ప్రత్యక్షం అవుతుంది. ధర ఎంతైనా పర్వాలేదు అన్నట్లుగా మద్యం ప్రియులు వ్యవహారం ఉంది.

**పెడదారి పడుతున్న యువత...**

గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుషాపులు నిర్వహణతో ప్రధానంగా యువత పెడదారిలో ప్రయాణిస్తుంది. ఎంతో విలువైన తమ భవిష్యత్తును అబాసుపాలు చేసుకుంటున్నారు. గ్రామాల్లో రాత్రి మద్యం అమ్మకాలు చేయడం వల్ల యువత మద్యం మత్తులో ఏం చేస్తున్నారో అర్థం కాకుండా అయిపోయింది. కొన్ని సందర్భాల్లో తమ విలువైన ప్రాణాలను కూడా యువత పోగొట్టుకున్న సంఘటనలు ఉన్నాయి.

**పేరుకు కిరాణం.. అమ్మేది మద్యం**

5 మండలంలో పలు గ్రామాల్లో ఎక్కువమంది పేరు కిరాణా దుకాణాలు నిర్వహిస్తూ లోపల మాత్రం మద్యం వ్యాపారం చేస్తున్నారు. సొంత ఇళ్లలో పెద్ద ఫ్రిజ్ లు పెట్టుకుని మరీ మద్యం విక్రయిస్తున్నారు. కిరాణం దుకాణం దగ్గర మద్యం సేవించి ఇళ్ల మధ్యలో గొడవలు పడుతూ అర్ధరాత్రి వరకు నానా రభస చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రతి గ్రామంలో బెల్టుషాపులు కారణంగా మద్యం ఏరులై పారుతుంది.పచ్చని సంసారంలో

**మద్యం చిచ్చు**

విచ్చలవిడిగా గ్రామాల్లో దొరుకుతున్న మద్యం పచ్చని సంసారంలో చిచ్చు పెడుతోంది. దీంతో పొద్దంతా పని చేసి సంపాదించిన



సొమ్మును మద్యానికి వేచిస్తూ కుటుంబాలను వీధిన పడేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో భార్య భర్తలు గొడవలు పడి మద్యం మత్తులో క్షణికావేశం లో ఏమి జరిగింది అనే తెలుసుకునే లోపు కుటుంబంలో ఉన్న వ్యక్తులు అనాథలుగా మారిపోతున్నారు.

**పట్టించుకోని అధికారులు**

**గ్రామాల్లో మద్యం అమ్మకాలు**

సిండికేట్ గా మారడం తో బెల్టుషాపులు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. హోటల్ లు కిరాణా షాపులు, బెల్టు షాపు గా తయారవుతున్నాయి. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు లాభార్జన దేంగా గ్రామీణ ప్రాంతాల వారికి విక్రయిస్తున్నారు. మద్యం షాపులు రహదారుల పక్కన నిర్వహించరాదని అధికారికంగా వెల్లడించినప్పటికి గ్రామాల్లో రోడ్డు పక్కన దర్జాగా మద్యం విక్రయిన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి ఇకనైనా ఎక్సైజ్ శాఖ తో పాటు పోలీస్ సిబ్బంది మరియు సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి గ్రామాలలో, తండాలలో పట్టణాలలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులను సీజ్ చేయాలని, తండాలలో, గ్రామాలలో, ప్రజలు, యువత మద్యానికి బానిస కాకుండా కఠినమైన ఆంక్షలు విధించాలని సామాన్య ప్రజలు వేడుకుంటున్నారు..

## షాపునకు వెళ్తున్నానని చెప్పి వెళ్లి.. అదృశ్యం



**జహీరాబాద్, అక్టోబరు 10 ప్రజా బలం ప్రతినిధి:** జహీరాబాద్‌లో ఓ యువతి అదృశ్యమైనట్లు పట్టణ ఎస్సై లవకుమార్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా నాగరానికి చెందిన పోతల హారిక (21) 15 రోజుల క్రితం తల్లిదండ్రులతో గొడవపడి జహీరాబాద్‌లోని తన మేనమామ బి. శివరాజ్ యాదవ్ ఇంటికి వచ్చింది. ఈ నెల 9న మధ్యాహ్నం షాపునకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. అనంతరం తన మేనమామకు వాట్సాప్‌లో 'నేను వెళ్లిపోతున్నా.. నా కోసం వెతకకండి' అని సందేశం పంపింది. బంధువులు, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. అదృశ్యమైన సమయంలో ఎరుపు రంగు పంజాబీ డ్రెస్ ధరించి ఉందని, ఎత్తు సుమారు 5.4 అడుగులు, తెలుపు రంగులో ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## కొత్లపూర్ పేకాట ప్రియులనుఅదుపులోకి తీసుకున్న మర్పల్లి సబ్ ఇన్స్పెక్టర్



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్10-2026** తేదీ నాడు కొత్లాపూర్ గ్రామంలో లో మల్లయ్యా చాయ్ హోటల్ లో లో 06 గురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా పోలీస్ వారు పట్టుకోవడం జరిగింది మరియు వారి వద్ద నుండి 2440 రూపాయలు స్వాధీనం చేసుకోవడం జరిగింది ఇటు వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. అని మర్పల్లి సబ్ ఇన్స్పెక్టర్ రవుఫ్ తెలిపారు

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక..
## ఎంగిలిపూల బతుకమ్మ

**మహిళల ఆటపాటలతో ప్రారంభమైన పూల పండుగ..**

**7 రోజుల పాటు బతుకమ్మ సంబరాలు**

**వేములవాడ, అక్టోబర్ 10: (ప్రజాబలం ప్రతినిధి)**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేములవాడ పట్టణంలో ఉత్సాహంగా ప్రారంభమైంది. బతుకమ్మ సంబరాల్లో తొలి రోజైన ఎంగిలిపూల బతుకమ్మను మహిళలు శనివారం ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ప్రకృతిని పూలతో ఆరాధించే ఈ పండుగలో భాగంగా మహిళలు వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో వేడుకల్లో పాల్గొన్నారు.తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐకమత్యానికి, ప్రకృతి ప్రేమకు ప్రతీకగా బతుకమ్మ పండుగ నిలుస్తుంది. తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి, వాటి చుట్టూ చేరి సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ



మహిళలు సందడి చేశారు. ఆటపాటలతో పండుగ వాతావరణాన్ని నింపారు.ఏడు రోజుల పాటు బతుకమ్మ సంబరాలువేములవాడ పట్టణంలో ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమయ్యే బతుకమ్మ సంబరాలు ఏడు రోజుల పాటు కొనసాగుతాయి. ప్రతిరోజూ ప్రత్యేకమైన పేరుతో, సంప్రదాయ పద్ధతుల్లో బతుకమ్మను పూజిస్తూ మహిళలు వేడుకలను నిర్వహిస్తారు. చివరి రోజైన సద్దుల బతుకమ్మతో ఈ సంబరాలు మరింత వైభవంగా ముగుస్తాయి.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తోంది. మహిళలంతా ఒకచోట చేరి ఆనందంగా జరుపుకునే ఈ పూల పండుగ వేములవాడ పట్టణంలో ఆధ్యాత్మికతను, సాంస్కృతిక వైభవాన్ని చాటిచెబుతోంది.

## విజయవాడ రైల్వే స్టేషన్లో దసరా భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

విజయవాడ విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలను పురస్కరించుకుని రైల్వే శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. విజయవాడ రైల్వే స్టేషన్కు వచ్చే భక్తుల రద్దీని నియంత్రించడంతో పాటు, ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంది. ఐజీ బి రాజకుమారి మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఏడు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది. కేరళ, తమిళనాడు, సికింద్రాబాద్, విశాఖపట్నం, గుజరాత్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ప్రయాణ సౌకర్యాలు కల్పించేందుకు రైల్వే అధికారులు చర్యలు చేపట్టారు అక్టోబర్ 10 నుంచి 22వ తేదీ వరకు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు అమలులో ఉంటాయని తెలిపారు.

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సాధారణ సిబ్బందితో పాటు అదనపు బలగాలను రంగంలోకి దించారు. మూడు షిఫ్టుల్లో సుమారు 100 నుంచి 200 మంది రైల్వే సిబ్బందిని భద్రతా విధులకు కేటాయించారు. భక్తుల రాకపోకల సమయంలో తోపులాటలు, క్రాస్ వాకింగ్ జరగకుండా ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను వేర్వేరుగా ఏర్పాటు చేశారు.రైల్వే స్టేషన్లోని పార్సల్ కార్యాలయం వద్ద అడ్డుగా ఉన్న గోడను తొలగించి, భక్తులు సులభంగా నడిచివెళ్లేలా మార్గాన్ని సౌకర్యవంతంగా మార్చారు. జీఆర్పీ (ఉఖీఖ), ఆర్పీఎఫ్ (ఖీఖఈ), లా అండ్ ఆర్డర్ పోలీసుల సమన్వయంతో కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. రైలు ప్రయాణంలో ఏదైనా సమస్య ఎదురైతే 139 నంబర్కు, అత్యవసర పోలీసు సహాయం కోసం 112 నంబర్కు ఫోన్ చేయాలని అధికారులు సూచించారు. తప్పిపోయిన చిన్నారుల వివరాలను గుర్తించేందుకు పోలీస్ అవుట్పోస్టులను కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. దసరా ఉత్సవాల సందర్భంగా విజయవాడకు వచ్చే భక్తులు రైల్వే శాఖ సూచనలను పాటిస్తూ సురక్షితంగా తమ ప్రయాణాన్ని కొనసాగించాలని కోరారు.

## ఎత్తం నరసింహ మృతికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సంతాపం.

వనపర్తి మండలం చిట్యాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కురుమూర్తి తండ్రి ఎత్తం నరసింహ మృతి పట్ల మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.నరసింహ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భాను ప్రకాష్ రావు,సూర్యవంశం గిరి, చిట్యాల రాము,సర్పంచ్ శోభ కృష్ణ,అరుణ్ యాదవ్, దొడ్ల యాది, తప్పెడ అశోక్,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com